ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక



4 అణాలు
29-9-'54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



పర్ ఛాయ్

ఫోటో: వె. రామకృష్ణరావు, బందరు.


నేడే చూడండి!
నాగయ్య, జి. వరలక్ష్మి, రేలంగి, జమున, నరసింహారావు, ప్రభావతి, మాస్టర్ వెంకటేశ్వర్
నటించిన
విక్రమ్ వారి
మా గోపి
రచన... కొవ్వలి
మాటలు.. అనిసెట్టి
ఆర్ట్.. గంగా
సంగీతం... విశ్వనాథం, రామమూర్తి
స్టూడియో.. రేవతి
దర్శకత్వం, ఛాయాగ్రహణం
B.S. రంగా.
నవయుగ రిలీజ్

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 5
29-9-54

జయ ఆశ్వయుజ శుద్ధ విదియా బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం : ప్రకాశ్ ప్రొడక్షన్స్‌వారు తీస్తున్న "అంతే కావాలి" అనే చిత్రంలో లక్ష్మీకాంత.

వచ్చే వారమే దసరా సంచిక

పిల్లలకు ప్రత్యేకాకర్షణ

★

ఆంధ్రదేశంలో వాడవాడలా అత్యంత వైభవంగా జరిగే విజయదశమి పర్వోత్సవం పిల్లలందరికీ సంతోషదాయకమైనది. కొత్త తోరణాలతో, కొత్త ముగ్గులతో, కొత్త ముస్తాబులతో శోభాయమానమై వెలిగే ప్రతి తెలుగు గృహానికీ మరొక కొత్త అలంకారాన్ని చేకూర్చాలనే ఉద్దేశ్యంతో, వచ్చేవారం ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికను (6-10-54) పిల్లల దసరా సంచికగా ప్రకటిస్తున్నాము. బాలబాలికలే రచించిన చిత్రాలతో, కథలతో, గేయాలతో ఈ సంచిక ఆహ్లాదకరమై, మీ పండుగ సంతోషాన్ని ఇనుమడింపజేస్తుందని విశ్వసిస్తున్నాము. సుమారు 50 చిత్రాలతో ఈ సంచిక సర్వాంగసుందరంగా ఉండగలదు.

విశాలాంధ్ర అంతటా ఆంధ్రులందరి అభిమానాన్ని చూరగొన్న ఆంధ్ర 'వారపత్రిక' దసరాసంచిక ప్రతి బాలుని హస్తాన్ని, ప్రతి బాలిక హస్తాన్ని విధిగా అలంకరించాలని మా ఆశయం.

★

68 - పేజీలు

వెల పావలా మాత్రమే

నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి

కాలక్షేపం

దాసు వామనరావు

"భోగాపేక్ష తొలంగె; బూజ్యత చెడెన్;
బోరాని మిత్రుల్ మహా
భాగుల్ వెల్లిరి; దండ మూతగొనుటల్
ప్రాప్తించె; గన్నుల్ తమో
రోగచ్ఛన్నములయ్యె; దేహము జరా
రూఢంబు, ప్రాణానిల
త్యాగాపాయ భయంబునన్ వడకెడున్
దా నెంత సమ్మూఢమో!"

తా॥ భోగములమీది కోరిక తొలగిపోయింది. నాకుగల పూజ్యత చెడింది. (నే నితరులకు రోతగా ఉన్నాను.) నా తోడి మిత్రులందరూ చనిపోయిరి. చేతితో కర్ర పట్టుకొనుట సంప్రాప్తించింది. కన్నులు వ్యాధిచేత పొరలు గప్పి గన్పించుట లేదు. దేహములో ముసలితనము బాగా ప్రవేశించింది. కాని, లోపలి ప్రాణవాయువు వెడలిపోవునేమో యను భయముతో వడకుచున్నదీ తెలివిలేని శరీరము.


చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లుగా, అనుభవించే శక్తి అడుగంటిపోయినా అనుభవించవలెననే ఆశ అడుగంట లేదని పై పద్యంలో వివరింపబడింది. కానీ అసలు విషయం దరియాప్తుచేస్తే, ఏవ్వేది ఎవరు అనే ధర్మమీమాంస తప్పకుండా కలుగుతుంది. శోకించేది మనస్సు - శుష్కించేది శరీరము. అయితే, యీ మనస్సు అనేది శరీరంలోని భాగస్వామిగా ఉన్నదా? శరీరంతో సంబంధం లేకుండా, శరీరానికి వెలుపల ఉన్నదా? శరీరశాస్త్రం ప్రకారంగా మన తలకాయలో మెదడు అనేది ఉంది. ఆ మెదడు సరిగా పనిచేసినంత కాలము మనకు మనస్సు సరిగ్గా ఉంటుంది. మనకు ఏదైనా దుఃఖము మొదలైన రసానుభవం గాని, ఒక విషయమునుగురించిన అనుభవజ్ఞానము గాని, ఒక పని చేయవలెననే దృఢ సంకల్పం గాని, యీ మెదడులోని నాడులు పనిచేయడంవల్లనే కలుగుతుంది.

మిఠాయి దుకాణానికి వెళ్ళినప్పుడు అక్కడ ఉండే లడ్డూలను మనము కళ్ళతో చూస్తాము. చూడగానే అవి లడ్డూలనిన్నీ, అవి తింటే తియ్యగా ఉంటాయనిన్నీ, మనకు యిదివరలో ఉన్నటువంటి

ఆంధ్ర పత్రిక సచిత్ర వార పత్రిక సంపాదక వర్గంలో ఒకరైన విశ్వాత్ముల నరసింహ మూర్తి గారు 19-9-54 ఆదివారం పగలు 12 గంటలకు ఆకస్మికంగా మరణించినారని తెలపడానికి విచారిస్తున్నాము. వీరి వయస్సు 31 సంవత్సరాలు. స్వస్థలం గుంటూరు.

నరసింహ మూర్తి గారు 1950 అక్టోబరులో ఆంధ్రపత్రిక కార్యాలయంలో సహాయ సంపాదకులుగా చేరారు. వీరు గుంటూరు హిందూ కళాశాలలోను, రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలోను విద్యార్జనం చేసి పట్టభద్రులైనారు.

చిన్నప్పటినుంచీ చిత్రలేఖనంలో అభినివేశం చూపుతూ, అనేక చిత్రాలు రచించి బహుమానాలు, ప్రశంసలు పొందారు.



కీ॥ శే॥ విశ్వాత్ముల నరసింహమూర్తిగారు.

చిత్రలేఖనమే జీవిత లక్ష్యంగా పెట్టుకుని ఎంతో కృషి చేశారు.

ఆంధ్ర 'వార పత్రిక' లో 'పంచ తంత్రం' కథలను చిత్రాలుగా రచించి వీరు ఆంధ్ర దేశంలోనూ, అఖిల భారతంలోనూ పలువురి పొగడ్తలందుకొన్నారు. పంచ తంత్రం లోని 'లబ్ధనాశం' కథ మొదలు పెట్టి, అస్వస్థత మూలంగా ముగించలేక పోయారు.


ఆంధ్ర గ్రంథ మాల ప్రచురించిన వీరి పంచ తంత్రం మొదటి భాగం అయిదు మాసాలలోనే రెండో ముద్రణకు వచ్చింది.

పిల్లలకోసం 'డన్ క్విక్ సెట్' 'ముచ్చటగా ముగ్గురు' అనే నవలలు అనువదించారు. 'అన్నా చిన్నా' అనే నవల అనువాదం మొదలు పెట్టి, ముగించకుండానే కాలధర్మం చెందారు.

సుమారు మూడు నెలలు పైగా వ్యాధిగ్రస్తులై వుండి, ఆకస్మికంగా బ్రోంకో న్యుమోనియా జబ్బు వల్ల వీరు మరణించారు.

★ కాలక్షేపం ★

అనుభవజ్ఞానమును బట్టి, స్మరణకువస్తుంది వస్తువును చూడగానే ఆస్ఫురణతో వెనువెంటనే స్మరణకూడా కలుగుతుంది. వెంటనే మనకు నోటిలో నీరు ఊరుతుంది. అంటే ఏమిటి? ఆలడ్డూలను తినకపూర్వమే, వాటిని తింటూఉన్నప్పుడు కలిగెడి తియ్యని రసానుభవము శరీర భాగమైన నాలుకకు కలుగుతుంది ఈ రసానుభవం కలిగిన వెంటనే వాటిని కొనుక్కొని తినవలెననే సంకల్పం కలుగుతుంది. చంటిపిల్లవాడైతే ఆలడ్డూను అప్పటికప్పుడే చేతితో లాగి, నోటిలో వేసికోవచ్చు. ఈ చేష్టలన్నీ ఇంచుమించు ఒక్కసారిగానే జరుగవచ్చు. దీపం వెలుగుట, ఎలెక్ట్రిక్ వింజామరం గిర్రున తిరుగుట, రేడియో సంగీతం ప్రారంభించుట అన్నీ ఒక్కసారిగా మీట నొక్కగానే జరిగినట్లుగా ఉంటుంది.



అది లడ్డూ అనే భావమూ, అది తింటే హాయిగా ఉంటుందనే రసమూ, అది తినవలెననే సంకల్పమూ, ఒక్కసారిగా ఒకదానివెంట ఒకటి మనోవేగంతో కలుగుతాయి. భావం, రసం, సంకల్పం, ఈమూడూ ఎక్కడనుంచి ఉదయిస్తున్నవని ప్రశ్నిస్తే మెదడులోని నాడులలోనుంచి ఉద్భవిస్తున్నాయి. అయితే, మెదడులోని నాడులు కేవలము కేంద్ర ప్రభుత్వపీఠమువంటివి. మెదడుమనశరీరానికి ఢిల్లీ నగరంవంటిది. కాని, యీ కేంద్ర ప్రభుత్వపుశాఖాధికారులు దేశమంతటనూ విస్తరించి ఉన్నారు. ప్రతిగ్రామంలోనూ, ప్రతిపల్లెలోనూ, ప్రతి పేటలోనూ, కేంద్ర ప్రభుత్వాధికారం అనేది అనేక డిపార్టుమెంట్ల తాలూకు ఆఫీసర్లద్వారా విస్తరించి ఉంది. అదేవిధంగా మెదడులో కేంద్రీకరింపబడిన నాడులు చిలవలు పలవలుగా కొమ్మలు రెమ్మలుగా దేహమంతటనూ విస్తరించి ఉన్నాయి. కనుక మనస్సు అనేది యీ నరాలద్వారా ఈ నాడులద్వారా పనిచేస్తూ ఉంటుంది. మనస్సుయొక్క అధికారం దేహమంతటా వ్యాపించి ఉంది. మనస్సు అనేదానికి "భగవంతుడు" అని నామకరణంగాని, కేవలం "ఆత్మారాముడు" అనే ముద్దుపేరుగాని పెట్టినట్లయితే, ఈ"భగవంతుడు" యీ శరీరంలో ఎక్కడ ఉన్నాడయ్యా అంటే, "సర్వోపగతుడు" అని జవాబు చెప్పాలి. "ఇందు గలడందు లేడని సందేహమువలదు." అతడు సర్వోపగతుడు అని నిర్వివాదంగా అంగీకరించాలి.

మనం నిద్రపోతూ ఉంటే. వీపుమీద నల్లి కుట్టిందనుకోండి. వెంటనే ఆ నిద్రలోనే ఆత్మారాముడు మన కంటెముందుగా నిద్రలేస్తాడు. వీపుమీద ఉన్న నరాలద్వారా నల్లి కుట్టిన బాధ మెదడుకు చేరుతుంది. వెంటనే చేయి కదులుతుంది. చేతి నరాలు కదులుతాయి. చేయివెళ్ళి వీపును గోకుతుంది. అక్కడ ఉండే నల్లిని నలిపివేయడానికికూడా చెయ్యి ప్రయ

ఒక ముసలి జమిందారు ఒక పడుచును రిజిష్టరు పెళ్లిచేసుకుంటున్నాడు. గుమాస్తా సంతకం పెట్టమని కలం చేతికి ఇచ్చాడు. దానితో కొంచెం సేపు కుస్తీపట్టాడు కాని అది సరిగా వ్రాయ లేదు. జమీందారుకు ఒళ్లు మండింది.

"నాలుగైదు సార్లనుంచి చూస్తూన్నాను. ఈ వ్రాయని కలమే ఇస్తున్నావుకదూ. ఛీ ఛీ! ఈ సారి నా కలమే తెచ్చుకుంటానులేఉండు."

త్నిస్తుంది. మనం నిద్రపోతూనే అప్రయత్నంగా యీపని అంతా చేయడంలో ఆశ్చర్యమేమీలేదు. కాని, యింతకంటె ఆశ్చర్యకరమైన పనులు కూడా ఆత్మారాముడు చేస్తాడు. నిద్రలోనే లడ్డూలు తిన్నట్లుగా ఆనందిస్తాడు. నిద్రలోనే పాము వచ్చినట్లుగా భయపడి ఒళ్లంతా చెమటలు పోస్తాయి. నిద్రలోనే దొంగలు వచ్చి గొంతుక పిసికినట్లుగా భయపడి "అమ్మో! మ్మో! మ్మో! బ్బ్యా! బా!" అని అరుస్తాడు. నిద్రలోనే పులిహోర ఆరగించినట్లుగా ఆనందించి, ఆ పులిహోరలోని మిరపకాయలను కసకస నమిలినట్లుగా రసానుభవం పొంది, ఆ మిరపకాయల కారంతో ఆ నిద్రలోనే కారమమకారానంద బాష్పములు కంటివెంట వచ్చిన వాళ్లుకూడా ఉన్నారు. నిద్రలోనే అలయమునకు వెళ్లినట్లుగానూ, అచట కొలనులో స్నానం చేసినట్లుగానూ, స్నానం చేసి ఒళ్లంతా తుండుగుడ్డతో తుడుచుకొన్నట్లుగానూ, మనస్సులో కేవలం భావన కలుగుట మాత్రమే కాదు. కొలనిలోని చన్నీళ్ళలో స్నానం చేస్తూ ఉంటే చలిపుట్టి గజగజ శరీరం నిద్రలో వణకుటమాత్రమే కాదు. నిద్రపోతూనే, కండ్లు తెరువకుండానే, పరుపుమీదనుండి లేచి తుండుగుడ్డచేత బట్టుకొని కొంతదూరం (నిద్రలోనే నడచి), నిద్రలోనే తలుపు గడియతీసి తలుపు తెరచుకొని బయటికివెళ్ళి, వీధి అరుగుమీద కూర్చుండి, నిద్రపోతూ తువ్వాలతో ఒళ్లు తుడుచుకొని, తిరిగి ఇంట్లోకివచ్చి, పరుపుమీద పరున్నటువంటి వాళ్లుకూడా ఉన్నారు. ఇటువంటివాళ్లనే స్వప్నసంచారులంటారు. ఇంగ్లీషులో (*Somnambulists*) "సామ్నాంబలిస్ట్సు" అంటారు. ఒక స్వప్నసంచారి నిద్రలోనే దొమ్మరవానివలె సన్నని గోడ అంచుమీద నడవడం ప్రారంభించాడు. గోడ అంచుమీద పడకుండా నిద్రలోనే నడుస్తూ ఉంటే మరొక పెద్దమనిషి చూచాడు. కాని, అటువంటిపరిస్థితిలో వానిని నిద్రనుంచి లేపడం చాలా ప్రమాదకరం అని అనుభవజ్ఞులైన పెద్దలు అంటారు. ఆ సమయంలో నిద్రలేపినట్లయితే, వెంటనే ఆ ఎత్తుగోడమీదనుంచి ఆమనిషి తూలి క్రింద పడిపోతాడు. నిద్రలో చేయగలిగినపనిని, నిద్ర లేపగానే చేయలేడు. ఈవిధంగా నిద్రావస్థలోకూడా మెదడు అనేది తన వ్యాపారసంచారం సాగించడం సాధ్యమేగాని అసాధ్యం కాదు.

ఒకానొక విద్యార్థి గణిత బోధినిలో ఉన్న ఒక చిక్కయిన లెక్కను చేయడం ప్రారంభించినాడు. ఆ రాత్రి ఒక గంటసేపు ఆ లెక్క ఎట్లా చెయ్యాలో తెలియక చాలా అవస్థపడి, ఆ పుస్తకం తనప్రక్క నేపడవేసి నిద్రపోయినాడు. అతనికి ఆ రాత్రి స్వప్నంవచ్చి, ఆ లెక్క చేయుటకు వీలైన సులభమార్గం కన్పించింది. ఆ పద్ధతిగా తాను ఆ లెక్కను చేసినట్లుగా కల వచ్చింది. తెల్లవారు జామున నిద్రలేచి సరాసరిగా స్వప్నమార్గమే మోక్షమార్గం అన్నట్లుగా అనుసరించి లెక్క చేసేసరికి సవ్యంగా దివ్యంగా లెక్కలో ఉన్న చిక్కు విడిపోయింది. "అలవైకుంఠ పురంబులో నగరిలో" అనే పద్యం అంతవరకు వ్రాసి; ఆ తాటిఆకును పీఠంమీద పెట్టి గాఢంగా నిద్రపోయిన శ్రీ బమ్మెరపోతరాజుగారికి ఆ నిద్రలోనే ఆ పద్యం పూర్తి చేసే విధం బోధపడి "అమూల సౌధంబు" దగ్గిరా సమూలంగా సమగ్రంగా కంటికి కట్టినట్లుగా గోచరించినదనే విషయంలో అభూతకల్పనా దోషం లవలేశమూ ఉండజాలదు. ఆ నిద్రలో ఆయనకు ఆ పద్యం పూర్తిచేసినది ఆయన ఆత్మారాముడే. "పల్కించెడివాడు రామభద్రుండట" అనే మాటలు ఆయన మనలను మోసంచేయడానికీ బడాయికీ చెప్పిన గప్పాలూ డప్పాలూ కావు.

కాబట్టి మనము మెలకువగా ఉన్న కాలమందు మన మనస్సు పనిచేయడం వింత విషయం కాదు. మనం నిద్రపోతున్నప్పుడుకూడా మన మనస్సు పనిచేస్తుంది. మెదడు మాత్రమేకాదు శరీర అవయవాలు కూడా నిద్రలో పనిచేస్తాయి. కాబట్టి, దేహంలో ఉన్న ప్రతి నరంలోనూ ప్రతి రక్తనాళంలోనూ మనస్సు అనేది అంతర్లీనమై, సర్వవ్యాప్తమై పని చేస్తోంది. సంకల్పం అనేది మెదడులో మాత్రమే పుట్టి మెదడులోనే పని చేస్తుందనే మాట అబద్ధం. సంకల్పశక్తి అనేది శరీరంలోని ప్రతి అణువులోనూ, ప్రతి రక్తనాళంలోనూ, అంతర్గతమై ప్రతి రక్తకణంచేతనూ పనిచేయిస్తుంది. నీరు పల్లమెరుగును అన్నట్లుగా మన సంకల్పధోరణినిబట్టి మన శరీరవ్యాపారం జరుగుతూ ఉంటుంది. బయట చలిగాలి వేస్తే, ఆ చలిబాధను తప్పించుకోవలెననే సంకల్పం శరీరంలో పనిచేస్తుంది. శరీరం ముడుచుకుంటుంది. రక్తనాళాలు కూడా ముడుచుకుంటాయి.

అయితే, హిమవత్పర్వత ప్రాంతంలో మంచుగడ్డలలో చలికిచలించకుండా తపస్సు చేసిన యోగుల మాట ఏమిటి? చలికి శరీరం ముడుచుకోనదు - చలిబాధను తప్పించుకోవలెననే సంకల్పం వారికి లేదు. "ఎట్లాగైనా బ్రతుకవలెను" అనే సంకల్పంతో జీవరాసులన్నీ యీ జగత్తులో ప్రాకులాడుతున్నాయి. ఆ సంకల్పంతోనే నానా యాతనలూ పడి పడరానిపాట్లు పడి, యిడుమల బడి, యీదులాడి, కష్టించి, క్రుంగి, కృశించి, నశిస్తున్నాయి. ఈ యాతనలన్నీ పడకపోతే శరీరాన్ని పోషించడం ఎట్లా? అనే ప్రశ్న బాగానే ఉంది. ఈ యాతనలన్నీ పడడంవల్ల యీ మనోవ్యథ మథనవల్ల శరీరం శిథిలం అగుటలేదా? అనే ప్రశ్నకుకూడా జవాబు చెప్పవలసి ఉంటుంది. సంకల్పం అనేది లేకుండా ఉంటే, యీ శిథిలం అనేదికూడా ఉండదు దనే సిద్ధాంతం ప్రాచీనకాలంలో, యోగమార్గం అవలంబించిన తపస్సంపన్నులు మొట్టమొదట యీ దేశంలో గ్రహించారు.

వాడుల నన్నింటినీ యోగశక్తివల్ల స్తంభింపజేస్తే, మనస్సు అనేది శరీరరక్షణకోసం ప్రాకులాడదు. శరీర రక్షణకొరకు మనస్సు వ్యాకులపడదు.



పొలుపుగ మాటనేర్చినవి మూగవి కుండలు రెండువేలు, లో
పల నొకమూలనుండి యిటువల్కెననుంగని, "కుంభకారులున్
విలిచినవారు, మమ్ముఁ బురివీథుల నమ్మినవార లేరి? యే
తలమున కేగినారలు? వదంతి యెదేనియు విన్నదెల్పుమా." (-పానశాల)

—ఫోటో: డి. రామలింగేశ్వరరావు

★ కాలక్షేపం ★

మహాభారతకాలం నాటికి యోగశక్తిమహిమను మనపూర్వులు బాగా గ్రహించారు. "నాస్తి సాంఖ్య సమమ్ జ్ఞానమ్ - నాస్తి యోగసమమ్ బలమ్" అని మహాభారతంలో చెప్పబడిఉంది. యోగశక్తికి సమమైనబలము లేదన్నారు. ఇప్పటికి 7 వేల సంవత్సరముల క్రిందట అనగా క్రీస్తుకు పూర్వము 5 వేల సంవత్సరాల క్రిందట మొహంజొదారో అనే నగరమొకటి సింధునదీ ప్రాంతంలో ఉండేది. అది యిప్పుడు అక్కడ భూమిని త్రవ్వుతూఉంటే బయటపడ్డది. ఆ పురాతననగరాన్ని త్రవ్వుతూ ఉంటే, ఒక పురుషవిగ్రహం దొరికింది. నాసికాగ్రమున చూపు నిల్పిన ఒక పురుషుని విగ్రహం అది. యోగాసనంలో కూర్చున్నట్లుగా కొల్లవంచబడియుండెను. ఇది "పర్యంకాసనము" అని నిర్ణయించారు. "సింధునదీప్రాంత నాగరికత" (*Indus Valley Civilization*) అనే గ్రంథంలో సర్ జాన్ మార్షలు గారు యీవిషయం వ్రాసినారు. కాబట్టి ఇప్పటికి 7 వేలసంవత్సరముల నాడే యోగాసనములు అనేవి ఉన్నట్లుగా యీ విగ్రహంవల్ల కన్పిస్తోంది. ఆ యోగసమాధిలో ఉన్నప్పుడు మనస్సు అనేది ఒక నిర్వ్యాపారావస్థలో నిర్వృత్త్యవస్థలో ఉంటుందని వర్ణించారు. యోగియైనవాడు సంకల్పరహితుడై ఉంటాడు. అయితే, యోగికి ప్రాణత్యాగం చేయవలెననే సంకల్పం ఉంటుందా? ఆ సంకల్పం కూడా ఉండదు. దీర్ఘకాలం బ్రతుకవలెననే సంకల్పం ఉంటుందా? ఆ సంకల్పమూ ఉండదు మనస్సుకు ప్రవృత్తి అనేది ఉండదు. చావాలనీ ఉండదు - బ్రతుకవలెననీ ఉండదు.

సంకల్పరహితుడైన వాడే వికల్పం లేకుండా శిథిలావస్థ లేకుండా ఉంటాడని యోగులు నిరూపించారు. సంకల్పరహితుడైతే, వికల్పరహితుడవుతాడన్నారు శరీరము శిథిలం కాకుండా, వికల్పం కాకుండా నిర్వికల్పావస్థలో ఉండడానికి మనస్సుయొక్క నిర్వికల్ప సమాధి అవసరమన్నారు. ఇదంతా ఎట్లా సాధ్యమవుతుంది అంటే ఆ యోగులనే అడగవలెను అది తెలియని అయోగులనూ, అయోగ్యులనూ అడిగితే, ఇదంతా అయోమయంగానే ఉంటుంది.

శరీరం కృశించిపోతున్నదనే వ్యాకులంతో ఏడ్చేది మనస్సు అని అంటాము. కాని, శరీరం అంతటనూ, ఆత్మప్రాణరక్షణ సంకల్పం సర్వవ్యాప్తంగా ఉంది. కనుక, శరీరం శిథిలమవుతున్నదని ఏడ్చేది శరీరమే. ఏడుస్తూ ఉండే శరీరాలు ఏడుస్తూనే ఉంటాయి. శరీరంకోసం ఏడ్చేది మనస్సు అనే మాట వట్టి అజ్ఞానం; వట్టి తమస్సు.

"ప్రజ అనేది శరీరం - ప్రభుత్వం అనేది ఆత్మ -" అనే మాటలకు ఎంత అర్థం ఉన్నదో శరీరాన్ని రక్షించేది ఆత్మ అనే మాటలోకూడా అంతే అర్థం ఉంది. ప్రజాప్రభుత్వం అనే సిద్ధాంతమునకు ప్రజల సంకల్ప బలంతో కూడిన ప్రభుత్వం అని అర్థం చెప్పవలసి ఉంటుంది. ప్రభుత్వ మంత్రివర్గం ఏ విధంగానైనా తమ అధికార పీఠం తాము కాపాడుకోవలెనని సంకల్పించి ప్రాకులాడిన కొలదిన్నీ,

(55-వ పేజీ చూడండి)

దాక్షిణ్యాలోభం

1

రైలు పోతోంది. పెట్టెలో చాలా ఉక్కపోతగా ఉంది. వేసవి కాలం. పైగా జనం క్రిక్కిరిసి ఉన్నారు. దానికితోడు పళ్లూ, బిస్కట్లూ, మందులూ, పుస్తకాలూ అమ్మే వాళ్ల బెడద. ఇక బిచ్చగాళ్లుకూడా తయారైతే జనం ఎక్కడ సహించగలరు? ఒక గుడ్డివాడు ఒక పిల్ల సాయంతో చిడతలు వాయిస్తూ, 'శివగోవింద గోవిందా' పాడుతూ ముందుకు సాగబోయాడు. కాని ఎవళ్ళూ దారిచేయలేరు. అందువల్ల వాడు తలుపుదగ్గరే నిల్చొని గోలపెట్టున్నాడు. ఒకరిద్దరు కాన్లు గిరవాటేశారు. పిల్ల ఏరుకుని గిన్నెలో పడవేసుకుంది. ఇంతలో మరొక ముష్టిది ఆ పెట్టెలోకే ఎక్కింది. గుడ్డివాడి పక్కన ఉన్నపిల్ల దానితో ఏదో కయ్యిమంటోంది. తనుండగా తనకు పోటీగా మరొకతె రావడం ఇష్టంలేక గుడ్డివాడు మరీ గట్టిగా పాడుతున్నాడు. ఆ వచ్చినమనిషి వాళ్లను లెక్కచేయకుండా, "బాబయ్యా ధర్మం" అంటూ మొదలుపెట్టింది. రెండడుగులు ముందుకు వేసింది. దానితో అన్ని మూలలనుంచి ఒక్కసారిగా పెక్కుగొంతుకలు లేచాయి. "ఈ 'బెగ్గరీ' ఒక ప్రొఫెషన్ అయిపోయింది." "ప్రతివాడూ ముష్టే" "గొడ్డు గేదెలా ఉంది పని చేసుకోకూడదూ?" "ఎందుకు చేస్తుందీ - తేరగా డబ్బులు దొరుకుతుంటేనూ" అంటూ ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ బయలుదేరిన వ్యాఖ్యానాలు విని ఆ ముష్టిది బిత్తరచూపులు చూస్తూ ఆగిపోయింది. ఏమనాలో తోచక కొంతసేపలాగే ఉండిపోయింది. కొందరి దృష్టి ఆమె శరీరం మీదకు పోకుండా ఉండలేకపోయింది. పడుచుదనం ఆకర్షణను చినిగిన గుడ్డలూ, చింపిరి జుట్టూ కప్పిపుచ్చలేకపోయాయి. ముష్టిది కొంచెంసేపటికి మళ్ళీ ధైర్యం తెచ్చుకొని "బాబయ్యా ధర్మం" అంటూ అడుగు వేయబోయింది. "నీకు కాదూ చెప్పేదీ - పనిచేసుకోకూడదూ దుక్కలా ఉన్నావు" అన్నారు మళ్ళీ నలుగురూ. "పనే సేత్తానయ్యా, ఏదైన పనిసూపిత్తే" అంది ఆ ముష్టిది భయంతో. ఎవరూ మాట్లాడలేదు. అంతవరకూ తమాషా చూస్తున్న శంకరం మెల్లగా అన్నాడు: "అవునండీ పనిచేసుకోమన్నారు. పని చేస్తానంటోంది. ఏదన్నా పని చూపించండి మరి" "మా కెందుకయ్యా మధ్య" అని ఎవరిమట్టుకు వాళ్ళు నోళ్ళు కట్టేసుకుని కూర్చున్నారు. ముష్టిది శంకరంకేసి దేవుడికేసి చూసినట్లు చూసింది.

కాసేపటికి ముష్టిది మళ్ళీ మెల్లగా "బాబూ, ధర్మం" అంటూ ముందుకు సాగింది. ఇప్పుడెవరూ అడ్డగించడంలేదు. మౌనంగా దారి చేస్తున్నారు. ముష్టిది గొంతుక మరి కాస్త పెంచి అడుగుతోంది. డబ్బులు వస్తున్నాయి కొందరు కానులూ, అర్ధణాలూ, అణాలు వేస్తున్నారు. ముష్టిది

వా. స. మూర్తి

మెల్లగా శంకరం దగ్గరకువచ్చి "బాబూ, ధర్మం" అంది. శంకరం ఆమెకేసి చూడలేదు కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాడు. "బాబూ, ఒక కానీ" అంది ముష్టిది, కొంచెం గట్టిగా. శంకరం ఆమెకేసి ఒక్కసారి చూసి మళ్ళీ తలతిప్పి కిటికీలోనుంచి బయటకు చూడసాగాడు. ముష్టిది ఆశ్చర్యంతో నిలబడిపోయింది. పెట్టెలో వాళ్ళొక్కసారిగా అందుకున్నారు: "ఏమండీ, ఇందాకా పెద్ద కబుర్లు చెప్పారే. ఇప్పుడొక కానీ పడేయరేం?" "కానీ ఏమిటి? దానిని సమర్థించినవారు కాబట్టి రూపాయి వేయాలి." శంకరం లోపలికి తిరిగి మిగతా వాళ్లకేసి నిర్లక్ష్యంగా చూసి ముష్టిదానితో అన్నాడు: "నేను ముష్టి వేయను. పని ఇస్తాను చేస్తావా?"

"చెయ్యకేం, బాబూ" అంది ఆమె.

"ఏం పని చేస్తావు?"

"ఏదైనా సరే, అయ్యగోరూ."

"మా యింట్లో దాసీమనిషి లేదు. ఆ పని చేయగలవా?"

"సేత్తానయ్యగోరూ."

"అయితే ఎంత జీతం కావాలంటావు?"

"జీతమెందుకు అయ్యగోరూ. ఇంత కూడూ గుడ్డా పెట్టే అంతే చాలూ"

"సరే అయితే ఇక నీవు బిచ్చమడగకు. నీకు కావలసినవి నేనిస్తాను. మా ఊరు తీసుకువెళ్తాను—నీ పేరేమిటి?"

"సుబ్బి, బాబుగోరూ."

శంకరం అక్కడ పండ్లవాడిదగ్గర అరడజను అరటి పళ్లు కొని నాలుగు ఆ మనిషికిచ్చి, రెండు గుడ్డివాడికిచ్చాడు తరువాత స్టేషనులో దిగి సుబ్బికికూడా టిక్కెట్టు కొనుక్కొనివచ్చాడు పెట్టెలోవాళ్లంతా శంకరంకేసి ఈర్ష్యతో అనుమానంతో చూస్తున్నారు. లోలోపల గుసగుసలాడడం మొదలుపెట్టారు. మెల్లగా ఇకిలింపులుకూడా బయలుదేరాయి. వాళ్ళ దృష్టి సుబ్బిమీదినుంచి శంకరంమీదికీ, శంకరంమీదినుంచి సుబ్బిమీదికీ పోతూఉంది కాని శంకరం ఇవేమీ గమనించలేదు. అతను తన ఇంటి విషయం ఆలోచిస్తున్నాడు అక్కడ దాసీమనిషి దొరకక భార్య చాలా ఇబ్బంది పడుతోంది. అన్ని పనులూ ఆమె చేసుకోవలసి వస్తోంది. భార్య అలా బాధపడుతూంటే శంకరం తనూ చాలా బాధపడ్డాడు కాని ఏమీ చేయలేకపోయాడు. ఈ వేళ అదృష్టవశాత్తూ ఈ మనిషి దొరికింది. ఇంత అన్నం పెడితే కావలసిన పనులు చేయించుకోవచ్చు. భార్య చాలా సంతోషిస్తుంది అని ఊహించుకుంటూ కూర్చున్నాడు.

2

అతని స్టేషను వచ్చేసింది. సుబ్బినికూడా దిగమని తను దిగాడు. సామాను పట్టించుకొని స్టేషను వెలుపలకు వెళ్ళాడు. అంతలో అతనికో సమస్య ఎదురైంది. ఇంటికెలా వెళ్ళడం? సుబ్బిని కూడా గుర్రపుబండిలో ఎక్కించుకు వెళ్తే భార్య ఏమనుకుంటుందో! నలుగురూ ఏమనుకుంటారో! గుర్రపుబళ్ళవాళ్ళు "ఎక్కడికి తీసుకెళ్లమంటారు, బాబూ" అంటూ అతనిని చుట్టవేసి సామాను చేతిలోనుంచి లాగబోతున్నారు. కాని శంకరం సమస్యలో పడిపోయి అలాగే నిల్చున్నాడు. ఇంతలో సుబ్బే అంది "బండెందుకయ్యగోరూ. నేను పెట్టి మోసుకొత్తాను. నడిచిపోదాం"

★ దాక్షిణ్యా లోభం ★

బ్రతికించిం దనుకున్నాడు శంకరం. పెట్టె దాని నెత్తిమీద పెట్టి ఇంటికి నడిచాడు.

భార్య వచ్చి తలుపు తీసింది. కాళ్ళు కడుగుకుందుకు నీళ్లిచ్చి కుశల ప్రశ్నలన్నీ అడిగింది. శంకరం అన్నిటికీ జవాబు చెపుతూండగా సుబ్బి పెట్టె దింపి, బెదురుగా చూస్తూ నిలబడింది. శంకరం భార్య మీనాక్షి కూలిమనిషి ఇంతసేపు ఎందుకు నిలబడిందా అని ఆశ్చర్యపోయింది. "డబ్బివ్వలేదేమిటి, అలా నిలబడింది" అంది భర్తతో. శంకరం అన్నాడు: "నువ్వు పనిమనిషి లేక బాధపడుతున్నావుకదూ. అందుకోసం ఈమెను తీసుకువచ్చాను."

"పనిమనిషా? నిన్ననే ఒక మనిషి ఆరు రూపాయలకు కుదిరింది" అంది మీనాక్షి.

శంకరం నోట్లో పచ్చి వెలగకాయ పడింది. మీనాక్షి సుబ్బితో "నువ్వు వెళ్ళమ్మా—ఆ మనిషికి డబ్బులిచ్చి పంపేయండి" అంది మళ్ళీ భర్తవైపు తిరిగి. సుబ్బి శంకరంకేసి తెల్లబోయి చూస్తోంది. శంకరం మీనాక్షికేసి చూస్తున్నాడు. కొద్దిసేపటికి తేరుకొని భార్యను బ్రతిమాలాడు: "ఆ మనిషిని మాన్పించేయి మీనా. పాపం ఈ మనిషికి తప్పక పని చూపిస్తానని ఆశపెట్టి తీసుకువచ్చాను. ఇలా పంపించివేస్తే బాగుంటుందా."

"నిన్న పనిలోచేరినదానిని ఈ వేళ మానేయమనడంమాత్రం బాగుంటుందా?"

"ఎలాగో అలాగ మాన్పించు. మీనా ఈమనిషినే పెట్టుకో."

"ఎలా మాన్పించనూ? - పోనీ ఈమనిషేమైనా తక్కువకు కుదిరితే అలాగే చేయవచ్చు. ఏమమ్మా, ఇంట్లో అంట్లూ చెంబులూ తోమి, రెండుపూట్లా కసువు చిమ్మి, బట్టలుతికి ఆరబెట్టి, పక్కలు వేసేందుకు ఎంత పుచ్చుకుంటావు? ఇంకొక మనిషి ఆరురూపాయిలకు చేస్తోంది. అంతకన్న తక్కువకుచేస్తానంటే నిన్ను కుదుర్చుకుంటాను. లేకపోతే నువ్వు నీదారిన వెళ్ళిపోవచ్చు" అని స్పష్టంగాచెప్పింది మీనాక్షి పెద్ద వ్యవహారవేత్తలా.

సుబ్బికి ఏం జవాబు చెప్పాలో తెలియక శంకరంకేసే చూసింది. శంకరం గొంతుక సవరించుకొని చెప్పాడు. "ఈ మనిషికి డబ్బులియ్యనక్కర్లేదుమీనా. ఇంత అన్నంపెట్టి బట్టలిస్తే కావలసిన పనులన్నీ చేయించుకోవచ్చు. మనిట్లోనే ఉండి చేస్తుంది."

"బాగుంది ఆరురూపాయలకు కావలసిన పనులన్నీ చేస్తూంటే రెండుపూటలా అన్నంపెట్టి బట్టలివ్వడమెందుకూ, దండగ! అన్నం బట్టలూ అంటే ఊరికే ఉందనుకున్నారా" అని ఆగి మళ్లీ "అసలు ఈ మనిషంటే ఏమిటి ఇంత ఇదవుతున్నా"రంది మీనాక్షి గట్టిగా.

శంకరం పని ఇరకాటంలో పడింది. "కాదుమీనా. పాపం ఈమనిషి చూసేవాళ్ళెవరూ లేక ముష్టెత్తుకుంటూంటే జాలిపడి తీసుకువచ్చాను -" అకస్మాత్తుగా అతనికొక ఉపాయం తోచింది. ఇటు చూడు మీనా నలుగురిళ్లల్లో పనిచేసేవాళ్లచేత చేయించుకునేకన్న ప్రత్యేకంగా ఒక దాసీచేత చేయించుకోవడం గొప్పగా ఉండదూ? అన్నాడు.

ఉపాయం ఫలించింది. తమకు ప్రత్యేకంగా దాసీఉంటే ఇరుగుపొరుగు అమ్మలక్కలలో తాను గొప్పతనం పొందవచ్చునని తోచింది మీనాక్షికి. "సరే తెచ్చిపడేసేవారికి మీకే భారంగా తోచనప్పుడు మధ్య నాకెందుకు. - ఇదిగో నీ పేరేమిటన్నావు" అని అడిగింది సుబ్బిని. సుబ్బి చెప్పింది. "సరేసుబ్బీ పోయి ముందు దొడ్లో అంట్లుతోము. తరువాత అన్నం పెట్తాను" అంటూ వంటింట్లోకి నడిచింది మీనాక్షి. సుబ్బి దొడ్లో అంట్లు తోమడం మొదలుపెట్టింది.

3

ఒకటి రెండురోజులు శంకరానికి సుబ్బి విషయం కనుక్కోవడానికి తీరిక లేకపోయింది. తరువాత గమనించగా భార్య మహారాణీవైభోగం అనుభవిస్తూ సుబ్బిచేత అన్ని చాకిరీలు చేయించుకుంటోందని తెలిసింది. మీనాక్షికి ఇప్పుడు ఇటుపుల్ల అటుపెట్టడానికికూడా ఒళ్లు వంగడం లేదు. అవును సొంతదాసీ ఉన్నప్పుడేనా అనుభవించకపోతే ఇంకెందుకు అనే ధోరణిలో ఉంది ఆమె. సుబ్బిమాత్రం ఏమాత్రం విసుగుకోకుండా యజమానురాలు చెప్పిన పనులన్నీ చేస్తోంది. చకచకా చేసివేస్తోంది. కాని ఆమె పనులు త్వరత్వరగాచేసినందుకు తీరుబడి లభించకపోగా మరిన్ని పనులుపైన పడుతున్నాయి. అయినా కిమ్మనకుండా చేస్తూనేఉంది. ఆమె ఇంతలా చేస్తున్నా మీనాక్షి గొంతుచించుకోడంమాత్రం మానలేదు. అధికారం చూపించుకునే ఈ సదవకాశాన్ని ఊరికే పోగొట్టుకోదల్చుకోలేదు మీనాక్షి. ఇదిచూసి శంకరం చాలా బాధపడ్డాడు. అన్నానికాశపడి వచ్చినంతమాత్రాన బానిసగా చూసుకోవడమా. కాని భార్యకు ఈవిషయం నచ్చజెప్పడం చాలా కష్టం. ఎప్పుడో మంచి అవకాశం లభించినప్పుడు మెల్లగా చెప్పి చూడాలనుకున్నాడు.

భోజనాలయినతరువాత రేడియో పెట్టి కూర్చున్నాడు శంకరం. భార్య చాపమీద కూర్చొని తమలపాకులు చుట్టి అందిస్తోంది. పిల్లలు ఇంకొక గదిలో పాఠాలు చూసుకుంటున్నారు. శంకరం వాళ్ళు కూర్చున్న గదిగుమ్మం ఇవతల ప్రక్కగా నిల్చొని సుబ్బి రేడియో వింటోంది. రేడియోలోమంచిపాటవస్తోంది. కొద్దిసేపు తరువాత మీనాక్షి సుబ్బి అక్కడ నిలబడిఉండడం గమనించింది. "సుబ్బీ, పోయి ముందు పక్కలు వేయి" అని కేక వేసింది. "అలాగేనమ్మా" అంటూ వెళ్లబోయింది సుబ్బి. "ఉండు సుబ్బమ్మా", అన్నాడు శంకరం. భార్యవైపు తిరిగి "కాసేపు రేడియో విననియ్యి. పక్కలు తరువాత వేయవచ్చు" అన్నాడు. మీనాక్షి ఒక్కసారి అతనికేసి చురచురా చూసి, "రేడియోకేం, ఎక్కడికీ వెళ్లదుగదా, ముందు పక్కలు వేయనీయండి. పోవే సుబ్బీ" అంది. "అలాగేనమ్మా" అంటూ సుబ్బి వెళ్ళిపోయింది. శంకరం ఒక్కక్షణం తటపటాయించి గొంతుక సవ

"ఆడవాళ్ల దగ్గర రహస్యాలు దాచి లాభం లేదు. అందుచేతనే నెప్పుడూ దాచను. మా యింట్లో మేము ప్రశాంతంగా ఉన్నది అందువల్లనే"

"అవును ఆడవాళ్ల దగ్గర రహస్యాలు దాచి లాభంలేదు. అందు చేతనే నేనూ ఎప్పుడూ దాచను. కాని మా యింట్లో అన్ని చిక్కులూ వచ్చి పడుతున్నది అందు వలననే"

* * *

"మీ ఆయనకు ఈ విషయం అన్నివిధాల నచ్చచెప్పావా?"

"ఆ! కావాలంటే ఇలా వచ్చిచూడు. సొట్ట పడని బొచ్చె ఒక్కటన్నా ఉన్నదేమో!"

రించుకొని మెల్లగా అన్నాడు: "పాపం కాసేపు కూర్చోనీయకూడదూ? ఎప్పుడూ పనేనా?" మీనాక్షి మూతివిరిచేసుకుంది. "ఏమిటీ దానిని నేను ఎప్పుడూ పనితో చంపేస్తున్నానా? లేరగా మేపడానికా తీసుకువచ్చారు? అన్నం పెట్టి, బట్టలు ఇచ్చేటప్పుడు ఈమాత్రం పని చేయించుకోకుండా ఎవరుంటారు?" అంటూ పెద్ద గొంతుకతో మొదలుపెట్టింది. శంకరం కంగారుపడ్డాడు. "కాస్త గొంతుక తగ్గించు మీనా. నువ్వు సుబ్బమ్మని కోసి పెట్టున్నా వని నేననడంలేదు. ఆమె ఎదురుచెప్పడం లేదుకదా, ఏమి చేయమంటే అది చేస్తూనే ఉందికదా, అలాంటప్పుడు కాస్త మెల్లగా చెప్పి చేయించుకోమనే నే ననేది" అన్నాడు ప్రాధేయపూర్వకంగా. మీనాక్షి గొంతుక తగ్గేబదులు మరి కాస్త పెరిగింది. "అయితే దానిని నేను కసిరి కొట్టున్నాననేగా మీ రనేది. ఆ పనిచేయమనీ, ఈ పని చేయమనీ చెప్పడం కూడా తప్పేనా? బ్రహ్మరాక్షసి గొంతుకతో అరుస్తున్నానా?"—అంటూ ఆగి మళ్లీ భర్త కేసి తీక్ష్ణంగా చూస్తూ అడిగింది. "అసలు మీకు దానిమీద ఇంత అభిమాన మేమిటి? ఎక్కడో అడుక్కుతినేదాన్ని తీసుకు రావడమూనూ, దాన్ని రాణీగారిలా చూడాలనడమూ—ఈ వరసేమిటో నాకు బొత్తిగా బోధపడడంలేదు." శంకరం నివ్వెరపోయాడు. తరువాత తేరుకొని "నీ యిష్టం వచ్చినట్లే జరగనీయి, మీనా, నేను కాదనను" అంటూ వెంటనే వేరొక విషయానికి మళ్ళించివేశాడు భార్య దృష్టి.

4

మీనాక్షి ఎప్పటిలా సుబ్బిని గొంతుక పెట్టుకొని చలాయిస్తూనే ఉంది. మీనాక్షి కేకలకు ఏమీ అనుకోవద్దని పోనీ సుబ్బితోనే చెబుదా మనుకున్నాడు శంకరం. పాపం ఏం బాధపడుతోందో సుబ్బి. కాని ఒక్కమాట పైకి రానీయడంలేదుకదా.

ఆ వేళ మధ్యాహ్నం భార్య దొడ్లో కూర్చోని ఇరుగు పొరుగు అమ్మలక్కలతో కబుర్లు చెపుతూ కూర్చుంది. సుబ్బి ఇల్లు ఊడుస్తోంది. అన్ని గదులూ అయినతర్వాత శంకరం గదిలోకి వచ్చి తుడుస్తోంది. అతను ఏదో రాసుకుంటూ ఆగి మెల్లగా అడిగాడు "ఏం, సుబ్బమ్మా, ఇక్కడ బాగానే ఉంటోందా?" "బాగా ఉండకేం బాబూ, నేను జనమలో ఈమాత్రం సుఖమెరుగుదునా" అంది సుబ్బి.

"అమ్మగారు కాస్త కరుకుగా మాట్లాడితే ఏమనుకోకేం" అన్నాడు శంకరం.

"అదేంటయ్యగోరూ! ఎందు కనుకుంటాను? అమ్మగారు చాలా మంచోరు. ఇదివరకు నే నెరుగున్న చాలా అమ్మగార్లకన్న మీనాచ్చమ్మ ఎంతో నయం," అని మీనాక్షి నే సమర్థించింది సుబ్బి.

"అయితే నీకు దగ్గరవాళ్ళెవరూ లేరా—ఇలా ఇంటి మాటేనా తలపెట్టకుండా ఉంటున్నావు?"

"మాకు ఇల్లేంటి అయ్యగోరూ? మా అమ్మ కలరా తగిలి సచ్చిపోయింది. తరువాత మా అయ్య మరొకత్తెను చేరదీశాడు. రోజూ తాగొచ్చి దాన్నీ, నన్నూ కొట్టుంటే ఆఖరికి పడలేక పారిపోయొచ్చా నయ్యగోరూ."

ఇంతలో దొడ్లోనుంచి సుబ్బీ అని కేక వినిపించింది. "వస్తుండానమ్మ" అంటూ సుబ్బి పరుగెత్తుకుపోయింది.

సుబ్బిని గురించే ఆలోచిస్తూ కూర్చున్నాడు శంకరం. ఇంతవరకు ఎన్నడూ సుబ్బి దీనావస్థలో ఉన్న ఒక మనిషి అనే తప్ప వేరుభావం ఉండేదికాదు. కాని ఈ వేళ ఆమెతో మాట్లాడుతూంటే ఆమె నిండు పడుచుదనంలో ఉన్న స్త్రీ అనే భావం చటుక్కున కలిగింది. అటువంటి భావం కలిగినందుకు అతను తన కుర్రతనపు బుద్ధికి తానే నవ్వుకున్నాడు. కాని నవ్వుకున్నంత తేలికగా పోలేదా భావం. వలదనుకున్నా పదే పదే స్ఫురణకు రాజొచ్చింది. అదిమొదలు అతను అనుకోకుండానే సుబ్బివంక చూస్తూఉండి పోతున్నాడు. ఆమె ప్రతి కదలికా అతని దృష్టిలో ముద్రితం కాసాగింది. ఒకటి రెండు మార్లు అతను అలా చూస్తూంటే సుబ్బి దృష్టితో కలవడం సంభవించింది. వెంటనే సుబ్బి పమిట సవరించుకొని సిగ్గుతో తల వంచేసుకుంది. అత నున్నచోటికి ఎప్పుడన్నా రావలసివస్తే బెదురుగా చూస్తూ వస్తోంది. సుబ్బి తన ఎదురుగా ఉండి పని చేసుకుంటూంటే, ఆమెతో తను మాట్లాడుతూంటే బాగుండు ననిపించసాగింది శంకరానికి. కాని ఛ, ఛ ఇవేమిటి తన కిలాంటి ఆలోచనలేమిటి అని మనస్సు మరల్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. సుబ్బి మీనాక్షి నే సమర్థిస్తోంది ఆమె ఎంత అధికారం చలాయించినా. ఆమెవల్లే తాను బ్రతుకుతున్నట్లుగా ఉంటోంది. కాని కృతజ్ఞతాపూర్వకంగా తనతో ఒక్కమాటడాకూ అనలేదే! అయ్యగారి దయవల్లే నా బ్రతుకని ఒక్కసారి అంటే! ఒక్కసారి ఆ కళ్లలోనుంచి కృతజ్ఞతా భావం ప్రకటిస్తే! సిగ్గువల్లే చెప్పలేకపోతోందేమో! అవును, సుబ్బి పడుచుది - అరెరే మళ్ళీ బుద్ధి అలాగే పోతోందే అని జుట్టుపీకుకొని రాత కాగితాలవైపుకు దృష్టి మరల్చేవాడు శంకరం.

> రెండో భార్య ఎంత చేసినా తృప్తి పడక పోవటం, అస్తమానం మొదటి భార్యను పొగడటం అతనికి ఒక దురలవాటై పోయింది. ఒకనాడు విసుగు పుట్టి భార్య అన్నది.
>
> "ఇద్దరం మిమ్మల్నే పెళ్లి చేసుకున్నాం కదా! అలాటప్పుడు మా అక్కగారు తెలివి తేటలలో ఎలా ఎక్కువదో నాకు అర్థం కావటం లేదు."

దసరాకు భార్యకుమంచి జరీ చీరలు రెండూ, పిల్లలకు చొక్కాలూ, లాగుగుడ్డలూ, తనకు కొత్తబట్టలు వగైరాలు తెచ్చాడు శంకరం. మీనాక్షి అన్ని పాకెట్లూ విప్పి చూసి చివరికి సన్నగళ్ల నీలం చేనేతచీర చూసి ఇదెవరికంది. "సుబ్బికికూడా ఇద్దామని తెచ్చాను. పండుగకదా పాపం కట్టుకొంటుంది" అన్నాడు శంకరం, సుబ్బికేసి ఓరగా ఒకసారి చూసి. "ఇప్పుడే కొత్త చీర ఎందుకులెండి. ప్రస్తుతానికి నేను కట్టి విడిచిన వాయిల్ చీర ఇస్తాను - ఆ చక్రాల చీర ఇస్తాను కట్టుకుంటావుగదూ, సుబ్బీ" అంది మీనాక్షి ఆమెవైపుకు తిరిగి. "ఏదీ? - చక్రాల చీరనా అమ్మగోరూ! అదే నా కిస్తారా" అంది సుబ్బి, తనకు గొప్ప భాగ్యం అబ్బబోతున్నట్లుగా చూస్తూ. మీనాక్షి చక్రాలవాయిల్ చీర యిచ్చింది. అది కట్టుకొని పొంగిపోయింది సుబ్బి. శంకరానికి చాలా బాధ కలిగింది. మళ్ళీ మీనాక్షికే దక్కింది గౌరవమంతా. తను కొత్తచీర కొనితెచ్చానన్న మాట కూడా గుర్తులేనట్లుంది సుబ్బికి! కాని ఆ చక్రాల వాయిల్ చీరే బాగుందేమో! ఆచీర కట్టుకుంటే సుబ్బి ఎంతబాగుంది.— అబ్బ, ఇవేమిటి పాడు ఆలోచనలు!!—

ఆ వేళ సాయంత్రం కొంచెం పెందరాళే ఇంటికి చేరాడు శంకరం. ఇంట్లో సుబ్బి ఒకత్తే ఉంది. మీనాక్షి పిల్లలూ ఎవరో స్నేహితులింటికి వెళ్ళారు. సుబ్బి ఒకత్తే ఉంది! అతని హృదయం గబగబా కొట్టుకోసాగింది. ఉద్రేకపు పొంగులో వివేచన కొట్టుకుపోయింది. కొంచెంసేపు దూరం నుంచి సుబ్బికేసే చూసి చూసి మెల్లగా

★ దాక్షిణ్యాలోభం ★

వణుకుతున్న కంఠంతో "సుబ్బీ" అని పిలిచాడు, ఎన్నడూ సుబ్బీ అని పిలవనివాడు! "ఎందుకు, బాబుగోరూ" అంటూ ఎదుటికి వచ్చి నిలబడింది సుబ్బి కొంచెం భయంతో, కొంత అర్థంకాక చూస్తూ. "సుబ్బీ అమ్మగారు బాగా చూస్తున్నారా?" ఎన్నోసార్లు అడిగిన ప్రశ్నే - కాని కొత్తగొంతుకతో. "మాడకేం బాబుగారూ, అమ్మగారు వంత మంచోరు లేరు" అంది సుబ్బి ఎప్పటిలాగానే. "అమ్మగారే మంచివారు, అయ్యగారు మాత్రం?" అని శంకరం అంటూండగా "అదేమిటి అయ్యగారూ, మీవల్లే కదా ఇలా బతుకున్నది. మీరు కనికరించబట్టే కదా" అంది సుబ్బి.

"నేను నీకు కొత్తచీర కొన్నాను తెలుసా?"

"అవును బాబూ. నాకోసం మీ రెంత జాలిపడుతున్నారయ్యగోరూ!"

"సుబ్బీ" అంటూ చటుక్కున ఆమె చేయి పట్టుకున్నాడు శంకరం. ఆమె ఒక్క క్షణం నిశ్చేష్టురాలైపోయింది. "బాబుగారూ, ఇదేంపని ఎవురేనా సూత్తారు! వదిలేయండి అయ్యగారు" అంటూ గింజుకులాడింది. కాని ఆమెదీ పొంగే రక్తమే. మరునిమిషమే లొంగిపోయింది.

5

ఉద్రేకం శిఖరాలనుంచి పశ్చాత్తాపం అగాధాలలోకి పడిపోయాడు శంకరం. అంతవరకూ ఉన్న ఊడుకు చల్లారగానే తానెందుకు అలా ప్రవర్తించానా అన్న ఆశ్చర్యం మిగిలింది. తనపని తనకే అసహ్యం కలిగింది. తనమొగంచూసి మీనాక్షి తన సంగతి గ్రహించి వేస్తుందేమో నని భయం బయలుదేరింది. మీనాక్షి కళ్ళలోకి చూడలేక తలవంచుకు తిరుగుతున్నాడు. కాని మీనాక్షి ఏమీ విశేషం గ్రహించలేకపోయింది. ఎప్పటిలాగే చరిస్తోంది. కాని వచ్చినమార్పల్లా సుబ్బిలోనే!

ఎన్నడూలేనిది ఆవేళ సుబ్బి నిలువుటద్దం ముందు నిల్చొని తన ప్రతిబింబం చూసుకుంటోంది. జుట్టు నొక్కుకొంటూ, చీర సవరించుకొంటూ కళ్ళు అనేకవిధాలుగా త్రిప్పి చూసుకుంటోంది. అప్పుడే శంకరం అటువచ్చాడు. అప్పుడే దొడ్లోనుంచి "సుబ్బీ" అని మీనాక్షి కేక వినిపించింది. "వస్తున్నానమ్మా" అంటూనే సుబ్బి మరి రెండుక్షణాలు అద్దంలో చూసుకొని శంకరంకేసి ఓరగా చూసి నవ్వి వెళ్ళిపోయింది. ఆనవ్వు చూసి శంకరం గజగజలాడిపోయాడు. కొంపతీసి ఎప్పుడేనా మీనాక్షి ముందే తనకేసి అలా చూసి నవ్వుతుందేమో! ఇప్పుడా నవ్వులో అతనికి ఆకర్షణ ఏమీ కనబబడం లేదు. భయం, వెగటూ మాత్రం కలుగుతున్నాయి. అందుకే శంకరం సుబ్బికేసి చూడకుండా తల తిప్పేసుకుంటున్నాడు. అయినా అప్పుడప్పుడు సుబ్బి తనకేసే చూస్తున్నట్టుగా తెలియక పోలే దతనికి. సుబ్బి ఇదివరకుకన్న ఎక్కువసేపు అతనున్న గదిదగ్గరే తారట్లాడుతోంది. ఏదో వంక పెట్టుకొని అగదిలోకి పదేపదే వస్తోంది. కాని శంకరం ఆమె ఎదటపడకుండా ఉండడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

సుబ్బి ఇదివరకటిలా చకచకా పని చేయడంలేదు. ఏదో ఆలోచనలో పడి కూర్చుంటోంది. మీనాక్షి పిలిస్తే వస్తున్నానంటూనే కదలదు. మీనాక్షి అడిగితే "పని చేస్తూనేఉన్నానుకాని ఊరికే కూర్చోలేదు కదా, అప్పుడే అంత కొంప్పమునిగి రాదు" అని సణుగుతోంది. పనిచేస్తూకూడా విసుక్కుంటూ ఏదో లోలోపలగొణుగుకుంటోంది. ఎలాగో అలాగ శంకరం కంట పడడానికి, అతనికేసే చూస్తూ ఉండడానికి ప్రయత్నిస్తోంది.

నాలుగురోజులు గడిచినతర్వాత సుబ్బి మీనాక్షి చెప్పే పనులు అన్నీ చేయనంది. "చేతులు నొప్పి పెడుతున్నాయి కాని ఈ పనులకు అంతే లేదు" అని గట్టిగానే అనేసింది. "మరి తేరగా అనుకున్నావేం?" అని కోపంతో గొంతుక చించుకుంటూ అడిగింది మీనాక్షి.

"నేను తేరగా తినడమూ లేదూ, మీరు తేరగా పెట్టడమూలేదు. చాకిరీ చేస్తూంటే పెట్టున్నారు. ఊరికే ఏమీ పెట్టడంలేదు" అని పెళుసుగా జవాబిచ్చింది సుబ్బి. మీనాక్షి ఆశ్చర్యంతో నిలబడిపోయింది. సుబ్బేనా ఇలా మాట్లాడుతున్నదీ! తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందట! మీనాక్షి కోపం పట్టలేకపోయింది. బహుశా తేరగా తిండి తిని బలిసేసరికి సుబ్బికి సోమరిపోతుతనం ఎక్కువైంది అనుకుందే కాని ఈ మార్పుకు అసలు కారణం ఊహించలేకపోయింది మీనాక్షి. సుబ్బిలో సోమరిపోతుతనం వదిలించివేయడమో లేక సుబ్బినే వదిలించివేయడమో ఏదో ఒకటి జరగాలని నిశ్చయించుకుంది. "ఇంత కాలం తిని ఇప్పుడు నాకెదురు చెప్తావా? నేను చెప్పినట్టు నోరెత్తకుండా చేస్తే చేయి. లేకపోతే ఈక్షణం ఈ ఇంట్లోనుంచి బయటికి నడు. నిన్నే మీ బ్రతిమాలవలసిన గతి మాకు పట్టలేదులే. నువ్వుపోతే లక్షమంది ఉన్నారు ఈ పని చేయడానికి, ఏం?" అంది మీనాక్షి, తన అధారిటీ అంతా వ్యక్తంచేస్తూ.

(49-వ పేజీ చూడండి)

ఇల్లాలు

వై. యస్. ప్రకాశరావు

ఆ రోజు ఆదివారం. క్రితం రోజునే జీతాలు ముట్టాయి. అకస్మాత్తుగా పుట్టింది కోరిక ఎక్కడికైనా ప్రయాణం చేసిరావాలని. వెంటనే బయలుదేరాను మెయిల్‌లో కాకినాడ వెళ్ళి తిరిగి సాయంకాలానికి వచ్చేదామని. నీటుగా 'టకప్' చేసుకొని కళ్లకు గాగుల్స్ పెట్టి రిక్షాలో రాజమండ్రి టవున్ స్టేషన్ చేరాను. తీరా వెళ్ళేటప్పటికి మెయిల్ గంట లేటు అని తెలుసుకొని ప్రయాణంమీద నిరాశపడ్డాను. తిరిగి వెళ్లిపోదామా అనిపించింది పనిలేక ప్రయాణంచేసే నాలాటి ప్రయాణీకుడు పనిమీద ప్రయాణంచేసే ఇతర ప్రయాణీకులను అవస్థపెట్టటానికి ఇష్టంలేక. కాని ప్రయాణం చెయ్యాలని కోరుతున్న మనస్సును నిరాశ పెట్టడానికి ఇష్టంలేక వెనుదిరిగి వెళ్లలేకపోయాను. ప్లాట్ ఫారమ్‌మీద కొంతసేపు తిరిగాను. కాలం గడవటం బహుకష్టమైంది. ఇంతలో రోడ్ మీద కాఫీ 'కేంటీన్'వైపు దృష్టి మరలింది. కేంటీన్‌లోకిపోయి కాఫీ తీసుకున్నట్లయితే కొంత కాలం గడుస్తుందికదా అని బయలుదేరివెళ్ళి 'స్పెషల్ సెక్షన్'లో పంకాక్రింద కూర్చున్నాను. సర్వర్‌కు కాఫీకి ఆర్డర్ ఇచ్చి గాగుల్స్ తీసి ముఖంమీద చమటను చేతిరుమాలుతో తుడుచుకుంటుండగా ఆ బల్ల కెదురుగాకూర్చున్న ఓ పెద్దమనిషి 'ఎక్కడకు వెళ్ళాలి, నాయనా?' అని ప్రశ్నించాడు. 'కాకినాడ వెళ్ళాలి' అని సమాధానమిచ్చాను.

ఆయన వాలకంచూస్తే ఒక రిటైర్డ్ గవర్నమెంటు ఆఫీసర్ లా కనుపిస్తున్నాడు. తెల్లని పగంచేతులచొక్కా, రంగువెలిసిన కాకీ ఫుల్ పేంటులో 'టకప్' చేసి కళ్ళకు చత్వారంజోడు పెట్టాడు. ఆయన్ను చూడగానే కొంతసేపు ఆయనతో సంభాషణచేయాలని మనస్సుపుట్టింది.

'చదువుకుంటున్నావా?' అని మరల ప్రశ్నించాడాయన.

'లేదు, ఉద్యోగం చేస్తున్నా'నని సమాధానమిచ్చాను. సంతోషమన్నట్లుగా ఆయన ముఖసూచన చేసి మళ్ళీ ప్రశ్నించాడు.

'ఏడిపార్టుమెంటులో పనిచేస్తున్నావు, నాయనా?'

ఆయన వేసే ప్రశ్నలధోరణిచూచి, ఇంకా వివరాలన్నీ కనుక్కుంటాడని ముందుగానే గ్రహించి, ఆయన అడగబోయే వివరాలన్నీ చెప్పేసేను. నామాటలు వింటూనే ఆయన ఏదో ఆలోచనలో పడ్డాడు.

'ఏమండీ అలా ఆలోచిస్తున్నారు? నేనేమైనా మీకు తెలుసా?' అని అడిగాను.

'ఆ, ఏమీలేదు, నీవు చెప్పింది వింటూంటే నాకేదో చిన్ననాటి సంఘటన జ్ఞాపకమొస్తున్నది' అన్నాడాయన గొంతుక సవరించుకుంటూ.

రైలు కింకా చాల టైమున్నది కదా – ఆయనదగ్గరనుండి ఆ విషయమేమిటో తెలుసుకోవా లనిపించింది. ఇంతలో సర్వర్ కాఫీ తీసుకొచ్చి నాముందు పెట్టాడు. ఆ కాఫీ ఆయన కందిస్తూ, మరో కప్పు తీసుకురమ్మని సర్వర్‌తో చెప్పాను.

"నే నిప్పుడే తీసుకున్నా, ఫరవాలే, నీవు తీసుకో" అన్నాడాయన.

కాఫీ ముగించి ఇరువురం బయటకు వచ్చాం. నేను రెండు కిళ్ళీలుకొని ఒకటి ఆయనకిచ్చి రెండవది నేను వేసుకున్నా. నేరుగా స్టేషన్‌కు పోయి ప్లాట్‌పారం చివర్న ఒక పెద్ద చెట్టుక్రింద ట్రాలీమీద కూర్చున్నాం.

'మీ రేడిపార్టుమెంటులో పనిచేసి రిటైరైనారండీ' అని ప్రశ్నించాను, విషయమేమిటో తెలుసుకుందామని. ఆయన చెప్పాడు. ప్రభుత్వోద్యోగంలో రిటైర్ అయ్యాడు.

'నా విషయంవింటే మీ చిన్ననాటి సంఘటన జ్ఞాపకమొచ్చిం దన్నారు?' అన్నాను.

"అవును. చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది. నేను చేసిన పాపం చెప్పుకుంటే నాకూ కొంత మనస్థిమితం కలుగుతుంది. నీకూ ఒక ఉదాహరణగా ఉంటుంది, విను నాయనా." అన్నాడాయన.

* * *

నా కించుమించు ముప్ఫై సంవత్సరా లుండవచ్చు. ఒకరోజున ఆఫీసు పనిమీద ఒక పల్లెటూరు వెళ్ళా. ఆ గ్రామం చేరేటప్పటికి సాయంత్రం అయిదుగంటలు కావస్తోంది. గ్రామమునసబుగారింటికి వెళ్ళి నా హోదా చెప్పుకుని నాకు భోజనపానాదులు సమకూర్చుకున్నా. గృహస్థు నలభైయేళ్ళ పైబడిన మనిషి. ఇంట్లో ఆయన భార్య, మూడునాలుగేళ్ల ఆడపిల్ల తప్ప మరెవ్వరూ లేరు. ఆయన భార్య పెద్ద అందగత్తె కాకపోయినా కురూపి మాత్రం కాదు. ఇరవై సంవత్సరాలు పైబడిఉండవు. ద్వితీయవివాహమనుకోవచ్చు. నా స్నానమైన తరువాత గృహస్థుతో కలిసి భోజనం ముగించాను. అరుబయట వసారాలో నాకు మునసబుగారికి వేర్వేరు మంచాలు వేసి ఆయన భార్య వసారా ననుసరించి వున్న గదిలో మంచంమీద పిల్లను వేసుకొని పడుకొంది. నాకు కావలసిన సౌకర్యాలన్నీ కూడ మునసబుగారు భార్య చేతనే ఏర్పాటుచేయించారు. ఆమెకూడా ఎరమరికలేక చాల చనువుగ మసిలింది. ఆమె వడవడికను చూచి నేనామెను తప్పు అర్థం చేసుకున్నాను. రాత్రి సరిగా పన్నెండు గంటలు దాటిఉంటుందేమో. నాకుమాత్రం నిద్రపట్టలేదు. నా ప్రక్కను గృహస్థు గాఢనిద్రలో ఉన్నాడు. ఆమెగురించి నాకు కలిగిన భావములు నన్ను కలవరపరిచాయి. నే నెటువంటి ఉద్రేకానికి గురి అవుతున్నానో నా కప్పటి పరిస్థితులలో ఒళ్లు తెలియలేదు. నెమ్మదిగా లేచి చూచాను. గృహస్థు గాఢనిద్రలో వున్నాడని నిశ్చయపర్చుకొని, నెమ్మదిగా తడబడుతున్న అడుగులతో గదిలోకి వెళ్ళాను. ఆమె పిల్లపక్కన పడుకుని గాఢంగా నిద్రపోతోంది. నేను వెళ్ళి ఒణకుతున్న చేతులతో ఆమెను తట్టాను. ఆమె ఆ నిద్రలో కళ్లు తెరచిచూచి కలవరపడింది. నే నామెచేయి పట్టుకో ప్రయత్నం చేశాను. ఆమె వణికిపోతూ "వస్తా మండండ"ని చెప్పి పిల్లతోసహా బయటకు వెళ్ళి తలుపు గొళ్ళెం పెట్టింది.

తెల్లవారుతోంది. రాత్రి నేనుపడ్డ అవస్థ భగవంతునికే తెలుసు. మనస్సులో ఏదోభీతి దృఢంగా నాటుకుంది. నేను చేసిన తుచ్ఛమైనపనికి నన్ను నేనే నిందించుకున్నా. స్త్రీ మన స్తత్వ మెరక్కుండా ప్రవర్తించి నందుకు నన్ను నేనే తిట్టిపోసుకున్నా. ఆ గదిలోనే తెల్లవారేలోగా ప్రాణం విడి

(49-వ పేజీ చూడండి)



చల్లని తల్లి



శ్రీ భమిడిపాటి వెంకటరమణ

రామారావు గుమస్తాగిరిలోనూ గృహస్థాశ్రమంలోనూ ప్రవేశించి ఏడాది పైబడింది. ఈరోజే కుమారుణ్ణి తీసుకొని భార్య పుట్టింటినుంచి తిరిగొచ్చింది తన యింటికి. రామారావు ఆనందానికి మేర లేదు. బ్రహ్మానందంతో తన కొడుకుని చూపించడానికిగానూ బంధువుల్ని స్నేహితుల్ని ఆహ్వానించి విందుచేశాడు. దినమల్లా క్షణం తీరిక లేకపోయింది. రాత్రికాగానే బంధువులు స్నేహితులు అందరూ వెళ్ళిపోయిన తరువాత తన కొడుకుని మనసార ముద్దులాడి నిద్రపోయాడు. అర్ధరాత్రప్పుడు అతన్ని ఎవరో తట్టి లేపినట్టయింది లేచాడు. గుండెల్లో ఏదో బిగబట్టినట్టు - చల్లగా ఒళ్లు ఝల్లుమనిపించేలాగ - ఎవరది?

"నన్నే మరచిపోయావా నాయనా!" గలగల నవ్వుతూ చలిపుట్టించేలాగ.

"అమ్మా!"

"అవును. నేనూ అమ్మనే. నిన్ను ఈ లోకంలోకి తీసుకొని వచ్చేది అమ్మ అయితే తీసుకొనిపోయేదీ కూడా అమ్మే?"

"మృత్యువు!"

"భయమేసిందా?"

"భయమెందుకు?"

"నిన్ను తీసుకొనిపోతానేమోనని."

"ఆ భయం నాకు ఎన్నడూ లేదు. నాకు తెలుసు, నువ్వు ఎలాగూ ఒకనాడు, తీసుకొనిపోతావని. కాని నా గడువు తీరవద్దా?"

"గడువా? నన్ను అడ్డు పెట్టగలిగేదా?"

"నా బాధ్యతలు చూడు. చిన్నభార్య, చంటిపిల్లడు."

"ఇవి మాత్రం నన్ను అడ్డుతాయా పిచ్చి కాడా?"

"నీకు దయలేదా?"

"దయా, లేకేం బోలెడంత వుంది - నీమీద."

"మరి నా ఆత్మబలం, ఆశయాలు, కర్తవ్యం?"

"ఇవేవీ నన్ను ఎదిరించలేవు"

"నాశక్తి, నా శరీరంలో ఉండేనాశక్తి!"

రామారావు ఒకసారి తన ఛాతీ పొంగించి ఒళ్లు చూసుకున్నాడు. బలమైన కండలు ఆరడుగులఎత్తున నిలిచిన తన పచ్చనిశరీరం. శూన్యంలోనూ, అంధకారంలోనూకూడా చీల్చుకొని చూడకలిగే తనకళ్లు. పిల్లగాలిలోని సుడులనుకూడా వినగలిగే తనచెవులు. గంటలతరబడి పరిశ్రమించగలిగే తన అవయవాలు. ధర్మాధర్మాల మర్మాలు ఎరిగే తన మేధస్సు. వీటన్నింటితోనూ తను మృత్యువుని ఎదిరించలేడా?"

"నా సంపూర్ణశక్తితో నిన్ను ఎదుర్చుతాను! నన్ను తీసుకొని వెళ్లగలవా నేను రాదలచనప్పుడు?"

"అంత భయపడతావెందుకు? ఒక్కసారి నీకు జ్ఞాపకం చేసిపోదామని వచ్చాను. కొడుకు పుట్టాడన్న సరదాలో నన్ను మరిచిపోయినట్టున్నావని."

"మరువక నిన్ను తలచుకొని ఈ ఆనందాన్ని వేడుకల్ని పాడుచేసుకోమంటావా?"

"నన్ను మరచిపోవద్దంటాను"

"నిన్ను మరచిందెప్పుడు? మరువగలిగిందెలాగు? నిన్ను అనుక్షణమూ జ్ఞప్తియందుంచుకునే మేము జీవించేది. మరచినట్టు పైకి కనుపించినా మాలో నీజ్ఞాపకమే నిండి వుంటుంది. వేసే ప్రతిఅడుగూ, చేసే ప్రతీపనీ, ఆరగించే ఆహారం, భద్రతలోనూ నిద్రలోనూ నీవే జ్ఞాపకం నీకా సందేహం ఎందుకు?

"నా సంతానాన్ని నేను ఒకకంట కనిపెడ్తూవుండవద్దామరి! నేను వస్తాను"

వెచ్చనిగాలి శరీరానికి సోకింది. రామారావుగుండె తేలిక అయింది. గదిలో మంచమ్మీద నిద్రపోతున్న భార్యను కొడుకును ఒకమారు చూశాడు. వీళ్లకు తన అవసరం వుంది. ఇది సత్యం. వీరియెడల తన బాధ్యత తీరేవరకు తనకు గడువు కావాలి.

* * *

ఆరోజు - తన రెండవ కొడుకు నామకరణ మహోత్సవం చేసి బంధువులతో విందారగించి లేచాడు రామారావు. తన యింటికి మరింత, శోభ చేకూర్చే పవిత్ర దీపం తనకు లభించినట్టు ఆనందించాడు రామారావు. ఆ ఆనందంలో ఆయన స మరచిపోగలడు.

"నామాట మరచిపోయావే!" అని ఎవరో ప్రశ్నించినట్లయింది, చల్లగా గలగలా నవ్వుతూ గాలిలో.

"మృత్యువు !"

"కాదు, అమ్మ. ఇద్దరు కొడుకులు పుట్టారని అపరమిత ఆనందం పొందుతున్నావు నీకేం ప్రమోజనం?"

"నాకు ఏ ప్రయోజనం అక్కర్లేదు. నన్ను ఆశ్రయించుకునే వారికి. నా కన్నతల్లికి. గడువుండగానే కలిగిన బిడ్డలు నా గడువు తీరి నేను గతించగానే ఆమెకి రక్షకులవుతారుగదా. నాకు అప్పుడు ఒక బాధ్యత వదుల్తుంది."

"బాధ్యతలు వదిలేవరకు నువ్వు నాకు దూరమనే అనుకుంటున్నావు కదూ? అందుకా ఈ ఆలోచన చేస్తున్నావు?"

"నన్ను గురించి కాదు ఆలోచించేది. నిన్ను గురించే ఆలోచిస్తున్నాను."

"నన్ను గురించి ఆలోచించడానికి నీకిప్పుడు నిజంగా తీరికవుందా?"

"అవును. ఆమాట నిజమే. నా ఉద్యోగం, బాధ్యత, పిల్లలు, భద్రతగూర్చి ఎక్కువ ఆలోచించవలసి వస్తూంది. నా ఆలోచనలు భంగపరచవద్దు. ఇక పో!"

"నీ ఆలోచనలు భంగపరచడం నా ఉద్దేశంకాదు. ఒక్కసారి జ్ఞాపకం చేసిపోదామని."

"నువ్వెప్పుడూ నా జ్ఞాపకానికి దూరం కావు" సగం నిద్రలో రామారావు ఏమేమో పణిగాడు.

* * *

"అన్నీ ఉత్తమాటలే? నన్ను నువ్వు పూర్తిగా మరచిపోయివుంటావు. కనీసం ఇప్పుడు కుమార్తె పుట్టిందన్న ఆనందంలో నయినా!"

"ఆమాట నిజమే! నా ఇంట్లో ఈనాటికి లక్ష్మీదేవి ప్రసన్నమయింది. నాయిల్లు కలకల్లాడుతూ అందాలు ఊరుతూ ఆటల్లో పాటల్లో మునిగి తేలుతూ వుంటుంది. ఇంతటి పరమానందం ఎవడు వాంఛిరపడు లభించినప్పుడు మైమరువని వాడెవ్వడు?".

"ఈ కబుర్లు అన్నీ నేను చెయ్యి చాచనంతవరకే?"

"నీ చెయ్యి నన్ను తాకగలదా? ఈ బీరువాలు, అద్దాలు, పెట్టెలు, సామగ్రి నానాటికి పెరుగుతూవుండే నా చుట్టుపక్కల పరివారం, బలగం నీ చెయ్యిని చాచనిస్తాయా నాదాక?"

"ఈ కర్రలు, కొయ్యలు నన్నేమీ ఆపలేవు. నీ శరీరం—"

"నా శరీరం - నీ చేతికి పట్టుబడేటంత బలహీనం యింకా కాలేదు."

"ఒక్కసారి చూడు ఆ రూపం, అద్దంలో. తేరిపారిచూడు. జుత్తు నల్లదనం దిగజారి తెల్లపడుతూంది. చూపులు లోపలికి ప్రయాణం చేస్తున్నాయి. ముఖంలో పూర్వపు మార్దవంపోయింది. ఇప్పుడు నీవంక ఎవరూ తిరిగి చూడవలెనని అభిలషించడం లేదుకదూ! నీ శరీరం కూడా చూసుకో ఊబదేరి ఎలా పైకి ఉబుకుతూందో!"

"లేదు. లేదు. నా శక్తి క్షీణించలేదు. ఆలోచనలతోనూ, ఆందోళనతోనూ జుత్తు తెల్లబడి ఉంటుంది. ఆలోచనల తీక్షణతే చూపుల్ని లోపలికి తీసుకెళ్తున్నాయి. వాతావరణమే ముఖాన్ని మార్చివేసింది. నా శరీరం తృప్తిఅయిన భోజనంచేసి పుష్టినెక్కింది. నిన్ను ఎదిర్చగలిగే శక్తి నాలో ఉంది. నువ్వు చెయ్యిచాచితే తప్పక ఎదుర్చుతాను"

"ఎందుకు?"

"ఎందుకా? చూడు. పెద్దవాడు చదువు సంధ్యల్లో పడ్డాడు. చిన్నవాడు లోకజ్ఞానంలో పడ్డాడు. పసిపాప ప్రాకటం మొదలెట్టింది. నా ఉద్యోగంలో హోదా హెచ్చింది. బాధ్యతలు బిగుసుకుంటున్నాయి. ఇప్పుడే నా సంపూర్ణమైన శ్రద్ధ, జాగ్రత్త అవుసరం"

"నేను వెళ్లివస్తాను"

గడ్డకట్టిన గుండె క్రమక్రమంగా కొట్టుకోవడం మొదలెట్టింది. శరీరం వేడెక్కింది. రామారావుకి తల్లిఒళ్లో పడుకున్న పసిపాప ప్రసన్నవదనం చూడగానే ప్రకృతిలో ఎంతో ప్రశాంతత పవిత్రతఉన్నట్టు అనిపించింది. అదే బ్రతుకులోఉండే సుహాదానందం. ఆలోచనలతో నిద్రకూడా వచ్చి ఆక్రమించింది రామారావుని.

* * *

రామారావుకి తీవ్రమైన జ్వరం వచ్చింది. కడుపులోనూ, గుండెల్లోనూ, తలలోనూ మంటలు మండుతున్నాయి. నాడులు లాగుతున్నాయి. కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి. ఇల్లు, వస్తువులు, భార్య, పిల్లలు, బంధువులు, స్నేహితులు క్రమక్రమంగా అదృశ్యమవుతున్నారు. అరె! ఏమిటిది? ఈబాధ? తన్నేంచేస్తుందో? ఎవరో తెలియకుండా తనని బాధిస్తున్నట్టుంది. మృత్యువు కాదు కదా! ఆక్షణంలో చల్లనిగాలిలో గలగల నవ్వు వినిపించింది. అదిగో మృత్యువు.

"అమ్మో! -" పెద్దకేక పెట్టాడు రామారావు

"ఇదిగో చూడు మా స్నేహితులందరికీ కబురుపెట్టు. మరి ఆశలేదు. ఇంటికి టెలిగ్రాం వేయించు. పిల్లల్ని ఇక్కడ్నుంచి పంపించేయి. భయపడ్తారు!"

"ప్రేలాపన జ్వరతీవ్రతలో అలాగే ఉంటుంది. మరేమీ భయంలేదు" అన్నారు పక్కన నిలబడ్డవారు. రామారావు చెవులో ఆమాటలు పడ్డాయి.

"మీకు తెలియదు. నిజంగా మృత్యువు నా ఎదుట వచ్చి నిలిచివుంది."

"భయపడకండి. డాక్టరుకోసం కబురు పంపాను. ఆయన వస్తూవుంటారు ఈసరికి."

"డాక్టరెందుకు? ఇప్పుడు వచ్చి ఆయనేం చెయ్యాలని? మృత్యువుని తోసెయ్యగలడా?"

ప్రేలాపన ఎక్కువయింది.

"నేను అనుకున్నట్టే అయింది. గోంగ చాటున దెబ్బతీశావు. నా శరీరం అనారోగ్యంగా ఉన్నప్పుడు అయితే సుళువుగా తీసుకొని పోవచ్చునని నీ ఊహ!"

"నేను నిన్ను తీసుకొని పోవడానికి రాలేదు. నువ్వు భయపడవద్దు!"

"అయితే మరెందుకు వచ్చినట్టు?"

"నువ్వు నన్ను తలంచుకున్నావు గదా అని. సంతానం తలుచుకుంటే తల్లి ఎంత దూరంలో ఉన్నా పరుగెత్తుకొని వస్తుంది!"

"మరయితే ఈ బాధ?"

"ఇది రోగం? ఇది నిన్ను కొంచెం బాధ పెట్టుంది. నిజమేగాని నిన్ను తీసుకొని పోదు!"

"నన్ను తీసుకొని పోనివ్వను!"

డాక్టరుగారు వచ్చారు. ఒక ఇంజక్షన్ ఇచ్చారు. "టెంపరేచరు ఎక్కువగాఉంది తడిగుడ్డ తలకు చుట్టండి. ఆరార నీళ్ళతో తడుపుతూ వుండండి. త్రాగడానికి కావలసినంత నీరు పొయ్యండి" అని చెప్పారు

"ఈమాత్రం దానికే ఇంత భయపడ్డారేమండీ" డాక్టరుగారు నవ్వుతూ రామారావుని అడిగారు. రామారావు ముఖంకూడా వికసించింది.

"లేదండీ, నా కప్పుడే మృత్యువు రాదు!" అన్నాడు, గదిలో గాలి వెచ్చగా ఉంది. హాయిగా నిద్రపోయాడు రామారావు.

* * *

"ఇవాళ్ల మహానందంలో ఒళ్లే మరిచేలాగ ఉన్నావు. ఆ చేతిలోనూ, మెడలోనూ పూలదండలు ఏమిటి? ముఖాన్ని చందనం పూసినట్టు నిండు సంతోషం. వాళ్ల పొగడ్తలకు పొంగిపోయినట్టున్నావు. ఏమిటి సంగతి?" అని చల్లగా గలగలా నవ్వుతూ గాలిలో ప్రశ్నించినట్టయింది. రామారావుకి.

"అన్నను ప్రమోషనుమీద పైఊరు పంపిస్తున్నారు. సంపూర్ణమైన బాధ్యత మన నెత్తిమీద పడింది. సంతోషానికి, సందేహాలకి సమయం కాదిది. స్వశక్తికి పరీక్ష. ఇది ఎలాగ నెగ్గుకొస్తానా అని ఆలోచిస్తున్నాను" అనుకున్నాడు రామారావు, తన శరీరాన్ని ఆక్రమించిన చల్లదనాన్ని ప్రక్కకి తోసేసుకుంటూ.

* * *

సగం నెరిసిన జుత్తు నుదుటిమీదకి పడ్తూంది. ముక్కుమీదకు జారిన కళ్ళద్దాలు ఒకచేత్తో సద్దుకుంటూ ఒకచేత్తో కర్ర ఆడించుకుంటూ రామారావు ఇంటికి తిరిగిరాగానే పెద్దకొడుకు ఎదురుగ్గా వెళ్ళి "నాన్నగారూ, నేను బి. ఏ ఫస్టుక్లాసులో ప్యాసయినానండీ" అన్నాడు.

ఒక స్టాక్ బ్రోకర్‌కి జబ్బు చేసింది. ఆస్పత్రిలో పడుకొని వున్నాడు. నర్సువచ్చి ఆతని టెంపరేచర్ గ్రాఫ్‌షీట్ మీద నోట్ చేస్తోంది.

"ఈపూట టెంపరేచర్ ఎంత?" స్టాక్ బ్రోకర్ అడిగాడు

"నూటరెండు"

"నూటమూడుకి రాగానే సరకులన్నీ అమ్మేయించు" అన్నాడు ఆ స్టాక్ బ్రోకర్, మూలుగుతూ!

సి. వి. జి. కృష్ణ, మద్రాసు.

చల్లని తల్లి

"సరే. చాలా సంతోషమయింది. ఇంకా నువ్వెప్పుడు చివరి వేస్తావో ఇటువంటి శుభవార్త అని ఎదురుచూస్తున్నాను!" అన్నాడు రామారావు రెండో కొడుకుని చూసి.

* * *

"కొడుకుల చదువులు అయితే పూర్తి, అయేవరకు బాధపడినా అర్థం ఉందికాని, కూతుర్ని కూడా చదివిస్తున్నావే, ఇక ఎవడికో పెళ్ళిచేసి ఈ బాధ్యత వదిలించుకోక?" అని చల్లగా గాలిలో గలగలా నవ్వుతూ ఎవరో ప్రశ్నించి నట్టయింది రామారావుకి.

"దానికి పెళ్ళిచెయ్యడం కాదు నా బాధ్యత. దాన్ని కూడ విద్యావంతురాలిని చేసి ఏ ఉపాధ్యాయురాలుగానో, డాక్టరుగానో సమాజానికి సేవచేయగలిగేలాగు, తనంత తాను స్వేచ్ఛగా బ్రతకగలిగేలాగు చెయ్యాలని నా సంకల్పం!"

"నాకు తెలుసు నీ ఎత్తులు. ఈవిధంగా నీగడువుకాలం పొడిగించుకుందామని!"

"నీకు తెలియవు ఈ దేశంలో స్త్రీలు పడేబాధలు. ఒక పురుషుడికి కట్టుబడి, వాడి అర్జనలో ఎంతపోస్తే అంత త్రాగుతూ వాడు పెట్టేబాధలుభరిస్తూ, బిడ్డల్ని కంటూ, బండచాకరీచేస్తూ బ్రతుకులు ఈడ్వలేని వీరికి కన్నతల్లికన్న నీవంటితల్లి అంటేనే ఎక్కువప్రీతి. వీరు ఆ శుభముహూర్తానికి ఎదురుచూస్తూవుంటారు"

"అయితే ఈదేశంలో ఇకముందు స్త్రీలు కూడా నన్ను ఎదుర్చుకొంటారన్నమాట!"

* * *

ఎదురుగా అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంటున్నాడు రామారావు, సోఫాలో కూర్చొని. ఇదొక కొత్తరూపం. ఇంకెవరిదో ఈ శరీరం. ఇందులో తను ఎలాగ ప్రవేశించాడో! తల పల్చబడిపోయింది. ముఖం ముడతలుపడింది. ముక్కుమీద సులోచనాలు జారిపోతూ చూపే ఆనడం లేదు. నోరు తెరిచేందుకు భయంగా ఉంది. ముందరిపళ్లు ఊడిపోయాయి. శరీరంలో పటుత్వం లేదు. కూర్చుంటే లేవడానికి ఇష్టపడడంలేదు. ఏమయింది ఆరూపు? అపటుత్వం? అశక్తి? ఏమయినట్టు? ఎవరు చేసినది ఈ ఇంద్రజాలం? మృత్యువు!

గలగల నవ్వుతూ శరీరం ఝల్లుమనిపిస్తూ ప్రవేశించింది చల్లగాలి.

"పొరపాటు. మృత్యువు కాదు దీనికి కారణం నువ్వు కోరిన గడువు. కాలం. కాలంచేసిన మార్పు ఇది."

"కాదు. ఇదంతా నీ ప్రభావమే! పదే పదే ఎదుటబడి క్రమక్రమంగా నీ ప్రభావానికి లోబరుచుకుంటున్నావు."

"అందుకనేనా ఆ చూపులు దొంగలాలో పలికి దాక్కుంటున్నాయి. నన్ను చూడగా కలిగిన అసహ్యం కారణంగానేనా ముఖంమీద ఆ ముడతలు? భయం చేతనేనా చేతిలోని కర్ర వణుకుతూంది?"

"నా శరీరంలోని శక్తి క్షీణింపచెయ్యగలిగేవు కాని, నా ఆత్మశక్తినో?"

"నేనుకాదు నీ శరీరాన్ని దుర్బలపరిచింది. చెప్పానుగదూ, నీ వయస్సు. ఇది నీ వృద్ధాప్యం. నిన్ను చూస్తే ఇప్పుడు నిజంగా నాకు దయ కలుగుతున్నది!"

"భయమా. నాకెందుకు భయం?"

"అదిగో నీకిప్పుడు సరిగా వినబడటం కూడా లేదు. నీ స్థితి చూస్తే దయ కలిగించేదిగా ఉన్నదీ అంటున్నాను."

"మృత్యువుకి దయ కూడానూ?"

"ఈరోజు నీకింత తీరికగా ఉందేం?"

"అవును. ఉద్యోగం సమాప్తి అయింది. మరెవరూ పనిలోనికి తీసుకోవడంలేదు."

"అవును మరి. ఈ వయస్సులో నువ్వు ఇంకేపని చెయ్యగలవు? ఇంట్లో కూచోక పోయిగా. నేను వస్తాను!"

గాలి నిశ్చలమయింది. రామారావు చేతికర్ర గట్టిగా పట్టుకొని గబగబా నడవడానికి ప్రయత్నిస్తూ బయటకు వెళ్ళాడు.

* * *

"ఈ నెలనుంచి పెద్దవాడు మూడు వందలు చిన్నవాడు రెండువందలు ఇస్తున్నారు. అమ్మాయి కూడా వంద రూపాయలు పంపిస్తూంది." అన్నది భార్య రామారావుతో.

"ఆధనం నీది. దానితో నాకేమీ సంబంధంలేదు. ఇంక నాకు ఈ బాధ్యత కూడా తీరింది. నేను సంపాదించి అమ్మకు ఇవ్వకపోయినా కొడుకులయినా ఇవ్వవద్దా?"

"మీ కంటికి అమ్మగా కనిపించేటంత ముసలిదాన్నయినాను అనేగా మీరు హాస్యం చేస్తున్నారు! ఒక్కసారి అద్దంలో చూసుకోండి మీ రూపం, ఎవరు ఎంత ముసలో తెలుస్తుంది!"

* * *

"కొత్త ఇల్లు...కొత్త కొత్త వస్తులు. కొత్త సామగ్రి. అంతా కొత్తగా మారిపోయినట్టు ఆనందిస్తున్నావు. నీ పాతవాసనలను ఎక్కడ దాచేసుకున్నావు?" అని గలగలా నవ్వుతూ చల్లగా గాలిలో ప్రశ్న.

"అబ్బే. ఇందులో నాదేముంది? ఇది కుర్రవాళ్లు కట్టించుకున్నది. వాళ్లే ఉంటున్నారు. వాళ్లకి పెళ్ళిళ్లు అయాయి. కొత్తవాళ్లు కొందరు కలిశారు ఈ కుటుంబానికి. సంఖ్య హెచ్చింది. అందుకని ఈ కొత్త ఇల్లు ఏదో దయదలచి నాకు కూడా కాస్త చోటు ఇచ్చారు ఏముంది. ఈ ముసలి ఘటానికి ఈ నాలుగురోజులూ ఎలాగ వెళ్లిపోయినా బాధలేదు!"

* * *

మేడమెట్లు దిగుతూ రామారావు కాలుజారి పడ్డాడు. కాలు విరిగింది. మంచం పట్టాడు. డాక్టరు ప్రతిరోజూ వచ్చి చూసి పోతున్నాడు. మందు ఇస్తున్నాడు. పదిహేనురోజు లయింది. రామారావు నానాటికి కుష్కిస్తున్నాడు.

గలగల నవ్వుతూ గాలిలో సుపరిచిత కంఠస్వరం ఆహ్వానిస్తున్నట్టు వుంది. ఆ ఆహ్వానంలో ఆకర్షణ ఈరోజు అనివార్యంగా ఉంది.

"ఆగు. ఒక్క క్షణం ఆగు. మా అమ్మ దగ్గర శెలవు తీసుకోవాలి!"

"అమ్మ. ఇంక అమ్మ ఎవరు?"

"నన్ను కన్నదీ తీసుకొన్నదే గాక, మధ్య సేవచేసినది, సుఖపెట్టినదీ జీవన యాత్రలో సహకరించినది మరొక అమ్మ ఉన్నది."

"ఓహ్హో భార్యనా అంత గొప్పగా పొగుడుకుంటున్నావు. సరే!"

"అమ్మా! అమ్మా! నాకు పిలుపు వచ్చింది. నా తల్లి పిలుస్తూంది. నన్ను తీసుకొని పోతుందిట!"

"మీరు. అట్టే మాటాడకూడదని డాక్టరు చెప్పారు."

"ఇంకా డాక్టరు ఆజ్ఞకు లొంగివుండవలసిన సమయం కాదిది. పిల్లలు ఏరీ?"

"నాన్నగారూ ఇక్కడే ఉన్నాం!"

"భయపడవద్దు బాబులూ! ఇంతవరకు ఈ జీవిత నాటకరంగంమీద తెరముందు నా అభినయం పూర్తిఅయింది. ఇక తెరవెనుకకు వెళ్ళి వేషం మార్చడానికి. ఇంక మీ అభినయం ప్రదర్శించాలి. అదుగో_ ప్రాంప్టరు పడిపొమ్మంటున్నాడు. స్టేజి డైరక్టరు ఈలవేస్తున్నాడు. తెరవెనుక అమ్మ పిలుస్తూంది. తెరపడిపోయింది.?"

దబ్బుమని చప్పుడుతో వెండికట్టు చేతికర్ర నేలమీద పడింది. తెరచిన కిటికీ తలుపులోంచి చల్లని గాలివచ్చి ఎదురుగా దేవుడు సన్నిధిని వెలుగుతున్న దీపాన్ని ఆర్పివేసింది ఆరని వత్తులలోంచి పొగ వలయాలుగా తిరుగుతూ ఎగురుతూంది. ఆ వలయాల్లో నిలువెల్లా తెల్లని ముసుగుతో బిడ్డను చంకనిడుకొని హడావుడిగా వెనుతెరిగి వెళ్ళిపోతున్న తల్లివలె కనపడింది పొగ. కిటికీ ఊచల్లోంచి దాటగానే బయటనుండి పెద్దగాలి తలుపుల్ని ధడేల్ మని మూసేసింది బరువుగా పరుపులో దించుకొని పోయింది రామారావు కళేబరం.

"నాన్నగారూ!" అని అరచాయి మూడు యువకకంఠాలు:

"వారు మరి లేరు మనకు!" అన్నది ఒక వృద్ధవనిత గొంతు. ★

అభిమానం

పాత్రలు

రాముం :

గౌరి :

తల్లి :

మహాలక్ష్మి :

1 వ రంగం

గౌరి: ఇంత రాద్ధాంతం నాకుమాత్రం సరదా యేమిటి?

రాముం: నేను సరదా అన్నానా? కన్న తల్లయినా కట్టుకున్న పెళ్ళామైనా యింట్లో మగాడి కష్టసుఖాలు కాస్త ఆలోచించాలి.

గౌరి: మీ అమ్మ - మీ చెల్లెలు 'ఎంత డబ్బు తీసుకున్నా లేనిది - నామీద విరుచుకుపడింది...ఆ మాత్రం స్వాతంత్ర్యం నాకు లేదా?

రాముం: ఎవ్వరిదీ తప్పులేదు - తల్లికదా అని స్వతంత్రించి అమ్మ అయిదురూపాయలు తీసింది. చెల్లెల్ని కదా అని స్వతంత్రంగా లక్ష్మి ఏడురూపాయలు తీసింది. భార్యనికదా అని నువ్వు మూడు రూపాయలు తీశావు. పదిహేను రూపాయలతో నా స్వాతంత్ర్యం హుళక్కి.

గౌరి: ఎవరేది తీసుకున్నా లేనిది నేను తీసుకుంటే వచ్చింది మీకు బాధ.

రాముం: బాధేమిటి? తెలియని విషయం తెలుసుకోవాలి.

గౌరి: నాకు బాధయెందుకు! నే నలా పెట్టిపుట్టాను.

రాముం: అసలు డబ్బేమయిందని అడిగి తెలుసుకుంటే వాళ్ళకిద్దరికీ కోపాలొచ్చాయి...ఏ లక్షాధికారినో అయితే నాకు మీకుకూడా అంత బాధ ఉండేది కాదు...

గౌరి: మొన్ననూ అలాగే - దాసీదానికి మూనెడు బియ్యంఅన్నం పెడుతూంటే ఊరుకోలేక 'అదేమిటం డత్తయ్యా అంత అన్నం పెడుతున్నారు?' అన్నంత మాత్రానికి ఆపేళల్లా భోజనం చెయ్యలేదు. వారం రోజులు మాట్లాడలేదు.

రాముం: అటువంటి వేమీ మనస్సులో పెట్టుకోకు. ఆవిడ స్వభావం అది...నన్ను మాత్రం అనడంలేదూ?

గౌరి: మీ రెన్ని చెప్పండి, నా కింక సుఖపడే యోగ్యతలేదు.

[తల్లి, చెల్లెలు మహాలక్ష్మి ప్రవేశం]

తల్లి: సుఖపడమ్మా సుఖపడు. నే నవతలకి విరగడైపోతే నీకంతా సుఖమే .. రావే మహాలక్ష్మి - కన్నకొడుక్కే నేను విషమైపోతే, నీ కవటం గొప్ప యేముంది?

రాముం: ఎక్కడికమ్మా?

తల్లి: వీట్లోకి.

రాముం: (నమ్రతగా) అమ్మా, ఇంట్లోంచి వెళ్ళిపోతున్నావా?

తల్లి: పోక యేంచెయ్యనుబాబూ! నాకు గౌరవంలేదు. నామాటకు లక్ష్యంలేదు.

రాముం: ఇలా చూడు.

మహాలక్ష్మి: కాకపోయినా అన్నయ్యా - నువ్వు మారిపోయావు. - లేకపోతే చెప్పకుండా డబ్బుతీశామని అంత గొడవ దేనికి?

పమ్మి వీరభద్రరావు

రాముం: గొడవేముంది - డబ్బు తక్కువైతే మీరు తీశారా అని అడిగి, తీశామన్నాక యేమన్నా అన్నానా? - గౌరిని పిలిచి నీవుకూడా యెందుకు తీశావు' అని అడుగుతున్నాను. అంతేనా?

మహా: అంతేలే.

రాముం: ఉన్న రెండెకరాల గింజలు తిండికి సరిపోతాయి. నాకొచ్చేది ముప్ఫయి అయిదురూపాయలుజీతం పైఖర్చుకొస్తుందా యీబస్తీలో? ఒక్కసారి పదిహేనురూపాయలు అనవసరపు ఖర్చయిందంటే - నా తికమక లెవరికి తెలుస్తాయి?

మహా: నే తీసుకున్న సొమ్ము యింటికి వెళ్లి పంపుతా -

తల్లి: నాదిమాత్రం అట్టేపెట్టుకుంటానా, నూటవచ్చాక? తలతాకట్టు పెట్టైనా పంపించేస్తాను....రా.

రాముం: ఈమాత్రం దానికి కన్న కొడుకుని కాదని ఇంట్లోంచి వెళ్ళిపోతావా అమ్మా?

తల్లి: కన్నకొడుకుచూడకపోతే కూతురు చూస్తుంది.

గౌరి: మహాలక్ష్మి! ఇంటి ఆడబడుచు అలిగి వెళ్లకూడదమ్మా - పండగ వెళ్లేదాకా ఉండండి.

మహా: నేనేంచెప్పను. దాని కిక్కడ వాతావరణం పయించడంలేదు.

రాముం: చిన్న విషయానికి స్పర్థపెట్టుకుని కొడుకుని కాదని వెళ్ళిపోతావా.

తల్లి: కన్నకొడుకు నామాట కాదంటూంటే!

రాముం: ఏమన్నాను. నా కష్టసుఖాలు కాస్త కనిపెట్టమన్నాను. మన మెంతభాగ్యవంతులమో మనకు తెలుసుకదా! పైగా అదైనా మిమ్మల్ని యేమీఅనలేదే, గౌరితో చెప్పుకుంటున్నానుకాని.

తల్లి: మాతో యెందుకు చెబుతావు - దానిమీదవంక పెట్టి అందరినీఅంటున్నావు.

రాముం: తప్పు అభిప్రాయపడుతున్నావు. నీ స్వేచ్ఛకు నీ అభిప్రాయానికి యెప్పుడూ అడ్డురాలేదు. నీమాట కెదురు చెప్పలేదు.

మహా: బండికి టైమయింది రావే వెడదాం.

గౌరి: మహాలక్ష్మి! నేను చెప్పినమాట విను పండగ వెళ్లేదాకా ఉండు.

మహా: పాడి ఉండగా పరవాన్నం - తల్లి ఉండగా పుటిల్లు...దానికే టికాణా లేదు నాకెందుకు?

రాముం: మీరు నన్ను తప్పు అభిప్రాయపడుతున్నారు మీకు యిది న్యాయంకాదు.

తల్లి: నువ్వు న్యాయంచేస్తే అనుకోవచ్చు.

రాముం: నేను చేసిన అపచారం యేమిటో నాకు స్ఫురించడంలేదు.

మహా: తప్పు చేసినవాడికి తప్పు కనుపిస్తుందా?

తల్లి: బాగా చెప్పావు.

మహా: అవిడేదో పొదుపు చేస్తున్నట్టు, మనం చెయ్యనట్టు.

తల్లి: ఇక మాట్లాడకు. మన కనవసరం. పొదుపు చేసుకుంటే యెవరికి కావాలి, ధారపోసుకుంటే యెవరికి కావాలి? పోదాం - పద.

రాముం: అమ్మా! నా పరువు మర్యాదలు కాస్త చూడు. వంశ ప్రతిష్ఠ కాస్త ఆలోచించు.

తల్లి: అందుకోసమే నన్ను బ్రతిమాలుతున్నావు, నా కోసం నా సౌఖ్యంకోసం కాదు!

రామం: అలా విపరీతార్థాలు తీస్తే యేమి చెప్పను? తిండిపెట్టలేక తోలేశా ననుకుంటుంది లోకం. అభిమానం భరించలేను.

తల్లి: ఓ – యిప్పుడొచ్చిం దభిమానం!

మహా: నీ బ్రతుకంతా వాడితో నే ఉందనుకున్నాడు!

తల్లి: పెళ్ళాం చేతిలో పిల్లిపిల్లయితే వాడికేలేదు నాకేమిటింక!

మహా: అవునులే – నీ జిగినీ తీస్తుకున్నావా పెద్దపెట్టెలోది?

తల్లి: అది యిందాకనే జాగ్రత్తపడ్డా... రెండువందల రూపాయల జిగినీ పోతుందనే యీ ప్రేమంతా.

రామం: జిగినీ నీ యిష్టంవచ్చినవాళ్ళకిచ్చుకో – నాకక్కరలేదు. నన్ను మన్నించు. నాదగ్గర ఉండు.

తల్లి: రావే – టయిమయింది.

[నిష్క్రమణ]

రామం: వినవుకదూ – అమ్మా! వినవూ.

గౌరి: ఇంకా వినేదేమిటి – మన మొహాన్నలా ఉంది.

* * *

2 వ రంగం

రామం: (మూల్గుతూ – దగ్గుతూ) అబ్బ! అమ్మ! - ఇవేళ పరిస్థితి యేమీ బాగుండలేదు. గౌరీ! ఈ వేళ తేదీ యెంత?

గౌరి: తర్చు మాట్లాడవద్దన్నారు డాక్టరు —పైగా యిప్పుడు తేదితో పనియేమిటి?

రామం: ఏమీ లేదు – అమ్మవెళ్ళి యివేళకెన్నాళ్లయింది?

గౌరి: నెలపైన రెండురోజు లయింది.

రామం: కొన్ని సంవత్సరాలు గడిచినట్టుంది.

గౌరి: ఆదయ ఆవిడకి లేదు. కాళ్ళు పట్టుకున్నా వినకుండా వెళ్ళిపోయారు.— ఆవేళ ఆ వంకమీద నన్ను కొట్టినా వాళ్లకి తృప్తి కలిగి ఉండేవాళ్లేమో!

రామం: బాగుంది వరస.

గౌరి: ఏం బాధపడుతున్నారో పాపం, నోరకాని మాయమర్మం యెరుగని మనిషి.

రామం: అదే నేనూ ఆలోచించేది... పైగా మహాలక్ష్మి పెనిమిటి తొందరమనిషి కూడాను.

గౌరి: ఇల్లరికం వెళ్ళిన మగాడికీ కుడువ కూతురింటికెళ్ళిన ఆడదానికీ మానాభిమానాలుంటాయా? తలొంచుకొని కాలక్షేపం చెయ్యాలి కాని.

రామం: ఏమో ఏమిచేస్తుందో.

గౌరి: మందుకు టయిమయింది పుచ్చుకుంటారా?

రామం: పుచ్చుకుంటాలే – మందూ మాకూ పనిచేసేట్టు కనుపించటంలేదు.

గౌరి: పుట్టెడు బెంగపెట్టుకుంటే మందులెలా పనిచేస్తాయి? – మన మొహాన్నిలా వాదు మోయవల్సి వుంది. ఎవరు తప్పిస్తారు.

రామం: అందరూ పొడిచి పొడిచి అడిగితే...

గౌరి: ఎవరు?

రామం: ఎరిగున్నవాళ్లు – స్నేహితులు.

గౌరి: వాళ్లకేం తెలుస్తాయి నిజానిజాలు.

రామం: అయినా నన్ను ద్రోహిలా పరిగణిస్తూంది లోకం.

గౌరి: లోతులు తెలవటం లోకం పని. కొత్త యేముంది?

రామం: ఎలా చెప్పి 'అయ్యో' అన్నవాడు లేడు.

గౌరి: 'మీ అత్తగారు వెళ్ళిపోయిందిట' అని నన్ను చాలామంది అడిగారు.

రామం: ఏమన్నావు?

గౌరి: ఏమంటాను. ఏమన్నా చెబితే విషపునవ్వు నవ్వటం.

రామం: ఎవళ్లకొంపలోనూ యేమీ లేనట్టు.

గౌరి: 'ఆయన దేవుడు. ఆచలమంతా నీదో' నంటూ పెద్ద గొడవ.

రామం: ఆడాళ్ళలా అంటున్నారు. మొగాళ్లు 'పెళ్లాం చాలా పెద్దమనిషి రామం కరుకుమనిషి' అంటున్నారు.

గౌరి: అంతే నేను చెప్పలేదూ?

రామం: ఇందులో యెక్కడైనా న్యాయం కనుపిస్తుందా?

గౌరి: న్యాయముంటే అనుకోవట మెందుకు?

రామం: కన్నతల్లే న్యాయం తెలుసుకోకుండా వెళ్లిపోయింది. పరాయివాళ్ళలా తెల్సుకుంటారు?

గౌరి: అంతేలెండి.

రామం: ఎంతగుట్టుగా కాలక్షేపం చేద్దామన్నా సాధ్యంకాకుండాఉంది దానితో – ఆర్థికపరిస్థితి తెలుసుకోకుండా 'అవి - ఇవి. అన్నీ' అంటూంటే యెలాగ?

గౌరి: మొండిపట్టు! కాదంటే కలహం - ఓర్మి వహించాలి. అదితప్ప విడిస్తే ఆవిడ మనస్సు వెన్నపూస.

రామం. ఎంతఓర్మివహించినాఒక్కటే! మొన్నమట్టుకు మొన్న మహాలక్ష్మి కూతురికి కాళ్లగజ్జెలు చేయించలేదని కోపగించింది – మీతో చెప్పలేదు. చేతి గడియారం అమ్మి చేయించాను.

గౌరి: ఆఁ...ఆగడియారం అమ్మేశారా?

రామం: మరెలా చేయించాను?

గౌరి: బాగానే ఉంది వరస. ఇదిగో మందు పుచ్చుకోండి.

రామం: (మందుత్రాగి) అమ్మయ్య – ఈరోగంతో మళ్ళీ ఇరవైరూపాయలు.

గౌరి: ఎంతైనా తప్పదు.

రామం: గౌరీ! ఇలా సుస్తీగాఉంది; అరు లంఖణాలు అని ఉత్తరంవ్రాస్తే వస్తుందేమో!

గౌరి: ఎవరు?

రామం: మాఅమ్మ.

గౌరి: ఏమో! ఇప్పట్లో వస్తారనుకోను.

రామం: పోనీ ఉత్తరం వ్రాయటంవల్ల పోయిందేమిటి?

గౌరి: వ్రాస్తేవ్రాయండి.

రామం: వ్రాసి ఉంచుతాను. ఆనక వాళ్లబ్బాయిచేత పంపి పోష్టుచేయించు

గౌరి: పాపం! కష్టమనేది యెరుగరు

★ అభిమానం ★

పాపం. ఎలాగ ఉన్నారో యేమిటో అత్తయ్య.

రామం: అమ్మ జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వళ్లు జల్లుమంటుంది. పైగా - మహాలక్ష్మి యింటాయన చాలా కరుకుమనిషి.

గౌరి: చుర్రుబుర్రు మనుష్యులే యిద్దరూ కూడా.

రామం: ఏమన్నా యీవిడ ఊరుకోదు.

గౌరి: మరే.

రామం: వాళ్లియిద్దరికే మాటమాట వస్తే మహాలక్ష్మివాళ్లాయన్ని వెనక వేసుకొస్తుంది.

గౌరి: ఇక్కడలా కేకలు కోపాలు భరిస్తారా మరి!

రామం: అది భరించలేకపోతే వచ్చేస్తుందా అని.

గౌరి: అంతకంటె యింకేం చేస్తారు?

రామం: పౌరుషంకొద్దీ ఏ అఘాయిత్యమైనా చేస్తుందేమో?

గౌరి: అంతటి మనిషి కూడాను.

రామం: అందుకే జ్ఞాపకం వచ్చినప్పుడల్లా భయం వేస్తూంటుంది.

గౌరి: కాస్త పత్యం పుచ్చుకున్నాక ఒకసారి వెళ్ళి చూసిరండి. (బయట బండి చప్పుడు.)

రామం: అలాగే చెయ్యాలి. పొమ్మనరు కదా.

గౌరి: అంటే అననివ్వండి. ఆమాట వాళ్ళకే ఉంటుంది. (గుమ్మంలో బండి ఆగింది. నిశ్శబ్దం)

రామం: ఇదిగో చూడు గుమ్మంలో బండి ఆగింది.

గౌరి: ఎవరు చెప్మా.

రామం: నాకోస మెవరైనా వచ్చారేమో.

గౌరి: చూచి వస్తా మీరు లేవకండి. (వెళ్లి మళ్ళీ త్వరత్వరగా గౌరి ప్రవేశం.)

గౌరి: (నెమ్మదిగా) మీ అమ్మ వచ్చారండి.

రామం: ఆఁ - మా అమ్మ - వచ్చిందా?

గౌరి: అవును - బండి దిగివస్తున్నారు.

[తల్లి ప్రవేశం]

రామం: అమ్మా! అంతా నింపాదిగా ఉన్నారా అక్కడ?

తల్లి: ఆఁ.

గౌరి: కాస్త దాహం పుచ్చుకుంటారా?

తల్లి: వద్దమ్మా.

గౌరి: పోనీ కాస్త కాఫీ పెట్టనా?

తల్లి: వద్దమ్మా - అలా మంచంమీద పడుకున్నావేరా బాబూ?

గౌరి: సుస్తీగా ఉంది - ఆరు లంఖణాలు.

తల్లి: కాస ఉత్తరం వెయ్యకపోయావురా నాయనా? నేను చచ్చిపోయాననుకున్నావా?

రామం: ఇప్పుడే అనుకున్నాను, ఉత్తరం వెయ్యాలని. రేపు పత్యం పుచ్చుకుంటూ.

తల్లి: ఏమయినా యింతేనా?

రామం: కాదమ్మా! కంగారుపడక్కర లేదు. మహాలక్ష్మి పిల్లలు కులాసాగా ఉన్నారా?

తల్లి: (మాట్లాడదు)

గౌరి: ఏమండి అత్తయ్యా! వదినా పిల్లలూ కులాసాగా ఉన్నారా?

తల్లి: ఏం చెప్పను. ఎలాపడితే అలా ఉంది ఆకొంపవరస.

రామం: ఏమమ్మా? గోపాలం యింకా కుదుటపడలే?

తల్లి: పుట్టుకకి పుట్టిన బుద్ధి పుల్లల్తోగాని పోతుందా? (ఏడుస్తూ) దాన్ని ఒక్కవర్సని బాధపెడుతున్నాడు.

రామం: నిన్నేమీ అనలేదు కదా?

తల్లి: అడ్డంపడితే నన్నూ నానాబూతులు తిట్టాడు.

రామం: వద్దని చెప్పలేదమ్మా! దుష్టుడికి దూరంగా ఉండాలి. కాని మాట అన్న తరువాత బాధ యెందుకు?

గౌరి: అయిందేదో అయిపోయింది... విచారించి ఫలిత మేమిటి?

తల్లి: వాడి మొహంమండ చంటిపిల్ల కడియాలు గజ్జెలు అమ్మి జూదంలో పెట్టాడు (ఏడుస్తూ) నా జిగినీకూడా నాతో చెప్పకుండా అమ్మేశాడు.

రామం: నువ్వు యిచ్చావా?

తల్లి: పెట్టుకుంటానంటే మహాలక్ష్మికిచ్చాను. నాతో చెప్పకుండా యిచ్చేసింది

రామం: పోనీలే. ప్రాప్తం లేని వస్తువు.

గౌరి: ఊరుకోండత్తయ్యా - మనది కాదనుకోవటమే.

తల్లి: కాక యింకేమిటి చేసేది - నా మొహం మండ - చక్కగా పువ్వుల్లో పెట్టి చూస్తుంటే - తగువు పెట్టి లేచిపోయాను. గోపాలం సరేకదా? మహాలక్ష్మికి కూడా నేనంటే కిట్టకుండాపోయింది

గౌరి. వాళ్ళు చూడకపోతే ఆగుతుందా?

తల్లి: గోపాలం ఏంచేసినా మహాలక్ష్మి పల్లెత్తుమాటకూడా అనదు. అదేం కాపరమో.

గౌరి: అయినదానికి విచారించి ఫలితం లేదు...మీరు వెళ్ళిపోతే మీ అబ్బాయికి మనస్సు స్థిమితంలేక ఒంటికి వచ్చింది. పైగా నలుగురూ నాలుగు మాటలూను.

తల్లి: కాదుమరీ - అనవసరంగా అంటే అభిమానంకాదూ? - నా కలా వచ్చింది పోయేకాలం. ఇల్లరికంవెళ్ళిన మొగాడూ కొడుకు కూతురింటికి వెళ్ళిన ఆడదీ ఎవళ్ళు సుఖపడ్డారు?

రామం: పొద్దెక్కింది - స్నానంచేసి భోజనం చెయ్యి.

తల్లి ఇదుగో వెడుతున్నా.

గౌరి: ఆలస్యం చెయ్యకండి - వంట అయింది. ★

చక్రీయ సౌష్ఠవం

ఏ వారం గుర్తుండకపోయినా యీ మూడో శనివారంమాత్రం బాగా గుర్తుంటుంది రామానికి. ఎక్కడికి వెళ్లాలన్నా అదే శెలవుదినం. శనివారం కదా అని షికారు వెళదామనుకొన్నాడు రామం. చిలకకొయ్యనున్న చొక్కా తీసి తొడుగుకొంటూవుంటే వీపుమీద చిరుగు ఫక్కున నవ్వింది. అయినా అతనేం చలించలేదు. ఎదురుగా ఆ ప్రక్క చిలకకొయ్యనున్న కోటు ఫరవాలేదని ఓదార్చింది. ఆ కోటు కూడా చివరల దారా లూడిపోతూ శిథిలావస్థలోనే వుంది. అయినా ఆ కోటే ఎన్నో సంవత్సరాలనుంచి తన గౌరవం కాపాడుతోంది. చొక్కాకి యెన్ని చిరుగులున్నా మర్యాదగా కప్పిపుచ్చి తన గౌరవం కాపాడుతోంది. అందుకనే ఆ కోటంటే రామాని కెంతో గౌరవం. కోటుతీసి తొడుక్కున్నాడు.

నలిగి తెగిపోయిన పాదరక్షలు అతని కాళ్లకి దగ్గరగా జరిగాయి. అవి తొడుక్కోబోతోంటే అవతలనించి నరసింగరావు పిలిచాడు.

"రామం!" అంటూ అతను తలుపు త్రోసుకు లోపలికి వచ్చాడు.

"ఓ! నరసింగరావా? ఏమిటి విశేషం?" అనడిగేడు రామం.

"ఓ పదిరూపాయలుంటే సర్దాలోయ్. అర్జంట్" అని సూటిగా అడిగేశాడు నరసింగరావు. అతని మొగంలో యేవో ఆశారేఖలు మెరుస్తున్నాయి.

నరసింగరావు కూడ ఓ గుమాస్తా. ఆ ఆఫీసులోనే రామంకూడా పనిచేస్తున్నది. ఇద్దరి స్థితిగతులు ఒక్కలాగనే వున్నాయి. అయినా అనేక అక్కరసమయాల్లో రామానికి నరసింగరావు సహాయం చేశాడు. ఇప్పుడతనికే అవసరం వచ్చింది. అసలు రామం అతని కివరకే పదిరూపాయలు బాకీ వున్నాడు. తనడిగినప్పు డెప్పుడూ నరసింగరావు లేదనలేదు. అందుకే చాల బాధపడ్డాడు రామం లేదని చెప్పడానికి. ఇప్పటింకా యిరవైఐదవ తారీకు. ఇంక ఆరు రోజులకికాని జీతం అందదు.

"అంత ముఖ్యమటోయి నరసింగరావూ?" అన్నాడు రామం. ఇంకేమీ అనలేక.

"అవునోయి. నా ఫ్రెండు కొకతనికి నే బాకీ వున్నాను. అతనికి డబ్బు చాల అవసరమట, తక్షణం కావాలని బ్రతిమాలాడు..."

తనకేం చెయ్యడానికీ పాలుపోలేదు రామానికి. అయినా తను మాత్రం చెయ్యగలిగిం దేముంది? ఇది మరీ గడ్డురోజులు, అందులోనూ నెలాఖరు. ఇక తనవద్ద డబ్బెలా వుంటుంది? తనవద్ద

తంత్రవహి వెంకటరావు

లేదంటే చిన్నబుచ్చుకొంటాడు. ఛీ! ఇన్నిసార్లు తనకి సాయంచేసిన ఒక మిత్రునికి యీమాత్రం సాయం చెయ్యలేకపోవడమా? పైగా తనతనికి బాకీ వున్న పది రూపాయలైనా ఇంకా తీర్చలేదు.


"ఏమిటి ఆలోచిస్తున్నావు రామం!" అన్నాడు నరసింగరావు.

"ఏముంది? నన్ను పూర్తిగా యెరుగుదువు కదా! నా జీవితం - నా జీతం సంగతి కూడా తెలుసు గదా? పైగా యివి నెలాఖరు రోజులు. ప్రతి నెలా నీదగ్గరే అప్పు చేసే యీ దరిద్రుడు నీకు అప్పు యెలా యివ్వగలడు చెప్పు? నీ కియ్యవలసిన పది రూపాయలే యియ్యలేకపోతే, యిక నే నెందు కనిపిస్తోంది..."

"అవును. మనం ఇద్దరం ఒకటే. ఎవరు మటుకు యేంచెయ్యగలం?" అని నిట్టూర్చేడు నరసింగరావు.

ఇద్దరూ బజారుకి బయలుదేరారు. రెండు ప్రక్కలా శూన్యంగా చూస్తూ యిద్దరూ నడుస్తున్నారు మౌనంగా. వారికి సామాన్యంగా సాయంత్రం షికారు అలవాటైపోయింది. పగలంతా ఆఫీసులో బండచాకిరిచేసి అలసిపోయి యింటికివచ్చి ఓ అరకప్పు గరమ్ గరమ్ టీ తీసుకుని పట్టణపు మురికిగొందులు దాటి పురవీధుల స్వేచ్ఛావాయువులు పీలుద్దామని బయలుదేరతారు.

ప్రక్కని కోటయ్య మిఠాయికొట్టులోంచి కమ్మని వాసనలు ముక్కుని మత్తెక్కించి నవులూరిస్తోంటే చిల్లి కానైనా లేని జేబులో చేతులు తెగ కదులుతోంటే, దారిన మనుష్యుల్ని లాక్కుపోతూన్న రిక్షావాళ్ళని చూస్తూ మౌనంగా నడు



కడప-కర్నూలు కాలువపై రైలుబ్రిడ్జి

స్తున్నారు మిత్రులిద్దరూ. ప్రక్కనున్న హోటల్లోంచి సంగీతం చెవులు గింగురు మనిపిస్తోంది. ఇద్దరూ త్వరత్వరగా నడిచారు.

మిత్రులిద్దరూ బాధపడుతూనే నడుస్తున్నారు— అన్నీ తెలిసి యెందుకడిగానా అని నరసింగరావు, ఇంత ఆప్తమిత్రుడి అవసరం గడపలేకపోయానే అని రామం—

వాళ్ళిద్దరూ విడిపోవాల్సిన వీధి వచ్చింది.

"ఏమీ అనుకోకు! నీకు తెలుసుగా! నేను చెయ్యగలిగినవాణ్ణయితే చేసివుండేవాణ్ణి. కాని నేను వట్టి అసమర్థుణ్ణి!" అన్నాడు రామం.

"అనవసరంగా అన్నీ తెలిసి నిన్ను కష్టపెట్టాను నన్ను క్షమించు" అన్నాడు నరసింగరావు.

మిత్రులిద్దరూ ఒకరిపై నొకరు జాలిపడ్డం తప్పితే యింకేమీ చెయ్యలేకపోయారు.

గబగబా పెద్దపెద్ద అంగలు వేసుకొంటూ తలవంచుకు వెళ్ళిపోయాడు నరసింగరావు.

బరువెక్కిన హృదయంతో నెమ్మదిగా ఆలోచిస్తూ నడుస్తున్నాడు బజారువెంట రామం.

ఎలాగో ఒకలాగు పది రూపాయలు సంపాదించాలి. తన కెట్లా వస్తాయి? ఇంకా యీ నెల అద్దె బాకీ వున్నాడు. మొన్ననే పాలవాడు వచ్చి దెబ్బలాడి తన బాకీ తీర్చకపోతే యింక పాలు పొయ్యనన్నాడే! పాలు పొయ్యకపోతే తన పిల్లాడి పనేం కాను? అవతల తల్లివద్ద అసలే పాలు లేవాయె!

ఇలా ఆలోచిస్తూనే నడుస్తున్నాడు బజారువెంట. అలవాటైన రస్తామూలాన అతని కాళ్లు జాగ్రత్తగా బజారులో యే బండి క్రిందా పడకుండా తీసుకుపోతున్నాయి. జీవితంలో యిలా కొన్ని విషయాలపై కొంతకాలానికి బుర్ర పని చెయ్యకుండానే పని జరిగిపోతుంటుంది. అతని వేళ్ళుకూడా బుర్ర చెప్పకుండానే వాటంతటవి టైపు మిషను మీద నాట్యం చేస్తూంటాయి.

అలా నడుస్తూండగా రామం స్మృతిపథంలో తటుక్కున ఓ ఆలోచన మెరిసింది. సీతాపతిమాట జ్ఞాపకం వచ్చింది.

సీతాపతి తనలాగే యింకో ఆఫీసులో గుమాస్తా. అతను క్రిందటినెల తనదగ్గర పది రూపాయి లప్పుతీసుకున్నాడు. యీ నెల తిరక్కుండా తప్పక తీసుకవచ్చి యిచ్చేస్తానన్నాడు. ఇస్తానంటే యిచ్చేదాకా నిద్రపట్టదు.

రామం సంతోషంగా నిట్టూర్చాడు. గబగబా పరుగెత్తి సీతాపతి యింటికి వెళ్లాడు.

రామం వెళ్ళేసరికి సీతాపతి అప్పుడే బజారుకి బయలుదేరుతున్నాడు. రామాన్ని చూచి "గుడ్ మార్నింగ్ రామం!" అన్నాడు.

ప్రతి నమస్కారం చేశాడు రామం.

"ఏమిటి విశేషం?" అని అడగవలసిన మొదటి ప్రశ్న అడిగి, సాదాగా నవ్వేడు సీతాపతి.

అతనెప్పుడూ నవ్వుతూ ఉంటాడు. లోకంలో నవ్వు తప్పితే యింకోటి లేదంటాడు సీతాపతి. మనకున్న బాధల్ని ఖర్చుపెట్టి నవ్వు సృష్టించుకోవాలంటాడు. నవ్వడం తప్పితే తనకింకోటి తెలీదంటాడు. అతని కింకా గుమాస్తాజీవితపు తొలిరోజులు. ఇంకా ఒంటరిగాడు.

"ఏముందోయి" అంటూ నవ్వేడు రామం.

"నీ పదిరూపాయిలు..." అన్నాడు సీతాపతి.

అతని చెప్పడూ అంతే! తను రూపాయిలడగడానికే వచ్చినట్టు గ్రహించాడు. ఎప్పుడూ ఎదిరి మనసు గ్రహించి, వచ్చే ప్రశ్నకి ముందే సమాధానం చెపుతూంటాడు, అనుకున్నాడు రామం.

"అవును. ఒకమిత్రుని కవసర మొచ్చి వచ్చాను" అన్నాడు రామం.

"సరే! ఈవేళ లేవు. సరిగా రేపు ప్రొద్దున్న ఎనిమిదింటికి...హోటల్ కి రండి. నా కొక మిత్రుడు బాకీవున్నాడు. అతనక్కడికి తప్పక తీసుకువస్తాడు రేపు. అక్కడే మీ కిచ్చేస్తాను." అని ధైర్యం చెప్పి పంపించాడు రామాన్ని సీతాపతి.

ఇప్పుడు ప్రాణం లేచివచ్చినట్లయింది రామానికి. సీతాపతికి కృతజ్ఞత చెప్పి తిన్నగా నరసింగరావు యింటికి వెళ్లాడు.

"ఇంత అర్జంటుగా వచ్చావేం రామం?" అన్నాడు నరసింగరావు.

"నీగురించే! డబ్బడిగేవు కదూ! రేపు వుదయం సరిగ్గా యెనిమిది గంటలకి—హోటల్ కి రా! నా కొక మిత్రుడు బాకీవున్నాడు. ఆయన కక్కడిస్తానన్నాడు. ఆ డబ్బు అక్కడే నీ కిచ్చేస్తాను."

"సరే! రేపెలానూ ఆపక్కకి రావాలిలే" అన్నాడు నరసింగరావు.

చిరునవ్వు నవ్వుకొంటూ రామం ఇంటికి వచ్చేశాడు.

* * *

రాత్రి తృప్తిగా నిద్రపట్టింది. తన మిత్రుని అవసరం తీర్చగలనుకదా అన్న ఆనందంతో రామానికి మత్తుగా నిద్రపట్టి తెల్లవారి ఆలస్యంగా లేచాడు. తలుపు లేని కిటికీలోంచి సూర్యకిరణాలు సూదుల్లా వచ్చి మీదపడి గుచ్చి లేపితేనే గాని లేవలేదు.

లేచి టైముచూస్తే అప్పుడే ఏడున్నరైపోయింది. గబగబా కాలకృత్యాలు తీర్చుకుని తిన్నగా హోటల్ కి వెళ్ళిపోయాడు. అప్పుడే సరిగా ఆ వైపునుంచి నరసింగరావూ యీ వైపునుండి సీతాపతీ వస్తున్నారు. ముగ్గురు మిత్రులూ ఒకేసారి మెట్లెక్కి లోపలికపోయి ఒకేచోట కూర్చున్నారు.

మూడు కాఫీలకి ఆర్డర్ వెళ్లింది.

ముగ్గురూ ఒకరిమొగాలవైపొకరు చూచుకున్నారు.

సీతాపతి నరసింగరావువైపు చూశాడు!


నరసింగరావు రామంవైపు చూచాడు!

రామం సీతాపతివైపు చూచాడు!

ముగ్గురూ నవ్వుకొన్నారు.

ముగ్గురి మొగాలలోనూ కొశ్చన్ మార్కు, ఆ తర్వాత ఆశ్చర్యార్థకం గోచరించాయి. చివరికి సీతాపతి హాలు దద్దరిల్లేలా గట్టిగా నవ్వుతూ,

"బాగుంది. నేను వీరికి బాకీ! వీరు వారికి బాకీ, వారు నాకు బాకీ! అహోహ! చక్రీయ సౌష్టవం..."అన్నాడు. ★



కర్నూలు వద్ద హంద్రీనది పరవళ్లు

ఫొటోలు: శ్రీమతి లీలాకుటుంబరావు—కర్నూలు.

వనితాలోకం

స్త్రీల ఆస్తి హక్కులు

కొమ్మూరి ఉషారాణి

మనుష్యులు కొండల్లో అడవుల్లో నివసిస్తున్న అనాగరికపు కాలంలో ఆడపిల్లలు కలిగితే తల్లితండ్రులకు ఒకవిధంగా సంతోషంగానే వుండేది. భూములూ యిళ్లూ మొదలైనవాటికి మల్లే స్త్రీలను కూడా విక్రయించేవారు. అలా విక్రయింపబడ్డ స్త్రీలకు ప్రత్యేకంగా వ్యక్తిత్వంగానీ స్వాతంత్ర్యంగానీ వుండేవి కావు. పురుషులు స్త్రీలని తమ ఆస్తిలో ఒక భాగంగా ఎంచుకునేవారు. వెట్టిచాకిరీ చెయ్యటానికి పశువులను ఏవిధంగా ఉపయోగించుకునేవారో బహుశః పురుషులు స్త్రీలని అదేవిధంగా పశుసంపదలో ఒక భాగంగా భావించి వుండాలి. పురుషుల ఆస్తిలో ఒక భాగంగా ఎంచబడిన స్త్రీ ఆనాటి సమాజంలో ఒక బానిసమాత్రమే. ఆమెకు ప్రత్యేకం ఆస్తి అన్న ప్రశ్న వచ్చేదికాదు. అప్పటికీ ఇప్పటికీ మధ్య అనేక వేల సంవత్సరాలు గడిచి సమాజం పురోగమించి, ఎంతనాగరికత వృద్ధిచెందినా స్త్రీలకు బానిసత్వం ఎంతవరకు పోయింది! ఈనాటికీ పురుషులలో అధిక సంఖ్యాకులు స్త్రీలనుగురించి వారి దృక్పథాన్ని ఎంత మటుకు మార్చుకున్నారో!

స్త్రీకి సొంత ఆస్తి లేకపోగా భర్త సంపాదించిన ధనంమీదగానీ భూములమీదగానీ ఆమెకు అధికారంవుండేదికాదు. ఆనాటి సామాజికులు కుటుంబ పోషణకు కావలసిన పరికరాలను ఉపయోగించుకోవటానికి మటుకు స్త్రీకి ఉదారస్వభావంతో కొంత అధికారమిచ్చేవారు. భర్త ఆమె పోషణ భారాన్నిగూడా త్యజించి ఆస్త్రీని అన్యాక్రాంతం చేసేవాడు. సామాజిక జీవితంలో కొద్దిమార్పులు వచ్చి, నాగరిక లక్షణాలు ఏర్పడినతరువాతగూడా, భార్య భర్త యొక్క ఆస్తిని సమంగా అనుభవించవచ్చునన్నారేగాని, భర్త ఆ ఆస్తిని దుర్వినియోగంచేస్తేమటుకు నోరు మెదపడానికి వీలు లేదన్నారు.

స్త్రీలకు ఆస్తి ఎందుకు? అని ప్రశ్నించారు మన వేదకాలంలో. మనువు, యాజ్ఞవల్క్యుడు బృహస్పతీ మొదలైన స్మృతికర్తల కాలంలో స్త్రీలకు ఆస్తిహక్కు వుండేదని నిదర్శనాలున్నప్పటికీ ధర్మసూత్రకాలంలో ఆ హక్కు లేకుండా పోయింది. వేదకర్మలలో పాల్గొనలేని స్త్రీలు ఆస్తిని పొందటానికి అనర్హులుగా ఎంచబడ్డారు. అంతేకాదు ఒకవేళ ఆస్తివచ్చినా, దానిని కాపాడుకోవటానికీ ఆధ్వర్యం వహించటానికీ కావలసిన వ్యావహారిక జ్ఞానం లేదనుకోడం వల్లనే స్త్రీలు ఆస్తిని పొందకూడదనేవాదనకి ఆధారమైంది. అసలు స్త్రీలకు ఆస్తి విషయంలో హక్కు అనేది ఊహకందని విషయంగా తయారయింది వారికి. న్యాయశాస్త్రం దృష్ట్యా భార్యాభర్తలకి తారతమ్యం లేకపోవటం జరిగింది. స్త్రీలు అవివాహితలుగా తండ్రిదగ్గిరేవుంటే పరిస్థితి ఏర్పడేదికాదు. కనుక కుమార్తె వివాహపుఖర్చుకిమటుకు కుమారునివాటాలో నాలుగోవంతు యివ్వటం ఒక ఆచారమయింది. ఈపద్ధతిప్రకారం మన హైందవ సంప్రదాయంలో స్త్రీలకు ఆస్తి ఏవిధంగానైనా సంక్రమిస్తే అది తండ్రి కుమార్తెకు వివాహం సందర్భంలో కొంత ఔదార్యంతో యిచ్చినది మాత్రమే.

అనాదినుంచీ హిందూసమాజం "స్త్రీధనా"న్ని అంగీకరించింది. హిందూ న్యాయశాస్త్రం మీద ఏ పుస్తకంతిరగవేసినా "స్త్రీధనం" నిర్వచనదగ్గిరకి వచ్చేటప్పటికి ప్రఖ్యాత న్యాయశాస్త్రవేత్తలూ, వాదోప

వాదాలలోకి దిగినట్లు స్పష్టమవుతుంది. స్త్రీ ధనంలో స్థిరచరాస్తులు కలసి వుండవచ్చు. చుట్టరికం లేనివారు యిచ్చిన బహుమతులనీ, స్త్రీలు స్వశక్తివల్ల సంపాదించిందిన ధనాన్నీ స్త్రీ ధనంగా పరిగణింపవచ్చునా అనే విషయాలు చర్చనీయాంశాలయాయి. వాటి ఫలితం వివాహ సమయంలో వచ్చిన బహుమతులూ, ధరించిన నగలూ, భరణమూ మటుకు ఆమె స్త్రీ ధనంగా మిగిలాయి ఇవి మినహా ఆమెకు సొంతమని చెప్పుకోగలిగే ఆస్తి ఎటువంటిదీ వుండేది కాదు.

ఆ స్త్రీధనం ఆమెదేవినా సంపూర్ణమైన హక్కు వుండేది కాదు. విద్య, శిక్షణ లభించక ఆస్తికి సంబంధించిన అనేకవిషయాలు అజ్ఞాతంగా ఉండిపోవటంవల్ల భర్తే ఆమెఆస్తిమీద ఆధ్వర్యం వహించేవాడు. అదీగాక ఆపత్కాలంలో భర్త ఆ ధనాన్ని గూడా వినియోగించుకోవచ్చునని చట్టంలోని ఒక విచిత్రమైన అంశం ఫలితంగా స్త్రీలకు అన్యాయం జరిగేది.

పుత్రికకు మన ప్రాచీన హైందవ సాంప్రదాయం కొంత ప్రాముఖ్యమిచ్చింది. ఔరస పుత్రుని తరువాత వారసత్వంలో పుత్రికకు ముఖ్యస్థాన మిచ్చారు గౌతముడు. మితాక్షరలోని సూత్రాలు కుమార్తెకు సమిష్టికుటుంబ ఆస్తిలో భాగంవుందని నిర్వచించాయి అంటే సోదరులు, యితర వారసులు లేనిపక్షంలో కుమార్తెకు భాగం వుండవచ్చు నన్నారు కానీ 1937 వ సం॥లో ప్రవేశపెట్టబడిన శాసనం స్త్రీల ఆస్తి ఆమె సొంత వారసులకి, అంటే కుమార్తెలకు సంక్రమించాలని నిర్ణయించింది. స్త్రీలు సంపాదించిన ఆస్తి ఆమె సొంత ఆస్తి కావటమే గాకుండా దానిమీద సర్వహక్కులూ యివ్వబడ్డాయి భర్తకి దానిమీద ఎటువంటి హక్కూ వుండదు. ఈ విధంగా తల్లి ఆస్తిలో భాగం పొందటానికే గాని తండ్రి ఆస్తిలో భాగానికి మాత్రం అవకాశం ఏర్పడలేదు.

మన పార్లమెంటులో ప్రవేశపెట్టబోతున్న హిందూ వారసత్వపు చట్టంలో తల్లి ఆస్తి కుమారులకు కూడా సంక్రమింపచేస్తున్నారు, దీనివల్ల స్త్రీలకు మరింత అన్యాయం జరగబోతున్నది. తల్లి ఆస్తిలో కుమారునికి కుమార్తెతోబాటు సగం భాగం రావాలనేది స్త్రీలకిప్పుడు ఎంతమాత్రం లాభదాయకం కాదు తండ్రి ఆస్తిలో వాస్తవంగా ఎక్కువ భాగం పొందలేని స్త్రీలు తల్లి ఆస్తిని వదులుకోవటమనేది చాలా అన్యాయం.

పోనీ తల్లి ఆస్తిని వదులుకుంటే మటుకేం తండ్రి ఆస్తిలో భాగ మిస్తున్నారుకదా అనుకుంటే చట్టంలోని మరో అంశం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వారసత్వంలో మన న్యాయశాస్త్రం స్వార్జితపు ఆస్తికీ సమిష్టికుటుంబ ఆస్తికీ తేడా ఏర్పరిచింది. ఈ నూతన చట్టం సమిష్టి కుటుంబ ఆస్తికి వర్తించదు. అంటే తండ్రులు తాతలు తరతరాలుగా ఆర్జించిన కుటుంబ ఆస్తిలో భాగం కోరటానికి ఆమెకు వీలులేదన్నమాట.

ఇక మిగిలినది తండ్రి స్వార్జితపు ఆస్తి అదికూడా కుమారుడికి సంక్రమించగానే అతని కుమార్తెలు వచ్చేనాటికి సమిష్టి కుటుంబ ఆస్తిగా మారిపోతుంది అంటే ఒక తరంలో కుమార్తెకు ఆస్తి సంక్రమిస్తుంది. కానీ రెండో తరంలో కుమారుడికి కుమార్తె కలిగేనాటికి అది కుటుంబఆస్తిగా మారిపోతుంది. తల్లికీ, సోదరులకీ పోగా మిగిలే భాగమే చాలా కొద్ది. అది సంక్రమించడం విషయంలో గూడా న్యాయం జరగటములేదు.

ఇక వారసత్వపు హక్కులని మన శాసనకర్తలు స్త్రీలకు యిస్తూనే వున్నట్లు కనబడతారు. ఒక వ్యక్తికి కుమారులు గానీ యితర వారసులు గానీ లేని పక్షంలో, అతని మరణానంతరం ఆ ఆస్తి వితంతు భార్యకీ, కుమార్తెకీ, తల్లికీ వరుసగా సంక్రమిస్తుంది 1929 వ సం॥లో తీసుకురాబడిన మార్పు ఫలితంగా కుమారుడి కుమార్తెకూ, కుమార్తె కుమార్తెకూ, సోదరికి గూడా (పైన ఉదహరించిన వారసులు లేని పక్షంలో) ఆస్తి సంక్రమిస్తుంది అయినప్పటికీ వారసత్వం విషయంలో స్త్రీలకంటె పురుషులకి ఎక్కువ పక్షపాతం చూపెట్టడం జరుగుతోంది. స్త్రీద్వారా వచ్చే చుట్టాలు ఎంత దగ్గరవారైనా, పురుషుల ద్వారా వచ్చే చుట్టాలకు, అంటే వారు ఎంత దూరపువారైనాసరే, వారసత్వంలో మొదటి స్థానం ఇస్తున్నారు. కొత్త వారసత్వపు బిల్లు ఈ అన్యాయాన్ని తొలగిస్తే బాగుంటుంది.

ఈవిధంగా చూస్తే, వారసత్వం విషయంలో మహమ్మదీయులు స్త్రీలకు చేస్తున్నంత న్యాయం మరెక్కడా కనిపించదు. వారసులలో స్త్రీలకుకూడా పురుషులతోబాటు వాటాలుంటాయి. కుమార్తెకూ, వితంతువుకీ, తల్లికీ మేనత్తకూ గూడా ఆస్తిలో భాగం వొస్తుంది. ఇంతే కాదు. ఒకవ్యక్తి ఆ ఆస్తిని అన్యాక్రాంతం చేసేటట్లయితే, ప్రతిఫలంలో మూడోవంతు వారసులకి వదలిపెట్టాలి

హిందూ వారసత్వపు శాసనంలో ఎక్కువ అన్యాయానికి పాలుపడుతున్నది వితంతువే నని చెప్పాలి. పూర్వం వితంతువులు మళ్ళీ వివాహం చేసుకోవటానికీ, సమిష్టికుటుంబంనుంచి వేరుపడటానికీ అవకాశముండేది కాదు. వంశాన్ని నిలబెట్టుకోటానికి వారసులని మరోవిధంగా పొందవచ్చుననే నియమం ఫలితంగా తాను వారసురాలు కాలేకపోయినా, సమిష్టి కుటుంబంలోనే జీవితం వెళ్ళబుచ్చేది. ఆ ఆచారంలోని అన్యాయాన్నీ దుర్నీతినీ నిర్మూలించిన గౌరవం విదేశీయులకిగూడా దక్కింది. క్రమంగా వితంతువు న్యాయశాస్త్రజ్ఞులకి ఒక సమస్యగా తయారయింది.

తదుపరి భర్త ఆస్తిని జీవిత కాలం అనుభవించే హక్కు కలిగింది. కానీ ఆచరణలో వితంతువులకి ఈ సవరణవల్ల ఫలితం కనుపించలేదు. బాల్య వివాహాలవల్ల బాల వితంతువులు అసంఖ్యాకంగా పెరిగిన ఆరోజుల్లో ఆ ఆస్తిపైన మామగారో లేక భర్తతరపు చుట్టాలో ఆధ్వర్యం వహించేవారు చట్టరీత్యా ఆస్తి సంక్రమించినా ఆచరణలో ఆర్థికస్వాతంత్ర్యం పొందలేక పోయేవారు. 1937 వ సం॥ తరువాత ఆవితంతువు కుమారుడికి భాగం రావటం జరిగింది. నూతన వారసత్వపు బిల్లు చెయ్యబోతున్న మరో ముఖ్యమైనమార్పు స్త్రీలకు ఆస్తిసర్వహక్కులతో సంక్రమించటం. కానీ వితంతువుకి భర్త స్వార్జితపు ఆస్తిమీద సర్వహక్కులూ ఇచ్చినప్పటికీ కుటుంబఆస్తిమీద సంపూర్ణ హక్కులు లభించవు.

మన రాజ్యాంగంలోని 31 వ సూత్రం ప్రకారం ఏ వ్యక్తియొక్క ఆస్తినీ, ఎవరూ చేజిక్కించుకోవటానికిగానీ, ఏ ఒక్కరి హక్కు భంగపరచటానికిగానీ వీలులేదు. న్యాయస్థానం అడ్డు పడితేగాని ఏ వ్యక్తియొక్క ఆస్తిలోగానీ జోక్యం కలిగించుకోవటం సంభవించదు. స్త్రీపురుషుల నేతారతమ్యంలేకుండా రాజ్యాంగంలో అందరికీ ఇవ్వబడినహక్కు యిది ఇదిసూత్రప్రాయంగానే వుండిపోయిందిగాని ఆచరణలో స్త్రీలు తమ ఆస్తిమీద సంపూర్ణమైన హక్కులు అనుభవించలేకుండావున్నారు. దీనికి కారణం మన రాజ్యాంగంలోగానీ న్యాయశాస్త్రంలోగానీ లోపంవల్ల కాదు; నేటికిగూడా మన సమాజంలో స్త్రీకి వున్న కొన్ని పరిమితులు మాత్రమే.

★ స్త్రీల ఆస్తి హక్కులు ★

ప్రస్తుతం మన పార్లమెంటులో ప్రవేశపెట్ట బడుతున్న బిల్లు స్త్రీలకు పూర్తిగా అన్యాయం చెయ్యటం లేదు. అయినా మంచి కన్నా హానే పేఎక్కువ చేస్తుందేమో! తండ్రి ఆస్తిలో అర్ధవాటా రాబోతోందని మురిసిపో నవసరములేదు! తల్లి ఆస్తిలో సగం వాటా పోతుందనే విషయం జ్ఞాపకముంచుకుంటే బాగుంటుంది! మనసమాజంలో తల్లులకంటె తండ్రులకే ఎక్కువ ఆస్తి వుంటుంది. గనుక స్త్రీలకు లాభదాయకమని అనుకోనవసరము లేదు. సమష్టి కుటుంబ ఆస్తిలోగూడా కుమార్తెకు భాగం వుండాలనే అంశం స్త్రీలు కోరదగినది. అంతే కాదు తల్లిఆస్తిలో కుమారుడి కెంతభాగం పోతుందో, తండ్రి ఆస్తిలో అంతే భాగం కోరవచ్చు. తల్లి ఆస్తిలో కుమారుడికి సగం భాగం యిచ్చి, తండ్రిఆస్తిలో కొద్దిభాగాన్నివ్వడం స్త్రీలకు ఏవిధంగానూ న్యాయం చెకూర్చడం లేదు. ★

వనితాలోకం సీరియల్



19

బయట యజమాని గదిలో ఆఫీసు మర్యాదలెలా పాటించబడతాయో, అలాగే అంతఃపురంలోని రాణీగారి గదిలో కూడా అలాంటి మర్యాదలే పాటించబడుతూ ఉంటాయి. అంతఃపుర పరిచారికలు అనవసరమైన ఉల్లాసాన్ని ప్రదర్శించటం, సుష్క ప్రియాలు మాట్లాడటం మొదలైనవాటిని రాణీ సాగనివ్వదు.

దాదాపు ముప్ఫై అడుగుల పొడుగున్న గది అది. ఆ గదిలో ఒకవైపున సోఫాలు, పడక కుర్చీలూ, పగిషీ కోళ్ల పందిరి మంచమూ అన్నీ పొందికగా అమర్చి ఉన్నాయి. రెండోవైపు ఇంచుమించు ఖాళీగానే ఉంది. క్రింద తివాసీలు మాత్రం పరిచి ఉన్నాయి. ఆచోటు అలా ఖాళీగా ఉంచటానికి కారణం యజమాని తరచుగా అక్కడకువచ్చి పచార్లు చేస్తూ ఉంటాడు. ఏదైనా జటిలమైన సమస్య వచ్చినప్పుడు, జమీందారు ఇక్కడకు వచ్చి చేతులు వెనక్కి కట్టుకుని, అటూ యిటూ పచార్లుచేస్తూ గంటలకి గంటలు గడుపుతూ ఉంటాడు. అది అతడికి బాగా అలవాటు.

కాని ఇవాళ మాత్రం ఆయన ఏదో చిరాకుగానే ఇక్కడకు వచ్చి పచార్లు చెయ్యసాగాడు. అడుగడుగుకు ఆయన ముఖం చిట్లిస్తూనే ఉన్నాడు ఆ ప్రశాంత ముఖంలో విచార రేఖలు విస్పష్టంగా కన్పిస్తున్నాయి. ఆయన ఈ గదిలో ఇలా తిరగటం క్రొత్తేమీ కాదు; కాని ఆ ముఖ కవళికలూ అవి మాత్రం క్రొత్తే.

వరాండావైపు గుమ్మానికిఉన్న పరదా తప్పించుకుని మాధురీదేవి గంభీరంగా గదిలో ప్రవేశించింది. హరినారాయణ బాబుకూడా సరీగ్గా ఆ సమయానికి గుమ్మంవైపే చూస్తూ ఉన్నాడు. చటుక్కున ఉభయుల కళ్లూ కలుసుకోగానే ఉభయుల మనోభావాలు ఒకరి కొకరికి తెలిసిపోయాయి.

జమీందారు తన మనోభావాల్ని నిగ్రహించుకోటానికి ప్రయత్నిస్తూ "ఇంత ఆలస్యం చేశావేం? నీకు కబురుపంపి గంటపైగా అయింది" అన్నాడు.

"నాకు కబురు సరియైన సమయానికే చేరింది. కాని బుద్ధిపూర్వకంగానే ఆలస్యంగా వచ్చాను."

హరినారాయణబాబు కనుబొమలు చిట్లించి రాణీ ముఖంకేసి చూశాడు. అతడికి తెలియకుండానే అతడి కంఠస్వరం కటువుగా మారింది. "అలాగా!" అన్నాడు.

రాణీ తన ఆలస్యానికి గల కారణాన్ని స్పష్టంగా చెప్పింది. "కోడలి గదిలో మూడు గంటలు వాదోపవాదాలు జరిగాక - ఏకాంతంగా ఒక గంటసేపు విశ్రాంతి తీసుకోవటం అవసరం."

ఆ మాట యజమాని చెవులకు సరసంగా వినపడలేదు. ఏదో రుసరుసలాడుతూ అన్నట్లే విన్పించింది ఆయనకూడా తీక్ష్ణంగా "అప్పుడే ఈ సంగతి ఎలా తెలిసింది?" అని అడిగాడు.

"మీరు ఏమనుకుని ఈ ప్రశ్న అడుగుతున్నారో - కాని అది పొరపాటు. గుమ్మందగ్గర పహరా ఉంచి వెళ్ళిన సంగతి మాకు తెలుసు. మీ మాటను కాదని త్రోసి పుచ్చటానికి ఈ ఇంట్లో ఎవ్వరికీ ధైర్యం చాలదు"

"అయితే మరి నీకాసంగతి ఎలా తెలిసిందో చెప్పు?" అని అడిగాడు గట్టిగా.

రాణీ కొంచెం వెటకారంగా "నేను ఈ యింటికి రాణీని. అన్ని సంగతులూ తెలుసుకుంటూ ఉండాలి నేను. మనుష్యులెవరూ వచ్చి చెప్పకపోయినా, గాలి అయినా వచ్చి నా చెవిలో అన్ని సంగతులూ ఊదిపోతుంది" అన్నది.

జమీందారు ఉజ్జ్వల దృష్టితో రాణి ముఖంకేసి చూసి, "సరే, బాగుంది. ఈ మాట మాత్రం మరిపించకు. ఈ మాట మీద వచ్చే మాటలు చాలా ఉన్నాయి. ఇక్కడింకా ఎన్ని గంటలు గడపాలో ఏం చెప్పగలను?" అన్నాడు.

ఇలా మాట్లాడుతూనే జమీందారు ఒక సోఫాను సమీపించి, "ఎంతసేపని అలా నుంచుంటావ్? కూచో" అన్నాడు.

"నేను కూర్చోటం యెందుకులెండి. అవసరం లేదు. కూర్చున్నట్లే. మీరే కూర్చోవాలి. గంటసేపటినుంచి అటు తిరిగి ఇటు తిరిగి బాగా అలిసిపోయినట్లు కన్పిస్తున్నారు"

హరినారాయణబాబు నెమ్మదిగా ఆ మెత్తని సోఫాలో చేరగిలపడి కూర్చుని, "ఈ గంటసేపటనుంచీ నేను విశ్రాంతి తీసుకోవటం లేదన్న సంగతి ఒప్పుకుంటావా? చెప్పు?" అన్నాడు.

రాణి ముఖం గంభీరంగా పెట్టి. "వీపు మీద కొరడా దెబ్బలు పడితే, స్థిరంగా ఎవరూ విశ్రాంతి పొందలేరు - శరీరం చిమచిమలాడుతూంటుంది. కనుక ఊరికే అటూ యిటూ తిరుగుతూ ఉంటారు అని ఒప్పుకోకుండా ఉండలేను" అన్నది.

హరినారాయణబాబు ఒక నిట్టూర్పు

మూలం : మణిలాల్ వంద్యోపాధ్యాయ   అనువాదం : మద్దిపట్ల సూరి

స్వయంసిద్ధ

విడిచి, "ఆమాట అనటంలో అర్థం?" అని ప్రశ్నించాడు.

"అందులో అర్థమేమిటో మీకు వ్యక్తమయినట్లు – మీరు నిట్టూర్పు విడిచి ప్రశ్నించటంలోనే తెలుస్తోంది. మరింత స్పష్టంగా తెలుసుకోవటంవల్ల మరింత వళ్లు మండటం తప్ప ఏంలేదు."

జమీందారు రాణీకేసి సందిగ్ధంగా చూస్తూ "కోడలిగదికి నేను వెళ్లిన సంగతి తెలిసి ఉండవచ్చు. అక్కడ చాలాసేపు ఉన్నాన్న సంగతికూడా అందరికీ తెలిసి ఉండొచ్చు. కాని మా యిద్దరిమధ్య ఏం సంభాషణ జరిగిందీ మాత్రం ఘుణాక్షర న్యాయంగానైనా ఒక్క అక్షరంకూడా ఎవరూ వినిఉంటారని తోచదు నాకు. మరి కోడలిమాటలవల్ల నా ఒళ్ళు మండిపోయి ఇక్కడికి పరుగెత్తుకొచ్చానని ఎలా అనుకోగలిగావు?" అని అడిగాడు.

భర్త చివరిమాటల్లో కొంచెం తీవ్రత వ్యక్తమవటం గమనించి, రాణి ఒక్క క్షణం అతడి ముఖంకేసి తీక్ష్ణంగా చూసి, "కోడలితో మాట్లాడటానికి వెళ్ళేటప్పుడు మాత్రం అష్టదిగ్బంధనం చేసుకునే వెళ్లారు. కాని తిరిగి వచ్చేటప్పుడు మాత్రం ముఖాన్ని, కళ్లనీ, కంఠస్వరాన్నీ కప్పిపెట్టుకు రాలేకపోయారు. వాటినిబట్టే మీరక్కడినుంచి ఏదో కోపంతో తిరిగివచ్చినట్లు స్పష్టంగా తెలిసిపోయింది" అనేసింది.

ఆ మాటలు హరినారాయణ బాబును బాగా ఆఘాతపరిచాయి. అతడు మళ్ళీ ఆమెను ఆఘాతపరచటానికి వెనుతీయలేదు. "కామెర్ల రోగికి ప్రపంచమంతా పచ్చగానే కన్పిస్తుందట. ఎవరి శరీరానికి విషకలిగిందీ తెలుస్తూనే ఉంది. కాని ఇదంతా అనవసరం. దానివల్ల లాభం ఏమీలేదు"

రాణి వ్యంగ్యంగా నవ్వుతూ "కాని నిష్ఫలమైన గర్జనలు మాత్రం మానలేదు" అన్నది.

జమీందారు ముఖం చటుక్కున గంభీరంగా మారింది. రాణి సమాన ధాయాలో సమాధానం చెప్పటంలో ఏమాత్రం వెనుతీయదని అతడు మనస్సులో గ్రహించాడు. అంచేత రాణికి దిగే ధోరణిలోకి వచ్చి – మెత్తని కంఠస్వరంతో "అనుమానంమీద ఆధారపడి ఏ విషయంలోనూ ఒక నిర్ణయానికి రాకూడదు. అలా రావటంవల్ల మోసపోయేందుకవకాశాలున్నాయి" అన్నాడు.

రాణి ఆ మాటను సమర్థించకుండా ప్రతివాదం లేవతీస్తున్న ధోరణిలో "కాని ఇంతవరకు వచ్చిన నిర్ణయాలన్నీ అనుమానాన్ని ఆధారంగా చేసుకువచ్చినవే" అన్నది.

జమీందారు ఆశ్చర్యంతో "అలాగా! దానికి దృష్టాంతాలుకూడా ఉన్నాయన్నమాట?" అన్నాడు.

"చాలా ఉన్నాయి. మొదటి దృష్టాంతం నేను."

"నువ్వా?"

"ఆఁ. కేవలం వంశం నిలిస్తే చాలుననే ఉద్దేశంతో మీరు రాచకన్యను తీసుకురాలేదన్న సంగతి మీకూ తెలుసు, నాకూ తెలుసు. దీనికి వెనుక ఓ పెద్ద అంచనా మాత్రం ఉంది."

"అలాగా?"

"ఒక్క రాత్రిలో రెండు పిట్టల్ని కొట్టవచ్చుననే అంచనా వేసుకుని మీరు ఉప్పొంగిపోయారు."

"ఏమిటది?"

"ఇంకా వివరంగా చెపుతాను. మేవాడ్ రాణా రాజసింహునిలాగా కీర్తిని ఆర్జించాలని మీ ఆశ: మానాన్న ప్రభుత్వానికి చాలా సన్నిహితుడని విని, అలాంటి సన్నిహితత్వానికేం విలువలేదని చెప్పారు ఆయనతో."

కుతూహలంకొద్దీ హరినారాయణబాబు రాణి మొహంకేసి చూస్తూ ఊరుకున్నాడు. తర్వాత కొంచెం నవ్వుతూ – "ఇన్నాళ్లకు నువ్వింత గొప్ప తాత్వికాంశాన్ని కనిపెట్టావన్నమాట: కాని ఇంతకుముందెప్పుడూ – నువ్వీ విషయమై నాతో అననేలేదు" అన్నాడు.

"చెప్పవలసిన అవసరమనేది ఇదివరకెప్పుడూ రాలేదు. ఏదో మాటమీద మాట రావటంవల్ల – కేవలం అనుమానంమీద ఆధారపడే మీరు గురుతరకార్యాన్ని పైన వేసుకున్నారని, చెప్పక తప్పలేదు నాకు. ఒక దృష్టాంతాన్ని చూపాను మీకు. ఇంక చాలా ఉన్నాయి దృష్టాంతాలు"

"ఆగు. ఇంక వినవలసిన పనిలేదు. వృథాప్రసంగంతో మనం అసలు విషయాన్ని విడిచి చాలాదూరం వచ్చాము. నిన్ను అసలు ఎందుకోసం పిలిపించానో ఆ విషయమై ఇంతవరకు యేమీ మాట్లాడనేలేదు. సరే కాని నువ్వు కూర్చోవా?"

"ఉహూఁ. కూర్చుంటే మీతో సంభాషణ తెగటమంటూ ఉండదు. మీరు ఆ మహల్ లో దెబ్బతిని, ఆ అక్కస్సంతా నామీద తీర్చుకోటానికి వచ్చారని నేను ముందే గ్రహించాను."

"తప్పించి మళ్ళించి మళ్ళీ ఆ మాటే అంటున్నావు!"

"ఇది తప్ప కొత్తగా నేను చెప్పవలసిన సంగతంటూ నిజానికేదైనా ఉందా!— ఏమో! నాకేం ఉన్నట్టు తోచటంలేదు."

"అసలు నీ మనస్సులో ఉద్దేశమేమిటో చెప్పవిందాం."

"ఈ ఇంటికి వచ్చినప్పట్నుంచీ పని విషయమై ఎవరికీ ఎన్నడూ సంజాయిషీ చెప్పకోవాల్సిన అవసరం రాలేదు నాకు. సంజాయిషీ చెప్పకోటానికి రావలసిందనే పిలుపూ రాలేదు. ఆ సంజాయిషీ ఇన్నాళ్ళకు ఇవాళ ఇచ్చుకోవాల్సి వచ్చిందనుకుంటా. నా ఊహ నిరాధారమంటారా?"

"ఆశ్చర్యంగానే ఉంది! ఎవరిని మెచ్చుకోవాలో బోధపడకుండా ఉంది నాకు. కోడలు కూడా నేను ఆసమయంలో తన మహల్‌కి రావటం మాని తన విచారణకై వచ్చాననుకుంది నా పిలుపు రాగానే నువ్వూ సంజాయిషీ కోరటానికే పిలిపించానని అనుకున్నావు" అన్నాడు ఆవేగంతో...

రాణి భర్త భావావేగాన్ని లక్ష్యపెట్టకుండానే— "నేను సిద్ధంగా తయారైయే వచ్చాను. మీరు అడగతలచిన సంగతులేవేవి ఉన్నాయో, వాటిని అడగటం ప్రారంభించవచ్చు. నేను ఏమాత్రం నిర్లక్ష్యం చూపను" అన్నది.

జమీందారు కూడా కృత్రిమమైన సానుభూతిని వెల్లడిస్తూ "నువ్వింత గట్టిగా చెపుతున్నావు కనుక – నేనయినా నీ విషయంలో ఉపేక్షాభావాన్ని కనపరచటం ఉచితంకాదు. సరే మంచిదే. నువ్వు ముందుగానే నొక్కి నొక్కి చెప్పావే – ఈ మహల్‌కి నువ్వు రాణివి కనుక అన్ని విషయాలూ తెలుసుకోవాల్సి ఉంటుందని, గాలి వచ్చి కబుర్లన్నీ నీ చెవిలో ఊది పోతుందనీ – ఈ మాటలు నువ్వు సరిగ్గా చెప్పినట్లేగా?" అని అడిగాడు.

రాణి ఓరచూపుతో ఒక్కసారి భర్త ముఖంకేసి చూసింది. మరుక్షణంలోనే దృష్టి మరలించుకుని, "ఈ మాటలన్నీ తీసుకురావలసిన అవసరంలేదు. నా నోటి మీదుగా వచ్చిన మాటలను ఒప్పుకోకుండా ఉండటమనే అలవాటు నాకు లేదు" అన్నది.

"ఆ సంగతి నాకూ తెలుసు. ఇందుక

(30-వ పేజీ చూడండి)



కైరవము



—ఫొటో: బి. రబీంద్రనాథ్—గుంటూరు.

★ స్వయంసిద్ధ ★

నేను నిన్నెన్నిసార్లు మెచ్చుకున్నానో అది నీకూ తెలుసు. అయినా ఈ సందర్భంలో ఈ మాటలన్నీ మళ్ళీ తీసుకు రావటం - చాలావరకు సంప్రదాయం లాంటిది - కోర్టులో ఎంత సత్యవాదిచేత నయినా న్యాయాధికారి ముందుగా శపథం చేయిస్తాడే - అలాంటి దన్నమాట! ఆఁ. ఇహ అసలు సంగతికి వద్దాం. నిజంగా, కొన్ని సంగతులు అడిగి తెలుసుకోందే నాకు ఊపిరి సలపని పరిస్థితులు వచ్చిపడ్డాయి ఎటుచూసినా..."

ఆమాట పూర్తికాగానే జమీందారు రాణిముఖంకేసి తీక్ష్ణంగా చూశాడు. కాని రాణి దగ్గరనుంచి జవాబు మాత్రం ఏమీ రాలేదు.

"నేను రాజసింహునిలాగా కీర్తికాముకుడనై నిన్ను వివాహమాడానని ఇంతవరకుంటే అన్నావు. మరోక అపవాదుకూడా వేశావు. సరే ఆ సంగతి అలా ఉంచు. మొదటి విషయాన్ని గురించి చెపుతాను. నేను చేసినపని అన్యాయం కాదని పరిస్థితులు క్షుణ్ణంగా తెలిసినవా రెవరైనా అంటారు. పైగా ఇది చెయ్యటానికి అంగీకరించిన త్యాగంకూడా తక్కువదికాదు. కాని ప్రస్తుతం విచారణీయాంశం మాత్రం ఇదే. నేను నిన్ను అలక్ష్యం చేశానా అని!"

"నేను ఈ ఆరోపణ ఎన్నడూ చెయ్యలేదు. పైగా వివాహమయింతర్వాత. మీరు నా విషయంలో చూపిన ఆదరణ సామాన్యమైందికాదని ముక్తకంఠంతో చెప్పగలను నేను. మీ కుటుంబానికి సర్వాధికారిణిని చేశారు నన్ను. ఆ అధికారాన్ని పొంద కలిగాను నేను. ఆ కారణంవల్లనే ఈ సంసారంలో అందరిమీదా ఇంతవరకు అధికారం చలాయిస్తూ వచ్చాను. దాన్ని గురించి మీ రొక్కనాడైనా ప్రతివాదం లేవనెత్తలేదు - ఎలాంటి అభ్యంతరాన్ని కలిగించలేదు."

రాణిమాటల ద్వారానే తాను చెప్ప తలచుకున్న విషయానికి 'లింక్' దొరికేసరికి హరినారాయణబాబు ముఖం ఒక్కక్షణం ఆనందంతో కలకలలాడింది. ఆయన ఉత్సాహంతో "భేష్! సంతోషంతో నువ్వు పొందిన అధికార విషయ ప్రసక్తి తీసుకువచ్చావు సరేకాని, ఆ అధికారాన్ని అందరిమీదా సమానంగానే చూపుతూ వచ్చావా?-ఆ మాట గట్టిగా చెప్పగలవా?" అని అడిగాడు.

అప్రత్యాశితంగా భర్త వేసిన ఈ కఠిన ప్రశ్న రాణిని ఒక్కక్షణం స్తబ్ధురాలినిగా చేసింది. కాని మరుక్షణంలోనే ఆమె ఈ అఘాతాన్ని లక్ష్యపెట్టకుండా దృఢకంఠంతో -"ఈ మాటకు సమాధానం చెప్పటానికి ముందు నేనొక సంగతి తెలుసుకోవాలి. మీరా అధికారాన్ని నాకు యిచ్చేటప్పుడు - దాన్ని ఫలానా విధంగా ఉపయోగించాలి అని నాకేమయినా నిర్దేశించి చెప్పారా?" అని అడిగింది.

"అలా ఎవరూ నిర్దేశిస్తూ ఇవ్వరు అధికారాన్ని."

"ఇస్తారు. నే విన్నదేమిటంటే ఆంగ్లేయులు తమ అధికారులను ఈ దేశానికి పంపేటప్పుడు - వారు వినియోగించవలసిన అధికారాన్ని గురించి హెచ్చరించి పంపటంలో ఏమాత్రం ఏమరుపాటు చూపరట: అలాగే మీ జమీందారీలో ఏ ఆఫీసులోనైనా కొత్త అధికారిని నియమించేటప్పుడు అతడి అధికార పరిమితి ఎంతవరకో ఏమీ నిర్దేశించి చెప్పకపోతే పరిపాలన సాగేదెలా?"

"ఒప్పుకుంటాను. నీకలాంటి నిర్దేశాలేవీ చెయ్యలేదు. నువ్వు సహధర్మిణివి, గృహిణివి కనుక నీ అధికార పరిమితిని నిర్దేశించి చెప్పటం నిష్ప్రయోజన మనుకున్నాను అందులో నీ కర్తవ్యం ఎంతయినా ఉంది."

"కచ్చితంగా ఉంది. నేను మొదటి నుంచీ కర్తవ్యాన్ని ఉపేక్ష చేసినట్లయితే పెద్ద గొడవ మొదట్లోనే బయలుదేరేది. ఇన్ని సంవత్సరాలు నిరుద్వేగంగా గడిపిన పిమ్మట హఠాత్తుగా ఇప్పుడు సంజాయిషీ చెప్పటం కోసమని పిలువరాదు."

"అయితే నీ అధికారాన్ని సంసారంలో అందరిమీదా సమానంగా వినియోగించటానికి వెనుదీయలేదని చెప్పటానికెందుకు సంకోచిస్తావ్?..."

అనవసరంగా అబద్ధం చెప్పటంవల్ల లాభమేమీ లేదు. అన్ని సందర్భాల్లో అలా సూచినట్లు వినియోగించటం జరగదు. బ్రహ్మ సృష్టిలోనే అంతులేనన్ని తారతమ్యాలున్నాయి. మానవులందరూ ఒక్కరకంగా ఉండరు. ముఖాల్లో ఎంతో తారతమ్యం కన్పిస్తుంది. చేతి అయిదువేళ్ళు సమానంగా ఉండవు. అటువంటప్పుడు అందరిమీదా నా అధికారాన్ని హెచ్చుతగ్గులు లేకుండా సమానంగానే చూపానని యెలా చెప్పగలను?"

"అయితే నీ అధికారాన్ని నువ్వు దుర్వినియోగం చేశావని, మాటకారితనం చేతనయినవాళ్లు నిన్ను మధ్యపెట్టి వాళ్ళ ప్రయోజనాలను వాళ్లు సాధించుకుంటున్నారని, నోరులేని అమాయకులు నిన్ను ప్రసన్నురాలినిగా చేసుకోటం చేతకాక నానాయాతనలూ పడుతూ నలిగిపోతున్నారని నేను ఒకవేళ అంటే—?"

చాలా పెద్ద అభియోగం. రాణి ఈసారి

కెవ్వున కేకేసి విదీర్ణహృదయయై పడిపో తుందనుకున్నాడు జమీందారు. కాని ఆమె ధైర్యం యేమాత్రం సడలలేదు ఆమె కంఠస్వరంలో తీవ్రతా వ్యక్తం కాలేదు. భర్త బయటపెట్టుకున్న అభిప్రాయానికి మామూలు ధోరణిలో నే జవాబిచ్చిందామె. "ప్రపంచంలో అనాదినుంచీ ఇలా జరుగు తూనే వస్తోంది—నోరు కలవాళ్లు విజయం పొందటం, నోరులేనివాళ్లు మోసపోవడం... చరిత్రలో దీనికి చాలా దృష్టాంతా లున్నాయి."

యజమాని విస్మయసూచకమైన కంఠ స్వరంతో "నువ్వు ఏ వేవో పెద్దపెద్ద సంగ తులు తీసుకొచ్చి నన్ను తికమక పెట్టాలని చూస్తున్నావల్లే ఉందే!" అన్నాడు.

★ స్వయంసిద్ధ ★

రాణి మృదువుగా నవ్వి—"బరువైన పదార్థం వచ్చి దభీమని నీళ్ళలో పడితే నీళ్లు కెలుకుడు కాకమానవు నా స్తవాన్ని కెందపరిచి నేను మీ మనస్సును కలత పెట్ట తలచుకోలేదు. మనస్సులోని విషయాన్ని ధైర్యంచేసి విడమర్చి చెప్పాను" అన్నది.

యజమాని కనుబొమలు చిట్లించి, "అయితే ఈ యింట్లో నీకు అనుకూలంగా ఉండని వారినందర్నీ ఒక మూల నొక్కిపెడుతున్నా వన్నమాట!" అని అడిగాడు.

"నా పరిస్థితుల్లో ఉన్న ఏ స్త్రీ యైనా సరే - ఆమాత్రమైనా చెయ్యకపోతే నెగులు రాలేదు. నేను ఈ యింట్లో అడుగుపెట్టిన నాడే గ్రహించాను. ఇంట్లో అందరూ అస్తమానమూ చనిపోయిన రాణీగార్ని గురించే చెప్పుకుంటూ ఉండేవాళ్లు. ఆమెతో పోల్చిచూస్తే నేనెంత తక్కువదాన్నో సప్రమాణంగా రుజావు చెయ్యటానికి ప్రయత్నించేవాళ్లు. అంచేత స్వర్గస్థురాలైన నా సవతి స్మృతిని తుడిచిపెట్టటం, ఆమెకంటె నేను అన్నివిధాల గొప్పదాన్నని నిరూపించుకోవటం ప్రథమ కర్తవ్యమయింది నాకు. నేను ఈ ఇంటికి యజమానురాలిని అయిఉండి, నా చేతిలో ఇంత అధికారం ఉన్నప్పుడు - నన్ను నేను నిలవ్రదొక్కుకునే సదవకాశాన్ని ఎందుకు వ్యర్థపరచుకుంటాను." అని రాణి కుండ బ్రద్దలుకొట్టినట్టు చెప్పింది.

జమీందారు తనకు తెలియకుండానే చటుక్కున త్రుళ్ళిపడ్డాడు. వివాహమయి ఇన్నాళ్ళయింది. కాని సహధర్మిణితో ఇలా ఎప్పుడూ సంభాషణ జరగలేదు. రాణి తన మనస్సులోని ఉద్దేశ్యాల్ని ఇంత స్పష్టంగా యెప్పుడూ చెప్పలేగు. అతడు కొంచెం సేపు రాణికేసి కన్నార్పకుండా చూసి, తర్వాత దీర్ఘంగా నిట్టూర్చి,

"ఊం. సరే. ఈసారి నేను ఓ కఠినమైన ప్రశ్నే వెయ్యతలచుకున్నాను. నువ్వు గోవిందుడి విషయంలో ఈ అధికారాన్ని చలాయిస్తూనే వచ్చావా? సవతి - స్మృతిని చెరిపెయ్యటానికి ప్రయత్నించటంలో నువ్వేమీ సంకోచించనప్పుడు - మరి ఆ సవతిబిడ్డను—"

అంతవరకు ఆనేసరికి భావావేగంతో అతడి కంఠం రుద్ధమైంది. కళ్లు రెండూ పెద్దవిచేసుకుని రాణి ముఖంకేసి స్థిరంగా చూస్తూ ఊరుకున్నాడు. చెమ్మగిలిన నేత్రాలే అతడి అసమాప్త వాక్యాన్ని వ్యక్తం చేస్తున్నట్లున్నాయి.

రాణి అవిచలితకంఠంతో "గోవిందుడి విషయం అడుగుతున్నారా? ఈ ప్రశ్న వెయ్యటంలో ఏమిటి మీ ఉద్దేశం? అతణ్ని ఆదరణగా చూస్తూ పెంచి పెద్దవాణ్ణి చెయ్యటం సంగతేనా మరింకో ఏదయినానా?" అని అడిగింది.

హరినారాయణబాబు అభిభూతుడిలాగా — "నేను అడగతలచిన మాట ఏదో మరిచిపోయాను. కాని అదేదో నేను చెప్పకపోయినా నీకు తెలిసింది. వాడి విషయంలో, నీకు తెలిసింది, నువ్వు చెప్పతలచిందీ - అంతా చెప్పు" అన్నాడు

"ఎంత విశ్వాసంతో సంసారభారాన్ని మీరు నాకప్పగించారో, అంత విశ్వాసంతో అతడి భారాన్ని మీరు నాకప్పగించలేదు పైగా ఆ విషయంలో నన్ను తప్పించి ఆ భారాన్ని చనిపోయిన రాణీగారి పరిచారికల మీదనే పెట్టారు."

"అవును. ఆమాట కాదనటంలేదు నేను. సవితిబిడ్డ పోరుతో నువ్వెక్కడ వేజారై పోతావో అని నిన్ను ఆ బెడదలో యిరికించలేదు."

"కేవలం అదేనా? సవతితల్లి చేతిలో పడితే బిడ్డకేం అయిష్టం వాటిలుతుందో ననే భయంతోనే నన్ను ఉపేక్షించారనుకుంటాను నేను. అదీ భగవంతుని ఆశీస్సుగానే భావించాను నేను. ఎంచేతంటే - అతడి భారం నాకే అప్పగించినట్లయితే - నేను ప్రసన్న హృదయంతో అతణ్ణి చూసినట్లైతే అతగాడీనాడిలా జడభరతుడిలా తయారయేవాడు కాడు."

"కాని ఏమయినా వాణ్ణి నువ్వు కొంచెం దయగా చూడటం ఉచితం కాదూ?"

"కాదు. మొదట్లో నేను అభిమానపడి అతడికేసి చూడలేదు. తర్వాత నివారణుడు పుట్టాక కేవలం ఇహ వాణ్ణి చూడటమే సరిపోయింది నాకు. గోవిందుడు పెద్దవాడయాక, అతడికి తెలివితేటలు శూన్యమని, చదువు సంధ్యలు అబ్బలేదని అందరూ చెప్పుకునేవాళ్లు. పైగా వాళ్ళే నివారణుణ్ని మెచ్చుకోవటం చూసినప్పుడు నా అంత సంతోషించినవాళ్లెవరూ ఉండరు బహుశా."

"నువ్వు అదివిని సంతోషించావా?" అని గర్జించాడు హరినారాయణబాబు

రాణి మృదువుగా ఇలా అన్నది - "నేను చాలా ఇదవుతున్నాను. ఈ మాటను ఇలా కాకుండా కల్పించి అబద్ధం చెప్పినట్లయితే మీరు బహుశా సంతోషించేవారనుకుంటాను కాని నేను నిష్కపటంగా యథార్థాన్నే చెప్పాను. ఎందుకు సంతోషించను? నేనూ మనిషినే. బాగా చదువుకుని విజ్ఞానవతిని అయినానని కాదు. నాదీ రక్తమాంసాలున్న శరీరమే స్వార్థం అనేది నాకూ ఉంటుంది. సవతిబిడ్డ అప్రయోజకుడవటంవల్ల - నాబిడ్డ అదృష్టం పండబోతూంటే, బాసలీ గద్దెమీద కూచునే యోగ్యత ప్రాప్తిస్తూంటే - తల్లికి అంతకన్న ఆనందకరమైన విషయం ఏముంటుంది? కాని ఈ విషయం మాత్రం ఒప్పుకుంటాను. కథల్లోనూ, నవలల్లోనూ ఉండే సవతి తల్లుల్లాగా నేను ఈ కంటకాన్ని మొదట్లోనే నిర్మూలం చెయ్యటానికి మాత్రం యేమీ ప్రయత్నించలేదు. అతడు మొద్దులా పడిఉంటే చాలు, అదే నాకు కావలసింది. దీన్ని మీరు స్వార్థపరత్వం అనండి. మరేమయినా అనండి. దీన్నిగురించి మీరు నామీద ఎలాంటి అపవాదు నయినా వెయ్యండి—మీ రెన్నయినా

అనండి - సంతానం విషయంలో తల్లిగా నేను నాకర్తవ్యాన్ని నిర్వర్తించానని కచ్చితంగా చెప్పగలను."

"నువ్వు ఇలా అన్యాయంగా ఎవరినయితే వంచించావో వాడుమాత్రం నీ సంతానం కాదూ?"

"కాదు. ఏదో పుస్తకాల్లో రాసినట్లు - ప్రపంచమంతా నా బిడ్డలే అని అనుకోవటం ఎలాంటిదో ఇదీ అంతే. పైకి అలాంటి సూక్తులు వినటానికి బాగానే ఉంటాయి. కాని స్వార్థదృష్టితో చూసినప్పుడు బాధకరంగా కన్పిస్తాయి. సంతానంమీది మమత్వంతో ఇవాళ మీరు దీన్నొక సమస్యగా చూస్తున్నారు. కాని నేను అతడికి సవితి తల్లి నన్న మాట ఒప్పుకోవాలి ముందు. అసలీ అడ్డుగోడ కట్టిం దెవరు? మీరూ నిర్వికారంగా, ఈ ప్రయత్నం తల పెట్టకుండానే ఉన్నారుగా అప్పుడు. తర్వాత నివారణుడికి మీఅంతట మీరే ప్రాధాన్యం ఇస్తూవచ్చారు మీ గద్దె మీద కూర్చోబోయేవాడు - వాడే నని మీరే ఎన్నోసార్లు చెప్పారు-కాని—"

"ఆగావు యెందుకు? చెప్పు నువ్వు చెప్పతలచిం దింకా పూర్తికాలేదు—"

"మీ ఆ ఉద్దేశ్యం ఇప్పుడు మారిపోయింది మీరు ఆ ఆయుర్వేద వైద్యుడి కూతుర్ని చూసి, ఆమెని ఈ యింటికి కోడల్నిగా తీసుకురావాలని మహా ఆరాటపడ్డారు. ఆ పేదపిల్లను కోడల్నిగా తెచ్చుకోటానికి నేను అంగీకరించలేదు అప్పుడు మీ యీ రోషమంతా అణిగిపడి ఉంది ఇప్పుడు ఇంతకాలానికి గోవిందుడికోఃమని మీ హృదయం థరథరలాడుతోంది ఆ..ఇహ నిప్పుడు నివారణుడే మీ రనుకున్నట్లు వెనకపడతాడు. మీ కోడలే ఆ గాడిదను - మిమ్మల్నీ కూడా ఉద్ధరిస్తుందని కలలు కంటున్నారు మీరు కలకాలం ఆ కల్లోనే ఉండండి. ఇహ నేను ఇచ్చే సంజాయిషీగో — నా దోషం ఏదైనా ఉన్నట్లయితే - శిక్షించటానికి నిరభ్యంతరంగా మీరు పూనుకోవచ్చు నేను ఆ శిక్ష అనుభవించటానికి సిద్ధపడే ఉన్నాను!"

రాణి ఉత్తేజితురాలు కావటం చూసి హరినారాయణబాబు ఎకసక్కెంగా—
"ఓహో! చివరికి నువ్వీ మామూలు దారికి వచ్చిపడ్డావన్నమాట! శిక్ష సంగతి ఏమీ రానే లేదిప్పుడు. కోడలి ప్రసక్తి నేనేమీ తీసుకురాలేను నువ్వు హఠాత్తుగా ఆ పెద్ద మనిషికూతుర్ని ఈవిషయంలోకి లాక్కొని వచ్చి వ్యవహారాన్ని విషమింపచెయ్యాలనుకుంటున్నావా? అయితే ఇప్పుడు కోడలే నీ ప్రతిద్వంద్విని అన్న సంగతి బాహాటంగా తెలిసిపోయింది" అన్నాడు.

రాణి వ్యంగ్యంగా "ఇది నా దౌర్భాగ్యంమరి! అంతకన్న ఇంకేముంది?" అన్నది

"కాని ఈ వ్యవహారాన్నంతా మార్చి శుభంగా పరిణమింప చెయ్యటానికి వీల్లేదా?"

"అదెలాగో చెప్పండి"

"కోడల్ని మాతృవాత్సల్యంతో దగ్గిరకు తీసుకోవటానికి ప్రయత్నిస్తే?"

రాణి ఉద్దీప్త కంఠంతో "అలా వీల్లేదు. ఏమాత్రం వీల్లేదు. దయ ఉంచి ఆ మాట మాత్రం మరోసారి అనవద్దు. అంతకంటె మీ జడ భరతుణ్ణి నెత్తి నెక్కించుకుని మీ గద్దెమీద కూర్చోపెట్టుకున్నా నాకేం అభ్యంతరం లేదు. అందుకు నేను అడ్డుగా ఒక్క మాటకూడా మాట్లాడను" అన్నది

జమీందారు గంభీరంగా "కాని మరి నివారణుడ్ని ఆవిధంగా వంచించగలవా?" అని అడిగాడు.

రాణీ దృఢకంఠంతో - "నేను వాణ్ణి బలవంతాన లాక్కురాగలను. కట్టిపడేసి అయినా—"

"తర్వాత? ఆ అమ్మాయి అధికారాన్ని పూర్తిగా అంగీకరించి ఊరుకోగలవా?"

"ఆ ఆలోచనతర్వాత. మీ రింకా అడగ వలసిందేమయినా ఉందా?"

★ స్వయంసిద్ధ ★

హరినారాయణబాబు కంఠాన్ని సవరించుకుని "నువ్వు ఇప్పుడు చెప్పిన ప్రతి మాటమీదా ప్రతివాదం చెయ్యటానికి వీలుంది. ఇంతవరకు కన్నడూ గంగూలీ వంశీయుడైనవాడు ఇతరవంశంలోని స్త్రీ మీద ఆధారపడి, బాపలీరాజ్య సింహాసనం మీద కూర్చోలేదన్న సంగతి నీకు కచ్చితంగా తెలిసేఉంటుంది. జ్యేష్ఠుడనే అధికారంతో కూర్చోవాల్సివస్తే దానిమీద గోవిందుడే కూర్చోవాలి. కాని ముందు వాడు ఆ యోగ్యతను ఆర్జించుకోలేకపోతే- అది కేవలం దురాశతప్ప ఇంకేమీ కాదు" అన్నాడు.

రాణీ స్తబ్ధులా ఈ మాటలు విన్నది. కొంచెంసేపు ఎవరూ ఏం మాట్లాడలేదు. జమీందారు ఒకసారి రాణీకేసి ఓరగా చూశాడు. తర్వాత మళ్ళీ—

"నువ్వు ఈ భారాన్ని వహించలేవా? ఏ కారణంచేత నయితేయేం - వాడి విషయంలో చిన్నప్పట్నుంచీ కొంత ఉపేక్ష జరిగింది. దాన్ని ఇప్పుడు చక్కదిద్దటానికి వీల్లేదా?" అని అడిగాడు.

రాణీ ఒక్క క్షణం మనస్సులో ఏమాలోచించుకుందో - తర్వాత స్నిగ్ధకంఠంతో - "ఇది సాధ్యమయితే - మీ కోరికను నేను శిరసావహించేదాన్నే. కాని ఇప్పుడిహ అది అసాధ్యమైనపని. పాషాణాన్ని ప్రయత్నంమీద కదిలించగలమే కాని, దానికి ప్రాణాన్ని తీసుకురాలేం" అన్నది.

"సరే, అయితే. ఇది సంభవమో కాదో తెలుసుకుందామనే పిలిపించాను నిన్ను. దీనిమీద అనవసరమైన విషయాలన్నీ వచ్చి వృథా చర్చ జరిగింది. కాని నేనీ నిజతత్వాన్ని గ్రహించలేక - నా ఖయాలీలో నేనుండి, ఆ అమ్మాయినే శరణ్యంగా భావించి, ఎన్నో ఆశలు పెట్టుకుని ఆమె చేతికి బంగారపు కొరడా అందించాను."

"ఆ సంగతి విన్నాను నేను"

జమీందారు ఆవేగంతో - "కాని ఇవాళ ఆ కొరడా తిరిగి ఇచ్చివేస్తూ ఆ రాతి బొమ్మలో చైతన్యం తీసుకురావటానికి, ముందు ఆ బొమ్మ మనస్సును గుర్తించి ఉద్బుద్ధంచేస్తే చాలు, బంగారపు కొరడాతో ప్రమేయం లేదన్నది. దీనికి నా సమాధానం ఏమిటో తెలుసా" అన్నాడు.

పెళ్లి భోజనాలైనాయి, ఒక బట్టతల మనిషి, మరొక బోసినోటి ముసలాయన్ని "ఏమిటండీ?— ఉదయం మీ తోడల్లుడి మీద అంతగా కేకలేస్తున్నారు?" అని అడిగాడు.

"అది కాదండీ—మీరే చెప్పండి. ...మా తోడల్లుడు నా ధోవతి కట్టుకున్నాడు; నా వాకింగ్ స్టిక్ తీసుకొన్నాడు. ఆఖరికి నా రిస్ట్ వాచ్ కూడ నన్నడక్కుండా తీసేసుకొని తన చేతికి కట్టుకున్నాడు—అప్పటికీ నాకు కోపంరాలేదు. కానీ, తీరా ముహూర్తం వేళకి నా పెట్టుడు పళ్లసెట్టు (*False teeth* ను) పట్టుకపోయి తను పెట్టుకొని నావంక చూసి పళ్లు ఇకిలించటం మొదలుపెట్టాడు దాంతో నాకు ఎక్కడలేని కోపం వచ్చిందంటే నమ్మండి. ఆమైన చడా బడా నాల్గు చీవాట్లు పెట్టేశాను!"

జి. వి. జి కృష్ణ, మద్రాసు

రాణి జిజ్ఞాసాదృష్టితో భర్త ముఖంకేసి చూడగానే హరినారాయణబాబు ఉత్తేజిత కంఠంతో - "ఆమెమీద ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల నన్నిటినీ - ఆమెముఖం చూసి వాయిదా వేసుకుంటూ వచ్చాను. ఆమె ఈ పాషాణానికి చైతన్యం తీసుకురాగలిగిందంటే - ఆమె ఎన్ని ఖూనీలు చేసినా క్షమిస్తాను. అప్పుడు ఆమె స్థానం అందరికన్న పైది...కాని ఈ ప్రయత్నంలో ఓడిపోయిందంటే మాత్రం - ఇది ఆధారంగా తీసుకుని ఆమెని మళ్లీ శ్యామపురానికి పంపించివేస్తాను..." అన్నాడు.

ఈ మాటలు అంటున్నప్పుడు ఆయన పెదవులమీద నవ్వు కన్పించింది. విద్యుత్తులాగా తీక్ష్ణమైన నవ్వు అది. రాణి కన్నార్పకుండా భర్త విచిత్రముఖం కేసి చూస్తూ ఊరుకుంది... [సశేషం]

బొమ్మరిల్లు

ఏమున్నది?

శ్రీవాత్సవ

☆

చిన్ని చిన్ని పాపలు, చిన్నారి చిరుపాపలూ
చేతుల్లో ఏమున్నాదీ మీ
చేతుల్లో ఏమున్నాదీ?

పండే పంటలు సిరిసంపదలు
నిండే బంగరు రత్నపు గనులు
ప్రజకారోగ్యం, ఐశ్వర్యాలూ
రానున్న శుభసౌభాగ్యాలూ

చేతుల్లోనే ఉన్నాయీ మా
చేతుల్లోనే ఉన్నాయి!

చిన్ని చిన్ని కన్నల్లారా
చిట్టి చిట్టి తల్లుల్లారా

కన్నుల్లో ఏమున్నాయి? మీ
కన్నుల్లో ఏమున్నాయి?

హాయి హాయి ఆట పాటలు
భాయీ భాయీ అంటూ జతగా
చేయి చేయి కలిపి తిరిగిన
తీయని కలల అందాలన్నీ

కన్నులలో దాగున్నాయి మా
కన్నులలో దాగున్నాయి.

చిన్న చిన్న పిల్లల్లారా
మమ్ముగన్న తల్లుల్లారా
మాటల్లో ఏమున్నాదీ, మీ
మాటల్లో ఏమున్నాదీ?

అన్నీ తెలియాలను కుతూహలం
అన్నీ కావాలను కోరికలు
అన్నము పున్నము ఎరుగని మనసు
తిన్నని నిజము తిరుగని సత్యం

మాటల్లోనే ఉన్నాయీ, మా
మాటల్లోనే ఉన్నాయి.

(బూట్ పాలిష్ సినిమాలో పాట విని

సీరియల్:-



మూలం: ఆల్ఫాన్స్ డాడే

జరిగిన కథ

[మా నాన్న గారు—మష్యూ ఐసెట్టి—లాన్గ్యుడాక్‌లో పెద్ద సిల్కు వ్యాపారి. సొంత ఫ్యాక్టరీ అవీ వుండేవి. నేను (చిన్నా) పుట్టినరోజు లగాయతూ మా కుటుంబాన్ని ఏదో ఒక ఆపద చుట్టు ముట్టేస్తూనే వుంది. చివరికి దేశంలో వచ్చిన విప్లవం మూలంగా మా నాన్న గారిస్థితి పూర్తిగా చితికి పోయింది. కొంతకాలానికి మా నాన్న గారు దివాలా తీసి మా ఫ్యాక్టరీని అమ్మేశారు. మేము మా స్వస్థలం విడిచిపెట్టి లయన్స్ పట్టణానికి వెళ్ళిపోవలసి వచ్చింది.. ఆ తరువాత కొంతకాలానికే మానాన్న గారు వ్యాపారంలో మళ్లా దెబ్బతిన్నారు. మా సంసారం రెండో సారి చితికి పోయింది. ఉన్న నలుగురం విడిపోవలసి వచ్చింది. మా అమ్మని పుట్టింటికి పంపేశాం. జాక్‌ని లయన్స్‌లోనే ఒకకొట్లో గుమాస్తాగా చేర్చారు మానాన్న. తను సారా వుత్పత్తిదార్ల సంఘంతరఫున ఒక వుద్యోగం సంపాదించుకొన్నారు. నన్ను తనదగ్గరకు పంపితే దాక్షిణాత్య విశ్వవిద్యాలయంలో 'అషర్' వుద్యోగం యిప్పిస్తానని మానాన్న గారి స్నేహితుడైన 'రెక్టర్' జాబు రాశాడు. తత్క్షణం బయలుదేరి ఆవూరు వెళ్లాను. ఆయన సిఫార్సు మూలంగా సర్లాన్‌డీ కాలేజీలో 'అషర్' గాచేరాను. మొదట్లో జూనియర్ తరగతిలో పని చేశాను. తరువాత కొంతకాలానికి నన్ను ఇంటర్మీడియెట్ క్లాసుకి మార్చారు. ఆ వేసవి శెలవుల్లో కూడా నేను అక్కడే వుండి డిగ్రీల కోసం చదువుతున్నాను. ఇంతలో జబ్బు చేసింది. ఆస్పత్రిలో వుండగా, నేను అంతకుముందు మనస్సులో మోహించిన 'నీలోత్పలాక్షి' నాకు పరిచర్యలు చేయటానికి వచ్చినట్లే వచ్చి, అకస్మాత్తుగా అంతర్ధానమైపోయింది.

జమీందారుబిడ్డడ్ని క్లాసులోనుంచి తన్ని తగిలేసి, నా సీట్లోపోయి కూర్చున్నతరువాత, దాని పరిణామం ఎట్లా వుండబోతుందోనని వూహించుకొని వణికిపోయాను. ఏ క్షణంలోనైనా ఆ కుర్రాడు ప్రిన్సిపాల్‌ని వెంటబెట్టుకు రావచ్చునని హడిలిపోతునే వున్నాను. కాని ఎవరూ రాలేదు.

విశ్రాంతి సమయంలో, నాచేత దెబ్బలుతిన్న మార్క్వెస్ బౌక్యారన్, మిగిలిన పిల్లలతో కలిసి ఆయిలా పాయిలాగా ఆడుతూవుండటం నా కంటబడింది. దాంతో నాకు కొంచెం ధైర్యం చిక్కింది. మొత్తానికి ఆరోజున నేను భయపడినవేవీ జరుగలేదు. బహుశః వాటంతటితో ఆ వూసు వదిలేసుకొన్నాడు కాబోలు; నే నింతలా భయపడటం అనవసరమనుకొన్నాను.

ఆ తరువాత గురువారంనాడు మార్క్వెస్ 'డార్మిటరీ'కి రాలేదు. దాంతోనే నాకేదో భయం పట్టుకొంది. ఆ రాత్రంతా నిద్రపోలేదు.

మరునటి మొదటి పిరియడ్‌లోనే క్లాసులో పిల్లలు ఖాళీగా మార్క్వెస్‌సీటువంక చూసి రహస్యంగా ఏదో చెప్పుకోవటం మొదలుపెట్టారు.

ఏమి జరుగబోతోందోనని నాకు లోపల చచ్చేకంగారుగావుంది; అయినా పైకి అదేమీ కనబడనియ్యకుండా గంభీరంగా వున్నాను.

కొద్దిసేపటికి స్టడీహాలుతలుపు అకస్మాత్తుగా తెరుచుకొన్నదైంది. క్లాసులో పిల్లలంతా ఒక్కసా

అనువాదం: విశ్వాత్ముల నరసింహమూర్తి.

రిగా లేచి నిలబడ్డారు. అప్పుడే అనుకొన్నాను—ఇంతటితో మనపని ఆఖరు అని!

క్లాసు రూమ్‌లోకి ముందు ప్రిన్సిపాలూ, ఆయన వెనకాల వియట్, వాళ్ళిద్దరి వెనుకా మెడనుంచీ మోకాళ్ళదాకా వున్న పెద్ద బొచ్చుకోటు తొడుక్కొన్న పొడుగాటి ఒక ముసలాయనా వచ్చారు. ఆయన మెడచుట్టూ నాలుగువేళ్ళ వెడల్పున అంత పెద్ద కాలరూ అదీ, మహాపటాటోపంగా వున్నాడు. ఆయన ఎవరో నాకు అంతకుముందు తెలియక పోయినా, ఆయనే బౌక్యారన్ జమీందారు ఐవుంటాడని వూహించాను. ఆయన గదిలో కాలు పెట్టుతునే మీసాలు దువ్వుతూ పళ్లు పటపటలాడిస్తూ లోపలికి వచ్చాడు.

ప్లాట్‌ఫారంమీదనుంచి కిందికి దిగి లాంఛన ప్రాయంగా వొంగివొంగి వారికి సలాములు చేయాలన్న విషయంకూడా నేనా క్షణంలో మరిచిపోయాను. వాళ్లుకూడా మర్యాదలూ గౌరవాలు జ్ఞాపకం వచ్చేలా వ్యవహరించలేదు. వచ్చీరావటమే సరాసరి క్లాసు సట్టనడానికి వచ్చి ముగ్గురూ నిల్చున్నారు; వాళ్లపని పూర్తిచేసుకు పోబోతూకూడా నావంక ఒక్కసారైనా తిరిగి చూడలేదు.

నామీద నిప్పులు చెరగటమనే కార్యక్రమాన్ని మా ప్రిన్సిపాల్‌గారే ఆరంభించారు:

"అబ్బాయిలూ! ఇప్పుడు మేము కించిత్తు విచారకరమైన విషయానికై వచ్చాము. మీ వుపాధ్యాయుల్లో ఒకరు యిటీవల ఒక పాడుపని చేశారు. ఆ పని ఎంత పాడుపని అంటే—ఆ పనిచేసిన పెద్ద మనిషిని పదిమందిలోనూ నిలబెట్టి తిట్టినా ఏం పాపం లేదు."

ఆ తిట్టడమనే పని పాపం ప్రిన్సిపాల్‌గారే స్వయం పక్కా పావుగంటసేపు ఆపకుండా ఒక్క వూపుమీద కానిచ్చారు. అసలు జరిగిందొకటైతే యీాయన దాన్ని చెప్పినపద్ధతి యింకోలా వుంది. కాలేజీలోవున్న కుర్రాళ్లందరిలోకి మాణిక్యంలాంటి వాడట, మార్క్వెస్! అలాంటి కుర్రాణ్ణి పట్టుకొని వాడిమీద నేను నిష్కారణంగా పశుబలం ప్రయోగించానట. ఆనాటి నా నడతమూలంగా వుపాధ్యాయ వృత్తికే తీరని కళంకం ఏర్పడిందట!

ఇటువంటి ఆరోపణలకు నే నేమని సమాధానం చెప్పగలను?

అక్కడికీ నా తరఫున నే నేదో చెప్పుకోవాలని చూశాను. నాలుగైదుసార్లు ఆయన వాగ్ధోరణికి అడ్డు తగలబోయాను. కాని ఆయన నామాట ఒక్కటీ వినిపించుకోలేదు; వినిపించుకోదలచలేదు. తలాతోకా లేని నిందలు ఆరోపణలు అలా నిర్విఘ్నంగా నామీద పారేస్తునే వున్నాడు.

ఆయన అలసిపోయాక, పెద్ద జమీందారుగారు మొదలుపెట్టారు. మొదలుపెట్టటంలోనూ ఎలా మొదలుపెట్టాడనీ! మున్ముందుగా సాపై ఆరోపణ పూర్వకమైన గంభీరోపన్యాసం ఒకటి యిచ్చేశాడు. నిష్కారణంగా నాలాంటివాడి చేతిలో చావబోయి తప్పించుకొన్న తన కొడుకుని తలుచుకొని బిగ్గరగా కుళ్ళాడు. ఏ పాపమూ ఎరుగని తన కొడుకుమీద ఒకానొక వ్యక్తి పెద్ద ఎద్దులాగ—ఎద్దే ఏమిటి పెద్ద అడివి మృగంలా—విరుచుకుపడ్డాడట! నిస్సహాయుడై వున్న తన బిడ్డడు ఆ దెబ్బకి తట్టుకోలేక ఆ తరువాత వరసగా రెండురోజులపాటు మంచంలో పడివున్నాడట. ఆ స్థితిలో వాణ్ణిచూసి వాడి తల్లి కంటికిమింటికీ ఏకధారగా ఆక్రోశిస్తూనే వున్నదట...

హు! ఆ నేరం చేసినవాడు నిజంగా మనిషి ఐవుంటే తను వాడికి ఎలా బుద్ధిచెప్పాలో అల్లా చెప్పి వుండేవాడట. కాని తన కొడుకుపట్ల యింతటి అత్యాచారం చేసిన వ్యక్తి మనిషికూడా కాదు; చూసి జాలి పడవలసిన బికారి వెధవట! అయినప్పటికీ ఎందుకైనా మంచిదని ఆ బికారివెధవకి ఆయన అప్పుడే ఒక హెచ్చరిక చేశారు—ఇకముందు ఎప్పుడైనాసరే యీా బికారి తన కొడుకు తలమీది వెంట్రుకను అట్లా ముట్టుకున్నా చాలు, తాను (అంటే పెద్ద జమీందారు) సరాసరి వచ్చి వాడి (అంటే బికారివాడి) కంఠాన్ని వుత్తరించేస్తాడట...

జమీందారుగారు శివమెత్తి చెప్పుకుపోతున్నంత సేపూ పిల్లలు మూతులకి చేతులు అడ్డంపెట్టుకొని నావంక కొంటెగా చూస్తూ నవ్వుతునేవున్నారు. వియట్‌గారి తాళంచెవులు అంతకంటేను!—వాటి ఆనందానికి ఆరోజు అంతులేదు. అవి చేసిన చప్పుడు అంతా యింతా కాదు. నిస్సహాయుడనై నిలచిన

అన్నా - చిన్నా

నేను, అనంతంగావచ్చి మీాదపడుతున్న నిందల్నీ అవమానాలనీ మారుమాట్లాడకుండా భరించి వూరుకొన్నాను. సమాధానం చెప్పటానికి సాహసిస్తే నన్ను అప్పటికప్పుడే 'డిస్మిస్' చేసేవాళ్లు. 'డిస్మిస్' చేస్తే నేను ఎక్కడికి పోయేదీ; ఏం చేసేదీ?

ముగ్గురూ కలిసి ఏకబిగిని గంటసేపు హోరెత్తించి అలసిపోయి, అక్కడనుంచి కదిలారు. వాళ్లు అలా గుమ్మం దాటారో లేదో క్లాసులో పిల్లలంతా నన్ను ఎగతాళిపట్టించాలని పెద్దగా అరవటం మొదలుపెట్టారు. ఎల్లాగైనాసరే వాళ్ళచేత ఆ అరుపులు మాన్పించాలని వ్యర్థప్రయత్నాలు ఎన్నో చేశాను. వాళ్లదే పైచెయ్యి అయింది. నా ముఖం మీాద ముఖంపెట్టి యికిలించటం మొదలుపెట్టారు. ఈ 'బాక్యారన్' గొడవమూలంగా నాకు క్లాసుపిల్లలను అదుపులో పెట్టగల శక్తి పూర్తిగా హరించిపోయింది.

కాలేజీలో మాత్రమే కాదు; ఊళ్ళో వీధుల్లోనూ హోటళ్లలోనూ ఎక్కడపడితే అక్కడ యిదే గొడవ మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. ఉత్కంఠతో వినే ప్రతి వ్యక్తికీ వొళ్లు కంపరమెత్తేలా వుండాలని, యీా వుదంతాన్ని వర్ణించిన ప్రతిఒక్కడూ అసలు జరిగినదానికి తను మరికొంత కల్పించి చెప్పకుపోయేవాడు. ఆ కథలు అల్లాఅల్లా పెరిగిపోయి, చివరికి చమత్కారమైన రూపం దాల్చాయి. నరరూప రాక్షసుడొకడు (నేను!) క్లాసులోని పసికందుని పట్టుకొని యింతకుముందెన్నడూ కనివిని యెరుగనంత ఘోరంగా చావబాదేశాడని చెప్పుకోవటం మొదలుపెట్టారు. రానురాను ఆపేరూ యీాపేరూ ఎందుకని నన్ను 'కసాయివాడ'నటం ఆరంభించారు.

నా చేతుల్లో దెబ్బతిన్న జమీాందారుబిడ్డడ్ని రెండుమూాడు రోజులపాటు పక్కలో పడుకోబెట్టి యింటిల్లపాదీ పరిచర్యలు చేశారట. ఆ తరువాత బయటవైపుగావున్న పెద్ద హాల్లో వీడికోసం మెత్తటి సోఫా ఒకటివేసి అందులో కూర్చోపెట్టారట. వీణ్ణి చూసిపోవటానికి వచ్చిన జనప్రవాహం వారం రోజులకి కాని తగ్గలేదట. తనను పలకరించవచ్చిన గొప్ప గొప్ప వాళ్లకోసం కనీసం ఓ యిరవైసార్లైనా వీడు అసలు జరిగిందేమిటో వర్ణించవలసి వచ్చిందట. ఆ యిరవైసార్లూ ఒకసారి చెప్పినట్లు యింకొకసారి చెప్పకుండా కథ పెంచేసుకుపోయాడు. వాడు వర్ణిస్తున్న ఆ హింసాకాండను వినలేక చుట్టూచేరిన ముసలమ్మలు వలవలా ఏడ్చారట. చావుతప్పి బయటపడ్డ యీా చిన్నవాడికి జాలిగుండెలుగల తల్లులెందరో చాటునా మాటునా మిఠాయి పొట్లాలు చేతికి అందించారట కూడాను. ఈ అవకాశాన్ని దొరకపుచ్చుకొని ప్రభుత్వ వ్యతిరేక పక్షానికి చెందిన వార్తాపత్రిక పిడుగులాంటి వ్యాసం ఒకటి ప్రకటించింది.

(ఇంకా వుంది)

వాళ్ళూ, నేనూ

రావి కొండలరావు

రెండో ఫారం చదువుకుంటున్న రోజుల్లో వెంకట్రావూ బుచ్చిబాబూ తంబిగాడూ నేనూ చాలా స్నేహంగా వుండేవాళ్లం. అప్పటికి నాకు పన్నెండు పదమూడేళ్లు. మిగిలినవాళ్లు కూడా షుమారుగా నా యీడూ—అంతకన్న ఏ కాస్తో ఎక్కువో-తక్కువో.

బుచ్చిబాబు నల్లగా చింతమొద్దల్లే వుండేవాడు. ఎంత చదివినా వాడి తలకెక్కేది కాదు. ఎప్పుడూ ఎవర్నన్నా తందామా కొడదామా అనే వాడి ఆలోచన. వాడికి ఎవరిమీదన్నా కోపం ఎక్కువగా వొచ్చేసరికి పొడిచేస్తానని కత్తితియ్యటానికి కూడా సిద్ధపడేవాడు! స్టంటుసినిమాలు వొస్తే రోజూ ఎట్లాగన్నా సరే రెండు ఆటలూ చూసేవాడు. వెంకట్రావు వొట్టి అమాయకుడు. అమాయకత్వం అని పూర్తిగా చెప్పలేము కాని - ఆ అమాయకత్వంలోనూ కొంత గడుసుతనం వుంది. కొన్ని కొన్ని విషయాల్లో మాత్రం ఆ అమాయకత్వం పూర్తిగా బయటపడిపోతుంది. వాళ్ళనాన్న గారు ప్లీడరు. వాళ్లకు మంచి ఇల్లూ-కావల్సినంత డబ్బూ వున్నై. కారు కూడా కొంటున్నామని ఎప్పుడూ అనేవాడు-ఐతే ఇంతవరకూ కూడా కొనలేదనే అనుకుంటాను. తంబిగాడికి పేరేదోవుందిగాని ఆ పేరుతో మేమెవ్వరమూ పిలవం. వాణ్ణి వాళ్లింట్లో అందరరూ 'తంబీ' అని పిలుస్తారు. ఆ పేరే వాడికి సార్థకమయిపోయింది. మొత్తానికి మాలో ఎవడికీ చదువుమీద ఆసక్తి వుండేది కాదు. క్లాసులో నలుగురమూ వొక్కచోటే

కూచోటం—, బాతాఖానీ వేసుకోటం— మేష్టారిచేత దెబ్బలు తినటం—ఇదే క్లాసులో భాగోతం.

ఒకనాడేంజరిగిందంటే ఇంగ్లీషు మాష్టారు ఇంగ్లీషుపద్యాలు కంఠతా పెట్టుకురమ్మని - వప్పజెప్పుకుంటానన్నారు. క్లాసులో అందరూ చెప్పారుగాని మేం నలుగురమూ తప్పాం. నాకసలు ఏ పద్యమో తెలీదు. బుచ్చిబాబు చదివాట్టగాని మేష్టారిముందు నిలబడి చెప్పలేకపోయాడు. తంబిగాడు సరేసరి—పోతే మాలో ఏదో కాస్త చెప్పగలిగినవాడు వొక్క వెంకట్రావే. అంటే పద్యంలో మొదటి 'లైను' అనేసి పూరుకున్నాడు. మేష్టారు అందించారు గాని వాడి కసలు వొస్తేగా— దాంతో నలుగురికీ జరగవల్సిన పూజ జయప్రదంగా జరిగిపోయింది. మేష్టారు బెత్తాం తీసుకుని 'రువ్వ్'మనేట్టుకొట్టి నలుగుర్నీ బెంచీలమీద నిలబెట్టారు. ఆడపిల్లలూ మొగపిల్లలూ అందరూ హేళన చెయ్యసాగారు. బుచ్చిబాబు బెంచీమీద నించుని మేష్టారిమీద పచ్చి బూతులు గొణుక్కోటం ప్రారంభించాడు.

"ఎవడ్రా ఆ గొణుగుడూ?" అని మేష్టారు అరిచారు.

గొణుగుడు ఆగిపోయింది.

"వెధవల్లారా -సంవత్సరమంతా బెంచీలమీదే నిలబెట్టేస్తాను. జాగర్త" మేష్టారు కొత్తపాఠం ఆరంభించారు. మళ్ళీ గొణుగుడు వినబడ్డది. మొదట్లో ఆయన వినలేదు గాని-తర్వాత విని "చెబుతూవుంటే ఎవడ్రా ఆ గాడిదా?" అనేసరికి ముందు కూచున్న వో 'మంచి వెధవ' నాకేసి చెయ్యి చూపించాడు.

"ఏం రోయ్ - నోరు కొవ్వింద్రా - గాడిదవెధవా - తిన్న దెబ్బలు..."

"నేను కాదండీ" అన్నాను.

"మరెవడు?"

"అదేమో. అదేం గొణుగుడో నాకు వినబట్టంలేదు."

"చవిటి రాస్కెల్ - వినబడుతుంది - వినబడుతుంది. మళ్ళీ కానీ చూస్తాను."

తర్వాత ఆ గొణుగుడు ఇహ వినబడనేలేదు.

నేను బెంచీమీద నించుని వున్నంతసేపూ శాంత నావేపు జాలిగా చూస్తూనేవుంది. శాంత

★ వాళ్లూ, నేనూ ★

మా పక్కింటివాళ్ల అమ్మాయి. పొడుగ్గా నల్లగా జడ - పెద్ద కళ్లూ- తెల్లగా అందంగా వుండేది. మేష్టారు పద్యాలు వప్పజెప్పకుంటారన్న సంగతి నిన్న సాయంత్రం శాంతే చెప్పింది. ఆ పద్యాలేమిటో-ఎక్కణ్నుంచి ఎంతవరకు చదవాలో అన్నీ చెప్పింది. ఐతే నేను 'వూఁ' అన్నానుగాని వెంటనే మరిచిపోయాను. "అనవసరంగా మేష్టారి చేత దెబ్బలు తినకు. రాత్రంతా చదివేయ్"అని కూడా శాంత నన్ను హెచ్చరించింది. ఇప్పుడా అమ్మాయి చూసే జాలిచూపులో అర్థం - తను చెప్పినా కూడా నేను వినక మేష్టారి చేత దెబ్బలు తిన్నాననే-కాబోలు.

బడి ఐపోయిన తర్వాత బుచ్చిబాబు చరచరా వెళ్ళి ఎవడయితే తను గోణిగాడని తనమీద చెప్పాడో వాణ్ణి చాచి వొక్క లెంపకాయ కొట్టాడు. వాడు కెవ్వుమని అరిచాడు. "పోయి నీ తాత్తో చెప్పకోరా" అన్నాడు బుచ్చి. నేనెంత చెప్పినా వినకుండా వాణ్ని తిడుతూనే వున్నాడు. ఆ కుర్రాడు ఏడుస్తూనే తాత్తో చెప్పకోటానికి పోయాడు.

"వాడు మధ్యాన్నం మేష్టారితో చెప్పి తన్నిస్తాడ్రా" అన్నాడు వెంకట్రావు.

"ఎవడు? వాడా? ఎవర్ని తన్నిస్తాడు? చూస్తాగా - మొగ్గలు కొట్టిస్తాన్రా - గడ్డంమీద పిడికిలితో వొక్కటిచ్చుకున్నానంటే మైలు దూరం తుళ్లాలి. స్టంటుసినిమాల్లో నువు చూశావా - అదీ అట్లా అవుతాడు మనిషి. రక్తం కక్కుతాడ్రా రక్తం-" అంటూ పేల్తున్నాడు బుచ్చి.

"వూరుకుందూ ఏదో వాడికి వార్నింగ్ ఇచ్చిపంపించివుండవలసింది" అన్నాను నేను.

"పోరా నువ్వొట్టిచాతకానివాడివయిపోయావు, లేకపోతే క్లాసులో ఆ వెధవ అట్లా తను మహా చూసినట్టు నీమీద చెబితే - చచ్చినట్టు నోరు మూసుకున్నావు. అదే నన్నంటే చెప్పివుందును - అక్కడే."

శాంత నా పక్కనుంచే వెళ్ళిపోయింది. నన్ను చూడలేదుగాని-చూసి వూరుకున్నట్టు మాత్రం నాకు తెలుసు. ఈ ఆడపిల్లల్లో వొకటుంది. ఇంటిదగ్గిర ఎంత చనువుగా మాట్లాడుకుని-ఆడుకున్నా వీధిలో ఎప్పుడన్నా కనబడితే బొత్తిగా ఆ మనిషి తెలియనట్టే ప్రవర్తిస్తారు. అదేమిటి !

"మధ్యాన్నం స్కూలుకు నేను రాను" అన్నాను.

"ఏంరా ?" అన్నాడు వెంకట్రావు.

"దడుచుకున్నాడ్రా - పిరికిపందల్లో ఫస్టు" అన్నాడు బుచ్చి.

"ఎందుకురా రావూ?"అని అడిగాడు తంచి.

"రావాలని లేదు" అన్నాను.

"రారా తమాషా చూద్దాం" అన్నాడు బుచ్చి.

అందరం ఎవరిళ్లకు వాళ్లం పోయాము. ఇంటిదగ్గిర శాంత కనుపించింది. నన్ను చూసి తనలో తను మాట్లాడుకోటం ప్రారంభించింది. "వొకసారి చెబితే వినిపించుకోనక్కర్లా? కాస్సేపు చదువుకుంటే ఏం? ఏం మునిగిపోయిందని?"

"చదివాను కాని అక్కడ చెప్పలేకపోయాను" అన్నాను

శాంత నవ్వింది.

"కోశాననుకుంటున్నావు కదూ ?"

"సరే లేదులే. చదువుకో . వొస్తాను"

"శాంతా" అని పిలిచాను.

వొచ్చి "ఏం?" అన్నది.

"మధ్యాన్నం స్కూలుకు రాను."

"ఐతే ?"

"నువు సెలవుత్తరం ఇచ్చేస్తావా ?"

"నాకు తెలీదు" అనేసి వెళ్లిపోయింది.

పుస్తకాలు పడేసి-భోజనం ఐన తర్వాత శాంతకోసం వెళ్లాను. శాంతా వాళ్ల ఇల్లుచూట్టానికి చాలా బావుంటుంది. ఇంటిముందు చిన్న గేటూ - లోపల విశాలమయిన తోటా - పొగడచెట్లూ - పూల మొక్కలూ - ఎంతో అందంగా వుంటుంది. నేను వెళ్లేసరికి పొగడ చెట్టునీడలో శాంత కనుపించింది. నన్ను చూసి చిరాగ్గా "నేను ఇవ్వనని చెప్పానుగా" అన్నది.

"అదికాదు శాంతా-నీ నోట్సు ఓసారివ్వు. చదువుకుంటాను."

"ఏం నోట్సు?"

"—తెలుగు...రాసుకుని ఇచ్చేస్తాలే"

"ఏం బుద్ధొచ్చేసిందా?"

"వొచ్చినట్టే. త్వరగా ఇవ్వు మరి."

లోపలకు పోయి నోట్సు తెచ్చి ఇచ్చింది. ఇంటికి వెళ్ళి రాయని నోట్సు రాయటం ప్రారంభించాను. వెంటనే ఎందుకు రాస్తున్నానా అనిపించింది. ఓ పేజీ రాసి మూసేశాను. వెధవది! నోట్సు రాయటం ఏమిటి? పాఠాలు చదువుకుంటే చాలదూ? అనిపించింది.

ఆ మధ్యాన్నం క్లాసుకు వెళ్లటం ఆలస్యమయింది. వెళ్ళేసరికి బుచ్చిగాడు బెంచీమీద నిలబడివున్నాడు. వాడి రెండు కళ్ళవెంటా నీరు కారిపోతున్నది. నన్ను చూసి మేష్టారు లోపలకు రానివ్వలేదు. "మరో అరగంట పోయిరారా వెధవా" అన్నారు. ఆయన ఎందుకో మహా కోపంగా వున్నారు.

"లేదండి. మా నాన్నగారు వో పని చెప్పారు. అంచాత ఆలస్యం ఐంది" అన్నాను.

"వెళ్ళి మీ నాన్నగారిచాత అట్లా రాయించుకురా."

నేను చెప్పిన కారణం అబద్ధమని ఆయనకు తెలిసిపోయింది!

"లేరండీ-వెంటనే వూరికెళ్లారు" మా నాన్నగారు వూరికెళ్లటం నిజమే!

"ఏ వూర్రా?"

"కాకినాడ."

"ఎందుకూ?"

"తెలీదండి."

"ఎప్పుడొస్తారు?"

"తెలీదండీ."

"దొంగ వెధవా" అని కాస్సేపు నా మొహాం చూసి "వొచ్చి నీ చోటులో నిలబడు" అన్నారు.

క్లాసులోకి పోయి నించున్నాను. మేష్టారు ఏదో పాఠం చెప్పటంలోకి దిగారు - నేను ఆలోచించటంలోకి దిగాను. పొద్దున్న ఆ 'వెధవ' మొహాం మహా గర్వంగా కనిపిస్తున్నది. మేష్టారు పెద్దకోపంతో వున్నారు. బుచ్చిగాడు ఎప్పుడూ లేదు ఏకధారగా కంటికీ మంటికీ ఏడుస్తున్నాడు. వాణ్ని తప్పకుండా మేష్టారు చావబాదివుంటారు. పాపం నానుంచేకదా వాడికీ బాధంతా! వొద్దురా అంటే వినకుండా వాణ్ని కొట్టాడు. బుచ్చిగాడికేసి చూశాను. వాడు తదేకంగా ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు. కంటివెంబడి నీళ్లు ఆగిపోయినయ్ గాని చారలుమాత్రం బాగా కనుపిస్తున్నై. కళ్లు ఎర్రగా వున్నయ్. జుట్టంతా రేగిపోయి వుంది. వాణ్ని చూడగానే నాకు ఏడుపొచ్చినంత పనయింది. తమాయించుకుని వూరుకున్నాను.

ఆ పిరీడు ఎప్పుడయిపోయిందో - మేష్టారు ఎప్పుడు వెళ్ళిపోయారో నాకు తెలియలేదు. తర్వాత పిరీడు డ్రిల్లు. బుచ్చిగాడు బెంచీమీద లేడు - కిందనే కనుపించాడు. నాతో మాట్లాడలేదు. నామీద కోపం వొచ్చింది కాబోలు అనుకున్నాను. డ్రిల్లు క్లాసుకు పోవటానికి బయటికొచ్చాను. బుచ్చిబాబు నా వెనకాలే బయటికొచ్చి - చాలా సీరియస్‌గా "వొరే - ఇంటికి పోతున్నాను. బడివిడిచిపెట్టేసిన తర్వాత తోటలో కలుసుకుందాం." అని వెళ్లిపోతూ - "వాళ్ళతో కూడా చెప్పు" అన్నాడు.

"డ్రిల్లుమాష్టారితో చెప్పావుట్రా?" అన్నాను. వాడు సమాధానం చెప్పకుండా చకచకా సాగిపోయాడు.

డ్రిల్లుక్లాసుకు పోతూవుంటే దార్లో వెంకట్రావు చెప్పాడు. బుచ్చి పొద్దున్న కొట్టినట్టు ఆ కుర్రాడు మేష్టారితో చెప్పి-దవడ చూపించి ఎట్లా వాచిందో కూడా చూడమన్నాట్ట - మాష్టారు మండిపోయి బుచ్చిగాణ్ని అందిన చోటున 'ఛెళ్లు' మని చరిచారుట - వాడు 'లబోదిబో' మంటున్నా కూడా ఆయన వినిపించుకోలేదుట. ఈసారి మళ్ళీ ఇటువంటివి వింటే బుచ్చిగాణ్ని హెడ్మాస్టారితో చెప్పి స్కూలునుంచి బయటకు పంపేస్తారుట కూడా! "పాపం" అన్నాడు ఆఖరుకు.

ఇదంతా నానుంచేకదురా వాడికి? అన్నాను.

"నీ నుంచి ఏమిట్రా? ఆ వెధవ చూడూ ఎంతపని చేశాడో"

తంబిగాడు కూడా వొచ్చి మాలో జేరాడు. ఇంతలో డ్రిల్లు

★ వాళ్లూ, నేనూ ★

క్లాసు దగ్గిరై పోయింది. సాయంత్రం తోటలోకి రమ్మని బుచ్చి చెప్పాడని చెప్పాను. ఇద్దరూ వొస్తామన్నారు. ఆ డ్రిల్లుపిరీడూ ఆ తర్వాత పిరీడూ కూడా నాకేమీ తల కెక్కలేదు. నా ఆలోచనంతా బుచ్చిగాడిమీదా - మేష్టారిమీదా ఆ వెధవమీదానూ.

సాయంత్రం ఇంటికొచ్చి పుస్తకాలు పెడుతూంటే "బజారు కెళ్లిరా" అన్నాడు మా అన్నయ్య. చచ్చాను! వాడెందుకు రమ్మన్నాడో? వాడితో ఏమీ మాట్లాడలేదు కూడా.

"ఇప్పుడా?" అన్నాను.

"మరెప్పుడు పోతావ్? కాఫీ పొడరు కావాల్ట"

"పొద్దున్నకు కదా - తర్వాత వెళతాను."

నా మాట అన్నయ్య విన్నాడు. అమ్మ ఏదో టిఫిన్ చేసిపెట్టింది. అది తినేసి తోటలోకి పరుగెత్తాను.

ఆ తోట వూరవతల వుంది. తోటనిండా మావిడిచెట్లూ - మర్రిచెట్లూ - నారేడుచెట్లూ - రకరకాలచెట్లు బోలెడన్ని వుంటాయి. ఆ తోట ఎవరిదో మాకు తెలీదు. ఆ తోటలో మామిడిచెట్లు ఎప్పుడూ కాయవు. అసలు పువ్వు పూయటమే నేనెరగను ఆ తోటకు 'మాలి' అన్న వాడెవడూ అక్కడ కనబడడు. తోటలోకి వెళ్తూ రావటానికి ఫర్వాలేదు కాని-కొమ్మలూ అవీ విరిచినట్టూ - తోట పాడు చేసినట్టూ తెలుస్తేమాత్రం మక్కెలు విరగ్గొట్టేస్తారుట! ఐతే అట్లా విరగ్గొట్టే అధికారం ఎవరికుందో నాకు తెలీదు. ఆ తోటనిండా పాము పుట్టలు బోలెడున్నాయికాని పాములు సాధారణంగా కనుపించవు. మర్రిచెట్లమీద దయ్యాలు కూడా వున్నాయని అందరూ చెబుతారు గాని చూసినట్టు రూఢిగా చెప్పినవాళ్ళెవరూ లేరు. దయ్యాలభయం మాకూ వున్నది. కాని మనుషులు వొస్తూపోతూ వుంటారు కాబట్టి ఆ భయం అంత వుండేదికాదు. తోటలోకి ఎప్పుడు వెళ్ళినా చీకటి మరో అరగంటకు పడుతుందనగా మేము ఇళ్ళకు పోయేవాళ్ళం. సాధారణంగా మేం తోటకు వెళ్లం - ఎప్పుడో కాని. అక్కడ మాకో 'ప్రత్యేకస్థలం' వుంది. ఎప్పుడు వెళ్ళినా అక్కడే వుంటాము. ఐతే ఈసారి నేను వెళ్లేటప్పటికి ఎవరూ అక్కడ కనుపించలేదు. ఇంకా రాలేదా ఏమిటనుకుని అటూయిటూ చూడసాగాను. "కోవ్" మని వో కేక వినిపించింది. తంబిగాడి గొంతు అది - కాని మనిషెక్కడా కనబడలేదు. చుట్టూ చూశాను. మళ్లీ కేక వినిపించింది.

"ఎక్కడ్రా?" అని అరిచాను. సమాధానం రాలేదు. ఒకవేళ ఏ దయ్యమన్నా తంబిగాడి కంఠంతో అరుస్తున్నదేమోనని భయం వేసింది.

"తంబి" అని పిలిచాను - నిదానంగా.

"కోవ్" అన్నాడు. మళ్లీ పిలిచాను.

"ఇటు రారా" అని వినిపించింది.

చుట్టూ చూశాను. అన్నీ చెట్లూ పొదలూ పుట్టలూ తప్ప ఇంకేమీ కనుపించటంలేదు. మర్రిచెట్టుమీద కొమ్మలు టపటపా కొట్టుకున్నయ్. ఏమిటో అని అటు చూశాను. కొమ్మమీద తంబిగాడు కనుపించాడు. పరుగెత్తాను.

"ఎక్కరా" అన్నాడు.

"బుచ్చిగాడూ - వెంకట్రావూ.."

"వున్నార్రా. రా - జాగర్త - నిశ్శబ్దంగా ఎక్కు."

ఆ చెట్టు ఎక్కటం నాకు చాతకాలేదు. తంబిగాడు నవ్వి "అదేమిట్రా చెట్టు ఎక్కటం రాదూ? అరే - అట్లాకాదు. దానిమీద కాలు వెయ్యి. ఆఁ-అట్లా-జాగర్త-గట్టిగా మీదికొమ్మ పట్టుకో... రైట్."

శ్రమపడుతూ చెట్టు ఎక్కాను. "ఇదేమిట్రా ఎప్పుడూ లేంది ఈ చెట్టు ఎక్కారూ?" అని అడిగాను.

"ష్ - వూరుకో. దానికంతా పెద్ద ప్లానువుంది" అన్నాడు తంబిగాడు.

"వాళ్ళేరీ?"

"అటుపక్క వున్నారు. పద పోదాం. జాగర్తగా నా వెనకాలే కొమ్మపైనుంచి రా."

వాడి వెనకాల బయల్దేరాను. కొమ్మలు చాలా లావుగావుండి వంకర తిరిగివున్నయ్. దట్టంగా ఆకులూ. ఏ పాములన్నా కొమ్మలకు చుట్టుకుని వున్నాయేమోనని నా భయం. తంబిగాడు ఆకుల్లోంచి దూసుకుంటూ - ఎంతో పరిచయం వున్నవాడల్లే పోతున్నాడు. ఆ మహారణ్యంలోకి చొచ్చుకుని కొంత దూరం పోయాం. అక్కడ ఆగాడు

తంబి. "ఇప్పుడు పైకి ఎక్కాలి - జాగ్రత్త" అన్నాడు.

నాకు ఆశ్చర్యంవేసింది. "ఎట్లా తెలుసురా నీకూ?" అనడిగాను. వాడు నవ్వి "ప్రాక్టీసురా"అన్నాడు.

పైకి ఎక్కాము. అక్కడ బుచ్చీ వెంకట్రావూ కొమ్మలమీద ఆకుల మధ్య కూచున్నారు. మనుషులు కూచోటానికేనా అన్నట్టు కొమ్మలు అక్కడ ఏర్పడివున్నై. నన్ను చూసి "ఏంరా ఇంత ఆలస్యం?" అన్నాడు బుచ్చి. నేను సమాధానం ఇవ్వలేదు. వాడి మొహం ఇంకా సీరియస్‌గానే వుంది. కళ్లు చింత నిప్పులల్లేనే వున్నయ్. కూచున్నాను. చుట్టూ ఆకులే తప్ప ఇంకేం కనుపించటంలేదు. చెట్టుమీద కొంగలు శబ్దం చేస్తున్నయ్. మా చుట్టూ గబ్బిలాలు తిరుగుతున్నయ్.

"ఇదేమిట్రా ఇవాళ ఈ భయంకరమయిన చోటు చూశారు?" అన్నాను బుచ్చితో. వాడు వెనక్కు తిరిగి రెండు చేతుల్తోనూ ఆకుల్ని పక్కకులాగి - మధ్యగుండా తల పెట్టి అవతలకు చూసి - "ఎవ్వరూ లేరులే" అన్నాడు.

ఆ తర్వాత చాలాసేపు బుచ్చిగాడు, మేమూ అనేకవిధాలుగా ఆలోచనలు చేశాము. మేష్టారిమీద ఏదో విధంగా కసి తీర్చుకోవాలంటాడు బుచ్చిగాడు. మేష్టారు తన్ను కొట్టినందుకు వాడికి దహించుకుపోతున్నది. మేష్టారి తప్పు ఆట్టే లేదని వాణ్ణి ఒప్పించడానికి మా కు తాతలు దిగొచ్చారు. ఎక్కడికన్నా పారిపోయి సుఖంగా ఉంటానన్నాడు బుచ్చిగాడు. మనం ఈ వయస్సులో ఎక్కడికీ పోయి చేసేదేమీలేదని నే నన్నాను. వాడు కూడా కొంచెం మెత్తపడ్డట్టు కనిపించాడు. తన మనస్సులోని బాధ అంతా వెళ్లగ్రక్కుతూ ఇంకా ఏవేవో చెప్పాడు. కాని మా చర్చలు ఎంతకీ తెగలేదు. ఏం చేయడానికి పాలు పోలేదు. చీకటిపడబోతోంది. ఇంక ఇళ్లకు పోదామనుకున్నాము.

"దిగండిపోదాం" అని ముందు దారితీశాడు బుచ్చి. ఆ వెనక తంబీ, తర్వాత వెంకట్రావూ, తర్వాత నేనూ దిగాము.

ఎక్కటంకంటే దిగటమే కష్టంగా వుంది. మేము దిగేసరికి చెట్టుమీద ఆకులు 'గలగల'మని చప్పుడయినయ్.

"ఎవర్రా అది?" అన్నాడు తంబి పైకి చూస్తూ.

"దెయ్యాలేమో" అన్నాడు వెంకట్రావ్.

"నీ మొహం. వూరుకోరా - దయ్యంఐతే. దిగిరమ్మను. వొక్కపోటుపొడిచి చూపిస్తాను." అని అరిచాడు బుచ్చి. ఆ దయ్యం దిగిరాలేదు. ఇంటివేపు బయల్దేరాం. రెండడుగులు వేశామో లేదో పెద్ద పాము వొకటి పుట్టలోకి పోతూ కనిపించింది!

"పదండ్రా త్వరగా పోదాం" అన్నాడు వెంకట్రావు భయపడుతూ.

"ఇది 'వెరీ డేంజర్ ప్లేస్'" అన్నాను.

"ధైర్యం వుంటే దెయ్యాలూ పాములూ ఏమీ చెయ్యలేవు" అన్నాడు బుచ్చి.

"ఏడిశాయిలే" అని తాళం వేశాడు తంబిగాడు. రోడ్డుమీదికొచ్చేశాం. చీకటి పడటానికి ఇంకా చాలా టైముంది.

"సరే - జాగర్త, వొస్తాను" అనేసి బుచ్చిగాడు త్వరత్వరగా వెళ్లిపోయాడు. మేమూ వెనకాలే బయల్దేరాము. దార్లో ఏవో స్కూలు విషయాలూ ఇంటి భోగట్టాలూ మాట్లాడుకున్నాం. కాస్సేపటికి యింటికి చేరుకున్నాను. చాలసేపు బయటే అటూ ఇటూ పిచ్చిగా తిరిగాను.

లోపల్నుంచి అమ్మ కేక వేసింది. "అన్నం తినేసి చదువుకోకూడదుట్రా?" అని. 'ఆఁ' అని వెళ్తూ వుంటే - బుచ్చిగాడు పిలిచాడు!

"ఏంరా!" అన్నాను నెమ్మదిగా.

"బయటికి రా."

రోడ్డుమీద నించున్నాను. చుట్టూ చూసి ఎవరూ లేరని నమ్మకం కలిగాక అతి నెమ్మదిగా నాతో చెప్పాడు. వాణ్ని క్లాసులో మేష్టారు కొట్టినట్టు ఎవరో చెప్పారుట- దానిమీద వాడి నాన్నగారు కేకలు వేశారుట. తిట్టారుట. వీడు కాడీ అనీ ఎప్పుడూ చదవడనీ - అందర్నీ ఎప్పుడూ తిడుతూ కొడుతూ వుంటాడనీ కూడా వాళ్ళెవరో చెప్పారుట! ఆఖరుకు వాళ్ల నాన్నగారు వాణ్ని కొట్టి ఇంట్లోంచి బయటకు పొమ్మన్నారుట - భోజనమన్నా చెయ్యకుండా వీడు వొచ్చేశాట్ట! ఈ సంగతి చెప్పగానే నా మనస్సులో భయం, జాలి కలిగాయి.

"ఆఁ-రేపొద్దున్న నువ్వు బడి ఎగవెయ్యాలి."

పరాభవం

మీకు చెప్పబోయే, నాకు జరిగిన 'పరాభవాన్ని' తలుచుకుంటే ఒక్కొక్కప్పుడు నవ్వాలో, ఏడవాలో కూడా తెలియదు.

అవి నేను 'ఫోర్త్ ఫారమ్' చదువుకొనే రోజులు. మా అక్కయ్య పెళ్లి సంగతి మా యింట్లో పెద్దసమస్యయైకూర్చొంది. మా నాన్నగారు తిరిగి తిరిగి ఆఖరికి మేనరికమే కుదిర్చేరు. మా బావని నేను ఎప్పుడో చిన్నతనంలో చూసేను. మళ్లీ అతన్ని పెళ్లిలో చూడ్డమే. అందుచేత మా బావ; నేనుకలసిమెలసి మాట్లాడుకోవడం అంతగా లేదు.

పెళ్లిలో మా బావని బాగా చూసేను. అందరినీ ఆకర్షించేది అతనికున్న ఉంగరాల జుట్టే. ఆ ఉంగరాల జుట్టు అందరి

జి. వి. రమణారావు

కంటె నన్ను ఎక్కువగా ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు, అతిశయోక్తి అంతకన్నా లేదు.

అతని ఉంగరాల జుట్టు ఎలాగ వచ్చిందోనని అడగాలని తహతహలాడిపోయేవాణ్ని. కాని పెళ్లయిన కొత్తకదూ! నాకు అతని దగ్గరకు వెళ్లడంఅంటేనే సిగ్గు. ఇంక అతనితో మాట్లాడడం మాట వేరే చెప్పాలా! పోనిలే, మా అక్కయ్యచేత అడిగిద్దామంటే, మా అక్కయ్యకు నాకంటే ఎక్కువ సిగ్గు. ఎలాగ? పెద్ద 'ప్రోబ్లెమ్' వచ్చిపడింది. పోనిలే, ఆ ఉంగరాల జుట్టుకోసం, యింత కెర్రి ఎత్తిపోవడం ఏమిటని ఒక్కొక్కప్పుడు నాలో నేను అనుకున్నా, మనస్సు ఊరుకుంటేగా? ఏదో, అనవసరమైన ఆవేదన పడేది.

అటువంటి ఉంగరాలజుట్టు మనకీ వుంటే ఎంత అందంగా, వుండేదో అనుకొని, తీయనికలలతో నిలువుటద్దంలో చూచుకొనేవాణ్ని. తీరాజూస్తే, జుట్టంతా 'ప్లెయిన్'. ఎక్కడా ముచ్చటకి చూద్దామంటే ఒక వంపు వుండేది కాదు. పైగా జుట్టువంగితేగా! నిట్ట నిలువగా నుంచునేది. దానికోసం, నీళ్లు రాసి ఎంతో తంటాలుపడేవాణ్ని.

కాబట్టి, యీ విషయంగురించి తెలిసికోవాలని మంచి పట్టుదలగా వుండేది. కొన్నాళ్లయిన తరువాత సంక్రాంతిపండుగకి, మా బావని రమ్మని, రమ్మని రాయగా, ఆఖరికి వచ్చేడు. ఇంట్లో ఎప్పుడు చూచినా, ఉప్మాలు కాఫీలు వగైరాలు ఎప్పుడూ తయారవుతునే

వాళ్లూ, నేనూ

"ఎగేసి ?"

"అంతా చెబుతాలే. తోటలోనే కలుసుకుందాం. వెళ్తాను" అన్నాడు.

"ఎక్కడికి ?"

"చెప్పలేను. ఎక్కడికో పోతాను"

"భోజనం?"

"ఏమీ అక్కర్లేదు. వొస్తా" వెళ్ళిపోతున్నాడు.

నాకు ఎంతో జాలివేసింది. ఏం చెయ్యను?

"వోరేయ్ - మాట."

"ఏం?" అంటూ వొచ్చాడు.

"వుండ్రా - నా దగ్గిర డబ్బులున్నయ్ - ఇస్తాను."

"ఒద్దులే. వుండనీ - నాకేం ఆకలిగాలేదు."

"ఊహూఁ - కాదు" అంటూ ఇంట్లోకొచ్చాను. ఆ నిమిషంలో వాణ్ని చూడగానే నాకు కలిగినంత జాలి ఇదివరకెప్పుడూ కలగలేదు. తీసుకొచ్చి వాడికి అన్నం పెట్టగలిగే స్వతంత్రం ఇంట్లో నాకు లేదు. పెట్టెలో అరణాలున్నయ్. తీసి వాడి కిచ్చాను. "ఐతే ఇంటికి మరి వెళ్లవ్?" అన్నాను.

"ఈ జన్మలో" అని డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు. 'పాపం' అనుకున్నాను.

(సశేషం)

వుండేవి. అవును మరిచిపోయేను, క్రొత్త అల్లుడు వచ్చేడని కాబోలు.

ఈసారి వచ్చినప్పుడు మా బావ నాతో చాలా 'సోషల్'గా మాట్లాడడం మొదలుపెట్టేడు. మంచి అవకాశం దొరికినందుకు నాలో నేను చాలా సంతోషించాను. వెంటనే ఒంటరిగా వుండడం చూచి, "ఏమోయి, బావా! నీకీ ఉంగరాలజుట్టు ఎలాగ వచ్చింది" అని అడిగేశాను, ఎన్నాళ్లనుంచో నా మనస్సును వేధించుకు తింటున్న నా ప్రశ్నని.

"అడగ్గా, అడగ్గా మంచి ప్రశ్న అడిగేవోయి" అని ఒక వెకిలినవ్వు నవ్వేడు.

ఆ నవ్వు వినేసరికి బావ నన్ను 'ఇన్సల్ట్' చేస్తున్నాడా అనిపించింది. చుట్టూ చూచేను. ఇంకెవ్వరూ లేరు. మా అక్కయ్య మాత్రం అప్పుడే కాఫీ పట్టుకొని వస్తూంది. అక్కయ్య కొంపతీసి విందేమో అని విచారించా. ఆ!! వింటే విందనుకొని నాలో నేను సర్దుకొన్నాను.

'ఏమిటండోయి! బావ మరుదులు వేళాకోళాలు ఆడుకొంటున్నట్లున్నారు' అంది మా అక్క వయ్యారంగా మూతి త్రిప్పుకొంటూ.

"ఆ...! ఏమీలేదూ. మీ తమ్ముడికి ఒక పెద్ద సందేహము వచ్చింది, నాకీ ఉంగరాల జుట్టు ఎలాగ వచ్చిందీ అని—దానికి ఏమి చెప్పాలో తెలియక ఆలోచిస్తున్నాను."

"చెబితేఏంపోయిందండీ, ఏదో కుర్రాడు అడుగుతున్నాడామె!" అని అంది మా అక్కయ్య మాట సాగ తీసుకొంటూ.

మా అక్కయ్య నన్ను "కుర్రవాడన్నందుకు" నాకు చాలా చిన్నతనం అనిపించింది. కాని నాకేసు బావకి 'రికమెండ్' చేసినందుకు కోపాన్ని చంపేసుకొన్నాను.

మా అక్కయ్య వెళ్లినతరువాత చెప్పడం మొదలుపెట్టాడు బావ తన జుట్టు సంగతి. "నేను మొన్న మదరాసు వెళ్ళినప్పుడు మెషీనుచేత చేయించుకొన్నాను. నీకూ కావలిస్తే, నీవు మదరాసు వెళ్ళినప్పుడు చేయించుకోవచ్చు" అన్నాడు.

బావఅన్నమాటలు నాకు చాలా హాస్యాస్పదంగా కనబడ్డాయి. నన్ను వేళాకోళం చేస్తున్నందుకు నేను బాధపడకపోలేదు. నాకు ఉడుకుమోతుతనంకూడా వచ్చింది. కాని అది వెంటనే లోపలికి మింగేసుకొని, "అబద్ధాలు ఆడుతున్నావు బావా! అబద్ధాలు ఆడితే ఆడపిల్లలు పుట్టుతారు, జాగ్రత్త! నేను నీ పెళ్ళినాడే చూసేను, నీ ఉంగరాలజుట్టు." అని దీనంగా బ్రతిమాలేను - ఆ ఉంగరాల జుట్టుమీద నున్న మోజుకొద్దీ.

అయితే చెప్తాను విను అని మొదలుపెట్టేడు. "నాకూ, నీకు లాగే జుట్టు వంగేదికాదు. మొట్టమొదట ఉంగరా లుండేవికావు. ఆఖరికి వెళ్ళి అడిగేశాను, ఒక ఉంగరాల జుట్టుగల మా స్నేహితుడిని, దీనికి "క్లూ" ఏమిటని. కోడిగ్రుడ్లరసం జుట్టుకి రాస్తే, మరునాటికి జుట్టు ఉంగరాలు తిరిగిపోతాయి. నేను ఈవిధంగా చేస్తేనే నాకు వచ్చాయి."

మంచి సలహా చెప్పినందుకు

పరాభవం

మా బావకి "థేంక్స్" చెప్పి, అక్కడనుంచి వెళ్ళిపోయేను. ఆ రాత్రి ఎవరికీ తెలియకుండ, రెండు కోడి గ్రుడ్లను సంపాదించి, శుభ్రంగా ఆ రసాన్ని తలకి పట్టించి, వెళ్ళి మా డాబాగదిలో పడుక్కొన్నాను.

తెల్లారయేసరికి, జుట్టంతా అట్ల కట్టేసి, చీమలు పట్టేశాయి. చీమల బాధ భరించలేక, గట్టిగా కేకలు పెట్టేను.

ఇంట్లో ఉన్నవాళ్ళంతా గాభరాతో నా దగ్గిరికి పరుగెట్టుకి వచ్చేరు. అసలు సంగతంతా చెప్పేసేను. అందరూ ఆశ్చర్యపోయేరు.

"ఏమిటోయి! ఊరికినే చెప్తే, నిజంగా చేసేవు. ఇలాగ చేస్తావంటే నేను చెప్పకేపోదునే" అన్నాడు మా బావ ఆశ్చర్యాన్ని వెల్లడిస్తూ.

బావ నాకు "పరాభవం" చేసేడని విపరీతమైన కోపం వచ్చింది. కాని ఏం చేయగలను? నేను చేయగలది ఒక్కటే! అతనితో ఆ రోజంతా మాట్లాడడం మానేసేను.

ఇంట్లో వున్నవాళ్లంతా మా బావని ఏమీ అనలేక, నామీద మరి రెండు అక్షింతలు వేసేరు. మా అమ్మమాత్రం నన్ను తలంటికి, లోపలికి తీసికొని వెళ్లిపోయింది. ★

తగిన శాస్తి

పూర్వం అవంతి రాజ్యాన్ని అమరసింహుడనే రాజు పాలించేవాడు. అతనికి కృష్ణరాయుల వలెనే కవిత్వంలోనూ సాహిత్యంలోనూ అభిలాష మెండు. అతనివద్ద లింగదాసు అనే జంగము ప్రధానమంత్రిగా ఉండేవాడు. అతనికి విద్యాగంధం అంటలేదు. అందుచే అతడు పండితులెవరేనా కవిత్వం చేత రాజును మెప్పిస్తే తనపదవికేం ముప్పు వస్తుందోనని పండితులనందరినీ అవకతవక ప్రశ్నలు వేస్తూ అవమానిస్తూ ఉండేవాడు. అతను పండితులను 'బా - మే - తు - త' అనే ప్రశ్న వేసేవాడు. దానికి అర్థం చెప్పలేక పండితులు అవమానింపబడేవారు. ఈవిధంగా తన పదవిని కాపాడుకుంటున్నాడా లింగదాసు.

ఆ రాజ్యములోనే సూరిశాస్త్రి అనే యుక్తిపరుడున్నాడు. వానికి మంత్రిపదవి పొందాలని కుతూహలంగావుండేది. అందుచే మంత్రి యొక్క సంగతులన్నీ వివరంగా తెలుసుకున్నాడు. లింగదాసుకు భార్యాబిడ్డలు లేరు. ఒకవేశ్యమాత్రం ఉండేది. ఇది తెలిసిన శాస్త్రి ప్రతిరోజు ఆవేశ్యకు పంచాంగం చెప్తూ ఉండేవాడు. ఆమె ఏమిచ్చినాపుచ్చుకునేవాడుకాడు. ఒకరోజున ఆమె "శాస్త్రుల్లుగారూ ప్రతిరోజూ పంచాంగం చెప్తూ, నేనేమిచ్చినా పుచ్చుకోకుండాఉన్నారు. మీాకేమి కావాలో చెప్తే అది యిస్తాను" అని కోరింది. అందుకాతడు "లింగదాసు నడిగి బా - మే - తు - త అన్న దానికి అర్థం కనుక్కొని చెప్పమన్నాడు.

ఆ దినం లింగాదాసు వచ్చేసరికి మల్లిక (వేశ్య) అలక పాన్పు చేరివుంది. లింగదాసు ఆమెను ప్రతిమాలగా 'బా - మే - తు - త' అన్న దానికి అర్థం చెప్పమంది. "దీనిలోనే నా మంత్రిపదవి వుంది. ఇది ఎవరికేనా చెప్తే నా పదవికే ముప్పు

రాళ్ళపల్లి గౌరీపతిశాస్త్రి

కాబట్టి ఎవరికీ తెలియనివ్వకు" అని దానిఅర్థం చెప్పేడు. మరునాడు యథాప్రకారం శాస్త్రి రావడమూ, మల్లిక రహస్యం తెలియబర్చడమూ జరిగింది.

సూరిశాస్త్రి కాశ్మీరశాలువ ధరించి చెవులనున్న బంగారుకుండలాలు జిగేల్ మంటూవుంటే రాజుగారి సభకు వచ్చేడు. రాజుకు నమస్కరించేడు.

రాజు: ఎవరుమీారు ?

శాస్త్రి: నాపేరు సూరిశాస్త్రి. ప్రభువువారి అనుగ్రహం కోరి వచ్చేను.

రాజు: మంత్రీ! ఈతని పరీక్షింపుము.

లింగదాసు: చిత్తం.

శాస్త్రి: కాని ఒక్క నియమం మహారాజా. ఈతని పరీక్షలో నేను గెలిచి, నే నడిగినదానికి యితడు సమాధానం చెప్పకపోతే మంత్రిపదవినుండి తప్పుకొని నాకాపదవి యివ్వాలి.

రాజు: ఒప్పుకున్నావా లింగదాసూ.

లింగదాసు: చిత్తం ప్రభూ.

శాస్త్రి: మంత్రీ పరీక్షించు.

లింగదాసు: బా - మే - తు - త అన్న దానికి అర్థం తెలియజేయి?

శాస్త్రి: దాని సమాధానం వ్రాసి రాజుగారి కివ్వండి. తర్వాత నేను చెప్తాను.

లింగదాసు: సరే (అని ఒక తాటాకుపై అర్థం వ్రాసి అవనీశ్వరుని కిస్తాడు) ఇక మీారు చెప్పండి శాస్త్రిగారూ!

శాస్త్రి: దీనిఅర్థం ఇది హోమ రాజా (బా) బాపనోళ్ళకు (మే) మేకలకూ (తు) తులసి (త) తల్లడిస్తుంది. కారణం ఏమంటే బ్రాహ్మ

★ తగిన శాస్తి ★

ణులు తులసిని తెంపి చెవిని పెట్టుకుంటారు. మేకలూ తులసిని తిని వేస్తాయి. ఇక నే నడిగినదానికి ఇతను సమాధానం చెప్పాలి. మంత్రిగారూ! జ - గా - బూ - త అంటే ఏమిటో చెప్పండి.

రాజు: దీని సమాధానం నీవు కూడా వ్రాసియ్యి.

శాస్త్రి: చిత్తం (అని వ్రాసి యిచ్చును)

రాజు: లింగదాస్‌గారూ! చెప్ప లేరా దిక్కులు చూస్తున్నారు?

లింగదాస్: చిత్తం.

రాజు: అయితే నియమం ప్రకారం నీమంత్రిపదవి ఈసూరిశాస్త్రికి ఇచ్చి నీవు సెలవు పుచ్చుకోవచ్చును.

శాస్త్రిగారూ మీరు వ్రాసినది సభికులకు తెలియబర్చండి.

శాస్త్రి: (జ)జంగములకూ (గా) గాడిదలకూ (బూ) బూడిద (త) తల్లడిస్తుంది. కారణం ఏమిటంటే జంగములు బూడిద ఒళ్ళంతా పూసుకుంటారు. గాడిద బూడిద లోనే పడుకుని దొర్లుతుంది.

అని చదివేసరికి సభికులూ రాజూ పక్కలు చెక్కలయ్యేటట్లు నవ్వుకుంటారు. లింగదాసుగారు సభనుండి వెళ్ళిపోతాడు. పండితు లందరూ తమని అవమానించినందుకు తగినశాస్తి జరిగిందని సంతోషిస్తారు. సూరిశాస్త్రి మంత్రిగావుండి పండితుల నాదరిస్తాడు. తన కీపదవి లభించడానికి కారణమైన మల్లికను బహువిధాల బహూకరిస్తాడు. ★

టీచరు: దాసూ! నెలకు 15 రూపాయలు తీర్చే పద్ధతి మీద మీ నాన్నకు నేను 100 రూపాయలు అప్పు ఇచ్చే ననుకో! 6 నెలలు పోయిన తర్వాత మీనాన్న ఇంకా నా కెంత ఇవ్వాలిరా?

దాసు: 100 రూపాయలు సార్!

టీచరు: ఇంత చిన్న లెక్కను ఆపాటి అర్థం చేసుకో లేవురా!

దాసు: నేను లెక్కను అర్థం చేసుకున్నాను గాని మా నాన్నను మీరు అర్థం చేసుకో లేదండీ!

—ఎస్. బాలకృష్ణారావు, జయపురం.

★ దాక్షిణ్యాలోభం ★

(10-వ పేజీ తరువాయి)

"అయ్యగారు నన్ను తీసుకువచ్చారు. అయ్యగారు పొమ్మంటేనే పోతాను" అని ఖచ్చితంగా చెప్పివేసింది సుబ్బి. మీనాక్షి ఒక క్షణం స్తంభించిపోయింది. తన ఇంటి దాసి తన్నెదిరించడమే! తననే చులకన చేయడం! "పోతావా పోవా" అని అరిచింది మీనాక్షి కంపిస్తున్న పెదవులతో.

"అయ్యగారు పొమ్మంటేనే పోతానని చెప్పానుకదా, అమ్మగారూ" అంది సుబ్బి చలించకుండా.

మీనాక్షి భర్తదగ్గరకు పరుగెత్తింది. "నేను మొదట్లోనే చెప్పలేదూ, దానిది గడ్డి తినే బుద్ధి అని. తిన్న యింటి వాసాలు లెక్కపెట్టే బుద్ధి! దానిని ఇక ఒక క్షణం ఇంట్లో ఉంచడానికి వీలు లేదు. నేను పొమ్మంటే పోదట! మీరు పొమ్మనాలట. నేనంటే దానికంత అలుసయిపోయాను కాబోలు! పాపిష్టిముండ! దానిని జుట్టు పట్టుకొని అవతలకీడ్చేస్తారా లేదా" అంటూ ఆడపులిలా గాండ్రించింది మీనాక్షి.

శంకరం బెల్లం కొట్టిన రాయిలాగా మాట్లాడకుండా నిలబడిపోయాడు ఒక్కసారి సుబ్బికేసిచూసి తలవంచేసుకున్నాడు. సుబ్బి అతనికేసి సూటిగా చూసింది—ఏం జవాబు చెప్తారు, నన్ను పొమ్మనగలరా—అని అడుగుతున్నట్లు.

"ఏమండీ మాట్లాడరేం? నేను పొమ్మంటే పోదూ! నే నెవత్తె ననుకుందో! ఏం, దాన్ని క్షణం జుట్టుపట్టుకు ఈడ్చేస్తారా లేక నేను పుట్టింటికి వెళ్లిపోనా?" అని మళ్లీ ఉరిమింది మీనాక్షి. శంకరం పని అడకత్తెరలో పోకచెక్కలా అయింది. ఏమనాలో అతనికి తోచడం లేదు. ఇంతలో సమయానికి దేవుడిలా ఎవరో వీధిలోనుంచి "శంకరం" అని కేక వేశారు. బ్రతుకుజీవుడా అనుకుంటూ శంకరం వీధిలోకి పరుగెత్తాడు.

శంకరానికి సుబ్బితో వెళ్ళిపొమ్మని చెప్పనే అక్కర్లేకపోయింది. ఆమె ఆ రాత్రే ఎవరితోనూ చెప్పకుండా వెళ్లిపోయింది. మర్నాడు పొద్దున్న వెతుక్కున్న తర్వాత తెలిసింది ఆమె వెళ్ళిపోయిందని. మీనాక్షి కించితైనా చింతించలేదు సరికదా పీడావదిలిపోయింది అని ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచింది. కాని పోయేది చేతిలో ఏమైనా పట్టుకుపోలేదు కదా అని అనుమానం వేసి కంగారుగా అన్ని గదులూ చూసుకుని, అన్నీ ఉన్నాయి అని మనస్సు కుదుటబరుచుకుంది. కాని భార్య మాట వినేసరికి శంకరానికి ఎందుకో అనుమానం తోచింది. పెట్టె చూసుకున్నాడు. అరె! రైతు లంతకుముందురోజు ఇచ్చిన ఆరు వంద లేవీ? పెట్టె అంతా తిరగవేసి చూశాడు. అలమారా చూశాడు. చొక్కా జేబులూ, కోటుజేబులూ అన్నీ తడిమాడు. ఎక్కడా కనిపించలేదు. ఆరు వందలూ! పెట్టెలోనే పెట్టినట్లు తనకు పూర్తిగా జ్ఞాపకం. అతను వెతుక్కుంటూంటే మీనాక్షి అడిగింది "ఏమిటి, దేనికోసం వెతుకుతున్నారు" అని. "అఁ ఏమీ లేదు కళ్ళజోడుకోసం" అనేశాడు శంకరం కళ్లజోడు ఎదురుగా అలమారాలో ఉండగానే.

మర్నాడు మీనాక్షి అడిగింది అతనిని రైతులిచ్చిన ఆరు వందలూ బాంకులో కట్టేశారా అని. కట్టేశానన్నాడు శంకరం. అనక మరి ఏం చేయగలడు?

అందుకే ఏటి ఒడ్డున రావిచెట్టు నీడన కూర్చుంటే ముసలి బైరాగి ప్రతి పదిహేను నిమిషాలకీ ఒక్కసారి అంటూ ఉంటాడు "చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ!" అని. ★

★ ఇల్లాలు ★

(11-వ పేజీ తరువాయి)

చేద్దామా అనిపించింది. కాని మళ్ళీతట్టింది. నేను చేసినపని తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టటం. వారింట ప్రాణం తీసుకోటం మర్యాదస్థుడైన గృహస్థుకు ప్రాణాపాయం తెచ్చిపెట్టడమే కాక, వారి వంశమర్యాదను భంగపర్చటమని భావించి వెనుదీశాను. తెల్లవారగానే గ్రామస్థుల ఎదుట నన్ను నిలదీయగలరని దృఢంగా నమ్మాను దానితో శరీరం కంపించింది. తెల్లవారేలోగా ఇంచుమించు ఇరవై ముప్ఫైసార్లు తలుపులాగి చూచాను, కాని రాలేదు. దానితో మరింత భయపడ్డాను. తెల్లవారింది వారింట్లో కోడి ఎలుగెత్తి 'కొక్కొరోకో' అని కూసింది. అదిరిపడి మళ్ళీ వెళ్ళి తలుపులాగి చూచాను. తలుపుగొళ్లెం తీసివుంది. మునసబుగారు మంచంమీద ఇంకా నిద్రపోతున్నారు. ఇల్లాలు దొడ్లో ఏదో ఇంటిపని చేసుకుంటోంది. నేను గాబరాపడుతూ సామాన్లు సర్దుకొని అక్కడ ఉండడాని కిష్టంలేక వెంటనే బయలుదేరాను. అది గమనించి ఇల్లాలు వెంటనే భర్తను లేపింది. ఆయన లేవటంతో నాకు మరింత గాభరా ఎక్కువైంది. ఆయన మరోగదిలోనికి వెళ్ళి బట్టలు సవరించుకవచ్చి 'ఏమండీ అంత కంగారు పడతారెందుకు, తాపీగా స్నానంచేసి కాఫీ తాగి వెళ్ళండి' అని గృహస్థధర్మంగా అన్నాడు కాని ప్రేమపూర్వకంగా అన్న ఆమాటలతో నాకు శరీరం దహించుకుపోతున్నట్లయింది. ఎట్లాగో ముళ్ళమీద నుంచున్నట్లు వారికోరికనుమన్నించి తరవాతవెళ్తా 'వెళ్ళొస్తాను చెల్లెమ్మా' అన్నాను. 'వెళ్లిరండి అన్నయ్యగారూ' అందిఇల్లాలు. నాకామాట బల్లెంతో పొడిచినట్లయింది.

వెళ్ళి వెంటనే ఆత్మహత్య చేసుకోవడం మంచిదనిపించింది. మానవ మనస్తత్వం నీకు తెలియందికాదు, నాయనా. పాతిక సంవత్సరాలనుండి ఈ విషయం జ్ఞాపకమొచ్చినప్పుడల్లా నేను చేసినతప్పు ఎవరితోనో చెప్పి పశ్చాత్తాపంపొంది దానిద్వారా కొంత మనఃస్థిమితం కలుగచేసుకుంటున్నాను. అని ఆయన కథ ముగించాడు.

అప్పట్లో ఆయనముఖంచూస్తే నాకే జాలివేసింది. ఓ విధంగా ఓదార్చకపోతే బాగుండదని మొదలుపెట్టా.

'తప్పు మానవుడు చెయ్యకపోతే మ్రాను చేస్తుందిటండీ? చేసిందానికి మీరు పశ్చాత్తాపం చెప్పుకోనే చెప్పుకుంటున్నారు. చేసినతప్పు ఈ రోజుల్లో ఎవరు చెప్పుకుంటారండీ? మీరు చేసినపాపం చెప్పుకున్నందువల్ల అప్పుడే పోయింది." అని సముదాయించేప్పటికి ఆయనముఖంలో కొంత వికాసం కన్పించింది.

"నాయనా యువకుడవు. నాకథ జ్ఞాపకముంచడం నీకూ మంచిదే నాయనా." అని చెప్పి ఆయన తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. నేను ఆలోచనలోపడ్డాను, ఆయన చెప్పిన సంఘటనలో ఆయన పడ్డ అవస్థకన్న ఆ ఇల్లాలి తెలివితేటలు, సహనం నా ఆలోచనలో ప్రథమస్థానాన్ని పొందాయి ఎంత నేర్పరితనంగా తన మానం రక్షించుకొని అతిథిని అగౌరవపర్చకుండా పంపింది! ఆడవాళ్ళందరూ అంత తెలివిగా ఉంటే ప్రపంచమే బాగుపడిపోను, అనిపించింది. ★



ఆర్. ఎన్. ఆర్. పిక్చర్సువారి "జాతకఫలం" లో సూర్యకళ, చలం.

రష్యాలో భారతీయ చలన చిత్రోత్సవం

భారతీయ ఫిలిం ప్రతినిధుల ప్రయాణం

ఈ నెల 18 వ తేదీన పదిహేనుమంది భారతీయ ఫిలిం ప్రతినిధులు సోవియెట్ యూనియన్‌కు బయలుదేరివెళ్లారు. వీరందరూ హిందీ సినిమారంగానికి చెందినవారే. ప్రతినిధివర్గ నాయకుడు కె. ఎ. అబ్బాస్; సభ్యులు రాజకపూర్, నర్గీస్, దేవానంద్, చేతన్ ఆనంద్, బిమల్ రాయ్, నిరూపరాయ్, బల్రాజ్ సానీ, అనిల్ బిశ్వాస్, హృషీకేశ్ ముఖర్జీ, శలీల్ చౌధురి, ఆర్. కర్మార్కర్, ఆగా జానీ, విజయభట్, ఆర్. ఖన్నా.

వీరు బొంబాయినుండి విమానంలో వెళ్ళారు. విమానాశ్రయంవద్ద వందలకొలది అభిమానులు గుమిగూడి వీడ్కోలిచ్చారు. ఆ ప్రదేశమంతా పూలదండలతో నిండిపోయిందట. ఫిలింఅభిమానుల సమూహాన్ని ఆపడానికి విమానాశ్రయాధికారులకు బ్రహ్మప్రయత్నం అయిందట. విమానం బయలుదేరుతుండగా "ఇండో సోవియెట్ స్నేహం వర్ధిల్లుగాక!" అనే నినాదాలు మిన్నుముట్టాయి.

ఈనెల 23 న మాస్కో, లెనిన్‌గ్రాడ్, స్టాలిన్‌గ్రాడ్‌లలో భారతీయ చలన చిత్రోత్సవం ఒకేసారిగా ప్రారంభమైన సందర్భంలో హాజరు కావడానికి ఈ ప్రతినిధివర్గం వెళ్ళింది. ఆతరువాత 8 వారాలపాటు ఈ ప్రతినిధులు సోవియెట్ యూనియన్‌లో పర్యటించబోతున్నారు. వీరు తమతో అయిదు హిందీ చిత్రాలను పట్టుకు వెళ్లారు.

ఇవి ఆవారా, అంధియాన్, దో బిఘా జమీన్, బైజూబావ్రా, రాహి. భారత ప్రభుత్వపు ఫిలిం డివిజన్ నిర్మించిన ఆరు డాక్యుమెంటరీ చిత్రాలుకూడా వీరు తమతో తీసుకు వెళ్ళారు. ఇవి గ్లింప్సెస్ ఆఫ్ అస్సాం, డ్రమ్స్ ఆఫ్ మణిపూర్, రాజస్థాన్, మెమొరీస్ ఆఫ్ మీవార్, ఇండస్ట్రియల్ మైసూర్, కో ఆపరేటివ్ ఫార్మింగ్ అనేవి.

ఒక అగ్రరాజ్యం ఇన్ని భారతీయ చిత్రాలను ఉత్సవపూర్వకంగా ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయడం ఇదే మొదటిసారి అని ప్రతినిధివర్గ నాయకుడు కె. ఎ. అబ్బాస్ అన్నాడు.

ఏటేటా 50 భారతీయ చిత్రాలు రష్యాలో ప్రదర్శించడానికి ఆ దేశ ప్రభుత్వం అంగీకరించిందని, ఇప్పటికే 5 చిత్రాలను వారు రష్యన్ భాషలోకి 'డబ్' చేశారనీ, వీటికి 200 కాపీలు తీయించారనీ, వచ్చే సంవత్సరారంభంలో మరో పది చిత్రాలు డబ్ చేయబడతాయని అబ్బాస్ తెలిపారు.

నటీనటులు, డైరెక్టర్లు, టెక్నీషియన్లు, సంగీత దర్శకులు తమ ప్రతినిధివర్గంలో చేర్చుకోబడ్డారనీ, వీరు రష్యాలో ఫిలిం వ్యక్తులను కలుసుకుని సోవియెట్ ఫిలిం పరిశ్రమలోని తాజాపరిణామాలను గూర్చి చర్చిస్తారనీ, అక్కడి స్టూడియోల్లో అనుసరించబడే ప్రొడక్షన్ విధానాన్ని పరిశీలిస్తారనీ ఆయన అన్నారు.

"భారతీయచిత్రాలను వరసగా రష్యాలో విడుదల చేసే ఏర్పాట్లనుకూడా పూర్తి చేస్తాము. ఉభయదేశాల నటీనటుల, టెక్నీషియన్లమధ్య సహకారాన్ని సాధించడానికి, ఉభయులకు పనికివచ్చే చిత్రాలను సమష్టిగాతీసే అవకాశాలను సాధించడానికి ప్రయత్నిస్తా"మని ఆయన చెప్పారు.

భారతీయ ఫిలిం పరిశ్రమను నవీన పద్ధతుల్లో నడిపించేందుకుగాను రష్యానుంచి టెక్నీషియన్లను, యంత్రపరికరాలను తీసుకురావడానికి వీలుందేమో కూడా వీరు చూస్తారట.

మాస్కో, లెనిన్‌గ్రాడ్, స్టాలిన్‌గ్రాడ్ లలో తీరికలేని కార్యక్రమం ఉన్నప్పటికీ, మరొక 19 పెద్ద సోవియెట్ నగరాలనుంచి కూడా ఆహ్వానాలు తమకు వచ్చాయని అబ్బాస్ అన్నారు.

దేవానంద్, తాను సోవియెట్ ఫిలిం పరిశ్రమలోని ప్రతిశాఖనూ వివరంగా పరిశీలించి మనదేశానికి సరిపడినవాటిని గ్రహించడానికి ప్రయత్నిస్తానన్నాడు.

రాజ్ కపూర్ తను చాలా ఆశలతో సోవియెట్ యూనియన్ వెడుతున్నానన్నాడు. నర్గిస్ తనకీ ప్రయాణం ఎంతో సంతోషంగా ఉందనీ, నటులను రచయితలను నెత్తిమీద పెటుకుని పూజించే రష్యాదేశానికి వెళ్లడం ఆనందదాయకంగా ఉందనీ అన్నది. ★



"మాగోపి" లో మాస్టర్ వెంకటేశ్వర్.

ఫిలిం సంగీతంగూర్చి డా॥ కేస్కార్ ప్రకటన

ఫిలిం సంగీతం విషయంలో ఆలిండియా రేడియో వైఖరి ఏమీ మారలేదని కేంద్ర మంత్రి డా॥ కేస్కార్ ఇటీవల రాజ్య సభలో ప్రకటించారు.

"లలిత సంగీతం అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. శాస్త్రీయం కాని దాన్ని లలిత సంగీతం అని వ్యవహరిస్తున్నారు. సంగీత జ్ఞానం, కౌశలం కలవారినే లలిత సంగీత కార్యక్రమాలకు స్థానిక అధికారులు తీసుకొంటున్నారు.

ఫిలిం సంగీతం సాధారణంగా చవకబారుగా ఉంటున్నందువల్ల దాన్ని తగ్గించడానికి ఆలిండియా రేడియో కొంతకాలం కిందట నిర్ణయించింది. ఈ నిర్ణయం తమకు హానికరమని కొంతమంది ప్రొడ్యూసర్లు అసమ్మతి తెలిపి, తమ కంట్రాక్టులను నిలిపివేశారు. చాలమంది ప్రొడ్యూసర్లు తమ కంట్రాక్టుల పరిమితి కాలం దాటిపోగానే తిరిగి కొత్త కంట్రాక్టులు వ్రాసుకోలేదు. వీరిలో పలువురు ఇటీవల దీనివల్ల లాభంలేదని గ్రహించి తిరిగి కంట్రాక్టులు వ్రాసుకోవాలనుకుంటున్నారు ఈ విషయమై ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి.

ఇంకా బుద్ధితెలియని పిల్లలు, వయసు వస్తున్న బాలురు తప్ప సాధారణ కుటుంబీకులందరూ ఫిలిం సంగీతాన్ని ఏవగించుకొంటున్నారని కొన్ని భోగట్టాలద్వారా తెలుస్తోంది," అని డా॥ కేస్కార్ ప్రకటించారు.

శాస్త్రీయ సంగీతాన్ని రేడియో శ్రోతలపై బలవంతాన రుద్దినందువల్ల ప్రయోజనం లేదని, శ్రోతల్లో అనేకులు ఫిలిం సంగీతం ప్రసారంచేసే సిలోన్ మొదలైన రేడియో కేంద్రాలను అభిమానిస్తున్నారని డా॥ కేస్కార్ గారికి తెలియకపోవడం విచారకరం. లలితసంగీతమంటూ ఏమీ లేదనీ, అశాస్త్రీయమైనదల్లా లలిత సంగీతమే నని అనడం, ప్రపంచంలో ప్రతిదాన్నీ తెలుపు నలుపుల్లో మాత్రమే చిత్రించాలనే మన సత్వం లాంటిది. ఫిలింసంగీతంపై డా॥ కేస్కార్ వైఖరి వెనకటికి వ్యావహారిక భాషావాదంపై గ్రాంథిక భాషావాదుల వైఖరివలెనే ఉంది.

"జాతక ఫలం"

ఆర్. ఎస్. ఆర్. పిక్చర్స్ వారి "జాతక ఫలం" అక్టోబరు 1 వ విశాలాంధ్ర అంతటా విడుదలవుతుందని తెలుస్తోంది. రంగారావు, నాగేంద్రరావు, చలం, జోగారావు, ఋష్యేంద్రమణి, సూర్యకళ, సూర్యకాంతం, మొదలైనవారు నటించారు. ఆర్. నాగేంద్రరావుగారు దర్శకుడు. మాటలు పాటలు తోలేటి. న్యూథియేటర్స్‌వారి చిత్రాలలో పని చేసిన యూసఫ్ ముల్జీ కామెరామన్. కె॥ శే॥ సుబ్బరామన్ గారి బృందంలో పని చేసిన ఆర్. గోవర్ధనంగారు సంగీత దర్శకుడు.

"మన ఇళ్లల్లో పెళ్లిళ్లంటేనే పెద్ద సమస్య. అందులో అయిష్టపు సంబంధాల్ని, మేనరికాల్ని తప్పించుకోవాలంటే కలిగే మోమాటాలు, తంటాలు చెప్పలేం. ఇట్టి సందర్భాల్లో 'జాతకాలు కలిసి రావద్దూ?' అనే సూక్తిని యుక్తిగా ప్రయోగించి తప్పించుకొంటారు కొందరు. కాని ఒకొక్కప్పుడు తమ యుక్తికి తామే గోతిలో పడతారు," అనేదాన్ని ఈ చిత్రం నిరూపిస్తుందట.

ఫిలిం బహుమతి పతకాలకు డిజైన్లు

ఉత్తమ చిత్రాలకు రాష్ట్రపతి, ప్రధాని ఇవ్వనున్న బహుమతి పతకాలకు డిజైన్లు నిర్ణయింపబడినవి. ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రానికి రాష్ట్రపతి యిచ్చే బహుమతి పతకానికి బొంబాయి చిత్రకారుడు, ఆర్టు డైరెక్టరు అయిన కనూదేశాయ్ పంపిన డిజైను స్వీకరించబడింది. కథాచిత్రానికి రాష్ట్రపతి ఇచ్చే బహుమతి పతకానికి బొంబాయి చిత్రకారుడు అజయకుమార్ చక్రవర్తి పంపిన డిజైను, పిల్లల ఉత్తమ చిత్రానికి ప్రధాని ఇచ్చే బహుమతి పతకానికి కలకత్తా చిత్రకారుడు రంజిత్ కుమార్ పంపిన డిజైను స్వీకరించబడినవి. ఈ చిత్రకారులకు ఒకొక్కరికి 500 రూ॥ల బహుమతి ఇవ్వబడుతుంది. మొత్తం 89 మంది చిత్రకారులు డిజైన్ల పోటీలో పాల్గొన్నారట.

ఇండియాకు రావాలని చాప్లిన్ అభిలాష

వచ్చే సంవత్సరంలో చార్లీ చాప్లిన్ ఇండియా రావాలని అనుకుంటున్నాడట.

సోవియెట్ యూనియన్‌కు వెడుతూ జెనీవాలో కొంతసేపు ఆగిన భారతీయ ఫిలింప్రతినిధివర్గంవారు తన్ను కలుసుకొని ఇండియా రమ్మని కోరగా చాప్లిన్ ఈ సంగతి తెలియజేశాడు.

ఈ సంవత్సరమే పుట్టిన తన బిడ్డకు ప్రయాణానికి తట్టుకోగల వయస్సు రాగానే, తానూ తన భార్య ఊనా ఓనీల్ (అమెరికన్ నాటక రచయిత యూజీన్ ఓనాల్ కుమార్తె) భారతదేశం వస్తామని, భారతదేశం చూడడం తన జీవితంలో ఇంతవరకూ తీరనికోరిక అనీ, బహుశా వచ్చే 9 నెలలలోగా ఈ ప్రయాణం జరుగవచ్చుననీ చాప్లిన్ అన్నాడు.

ప్రఖ్యాత నటుడు, రచయిత, నిర్మాత అయిన చార్లీచాప్లిన్ ప్రస్తుతం మరొక చిత్రం సంకల్పించాడు. పరమాణుశక్తిని మానవజాతి శ్రేయస్సుకుగాని మానవజాతి విధ్వంసనానికిగాని ఉపయోగించడంలో ఉత్పన్నమయ్యే నైతిక సమస్యలను ప్రధాన వస్తువుగా తీసుకుని చాప్లిన్ ఈ చిత్రం కథ తయారుచేశాడు. రోజుకి మూడు నాలుగు గంటలసేపు స్క్రిప్టును తన కార్యదర్శికి 'డిక్టేట్' చేస్తున్నాడట. కొన్ని సీనులు నచ్చక ఇరవైఅయిదేసి సార్లుకూడా తిరుగ వ్రాయిస్తున్నాడట. ఈ చిత్రంలో, ప్రజల జీవనప్రమాణాభివృద్ధికి అణుశక్తిని వినియోగింపదలచిన ఒక రాజుగా చాప్లిన్ నటిస్తాడట. కాని ఆ రాజును అతని ప్రభుత్వం పదవీభ్రష్టుణ్ణిచేసి, దేశంనుండి బహిష్కరిస్తుందట.

తన రాజకీయ విశ్వాసాల మూలంగాను, జెనీవాలోని పరిస్థితుల పరిశీలనమూలంగాను ఈ చిత్రం తీయాలనే అభిలాష కలిగినట్లు ఆయన చెబుతున్నాడు. రాజులు, రాణులు ఎలా జీవిస్తారో, ముఖ్యంగా దేశ బహిష్కృతులైన రాజులు, రాణులు ఎలా ఉంటారో స్వయంగా చూసి నేర్చుకోడానికి స్పెయిన్ మాజీరాణి విక్టోరియా యూజినీ భవనానికి చాప్లిన్ చాలాసార్లు వెళ్ళి వచ్చాడట.

మద్రాసులో "పాంపోష్"

అంబాలాల్ జె. పటేల్ నిర్మించిన గేవాకలర్ చిత్రం "పాంపోష్" (ఇంగ్లీషు) మద్రాసు మినర్వాలో గత శుక్రవారం విడు

(54-వ పేజీ చూడండి)



"పల్లెపడుచు"లో డా॥ పరోపకారంగా వంగర వెంకటసుబ్బయ్య.

సంపాదకునకు లేఖ :

"అల్లూరి సీతారామరాజు" చిత్రం ఎందుకు తీయరాదు?

ఆర్యా,

సినిమాలు వచ్చినది లగాయతూ, యింతవరకూ అనేక రకాలైన కథలు చిత్రరూపములో వచ్చినవి. రామాయణం, భారతం మొదలగు పౌరాణికాలు, పోతన, కాళిదాసులాంటి భక్తుల గాథలు, పాతాళ భైరవి, కీలుగుఱ్ఱంలాంటి జానపదచిత్రాలు, రైతుబిడ్డ, మాలపిల్ల లాంటి సాంఘిక చిత్రాలు చూశాం. పరదేశి, చక్రపాణి లాంటి చిత్రాలు కూడా చూస్తూవున్నాం. కాలంతోబాటు ప్రజల భావాలు కూడా మారుతూవున్నవి. మహాత్ముల గాథలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు చూడాలనే కోర్కె వీరిలో నానాటికీ ప్రబలంగా బయలుదేరుతోంది. ఇది గ్రహించే నేటి మన నిర్మాతలు కొందరు ప్రయోజనకర చిత్రాలు తీయాలనే సంకల్పంతో ముందుకు వచ్చారు. అల్లూరి సీతారామరాజు, వీరేశ లింగం, మహాకవి గురజాడ వ్రాసిన కన్యా శుల్కం మొదలగు పేర్లు యిప్పుడు పైకి రావటానికి వీరి ప్రయత్నాలే కారణం. అయితే వీరు ప్రకటన లిచ్చిన వెనకాలే, కొంత ఆందోళన కూడా బయలుదేరింది. ఈ ఆందోళన చూస్తే వీటిని చిత్రాలుగా తీయటం యిష్టంలేనివారు కొందరున్నారని పిస్తోంది. వీరి వాదంలో కొంత నిజమున్నా దాన్ని అతిగా మాత్రం చిత్రిస్తున్నారని వీరి వాదన పరిశీలిస్తే తేలుతుంది. "కన్యా శుల్కం" సుప్రసిద్ధ కవి, సంఘసంస్కర్త అయిన గురజాడ అప్పారావుగారి నాటకం. ఆయన ఎంతో నిశితంగా భావగర్భితంగా వ్రాసిన నాటకం. అల్లూరి సీతారామరాజు విప్లవ వీరుడు, సామ్రాజ్యవాదులకు పక్కలో బల్లెంలాంటి వాడు. "ఇటువంటి ఇతివృత్తాలు యీ నిర్మాతల చేతుల్లో పడితే—అవి ఎందుకూ పనికిరాకుండా యీమధ్య వస్తున్న చిత్రాలవలె పరువు, ప్రతిష్ఠ లేకుండా పోతవి. దానితో ఆమహా పురుషుల పేరుకే కళంకం వస్తుంది. అంచేత మీ రెవ్వరూ వీరి చరిత్రల జోలికి, రచనల జోలికి పోవ"ద్దని వీరి వాదన. వీరి ఆందోళనకు ముఖ్యకారణా లుగా వీటినే పేర్కొంటున్నారు. ఇందులో కొంతవరకూ సత్యమున్నది. దానిని కాదనలేం. ఈమధ్య విడుదలైన చిత్రాలు చూసినతరువాత ప్రతివాళ్ళకు యీవిధమైనఅనుమానం కలగడం సహజమే. అయితే వీరి ఆందోళన అంతా, వారి చిత్రాలజోలికిపోకుండా, మళ్ళీ ఆ గ్రంథా లను యథాప్రకారం బూజు పట్టిన పెట్టె లలో పెట్టేస్థితికి తీసుకు వెడుతుందికాని, చిత్రనిర్మాణంలో లోపాలు లేకుండా, ఆ మహాత్ముల ప్రతిష్ఠకు భంగం కలగకుండా జాగ్రత్తగా తీసి ఆంధ్రప్రజకు అందజేసే టట్టుగామాత్రం వీరి ఆందోళన లేదు. దీనితో అల్లూరి సీతారామరాజు చిత్రం తలపెట్టిన నిర్మాతలు వెనకడుగు వేశారు.

అయితే ఎంతకాలం యీ కల్పిత గాథ లతో నిండిన చిత్రాలు చూడటం? వాస్త విక గాథలు - ముఖ్యంగా దేశస్వాతంత్ర్యం కోసం, సంఘసంస్కరణకోసం పాటుపడిన నాయకుల గాథలు చూసే అవకాశం కల గదా...? ఇతర దేశాలలో దాస్యవిము క్తికి, దేశరక్షణకు పాటుపడిన వీరుల గాథ లతో చిత్రాలు నిర్మింపబడి ప్రజల మన్నన పొందుతూవుంటే మన చిత్రపరిశ్రమ యింకా, ఈ ఊహాచిత్రాలతో నిండి వుండవలసినదేనా? అనే అనుమానం కలుగు తుంది. అయితే యీ వీరులగాథలు విజయ వంతంగా చిత్రించే దర్శకులు లేరా...? అని ఆలోచించినప్పుడు ఉన్నారనే అని పిస్తుంది. అల్లూరి సీతారామరాజుగురించి ఆలోచిద్దాం...

మనదేశంలో బ్రిటిష్‌వాళ్లు పెత్తనం చెలాయిస్తూ, మనపై జరుపుతూవున్న హింసాకాండమూస్తూ సహించలేక అనేక రకాలైన దాడులు ప్రారంభించాడు. మన్యంలో కోయ ప్రజల సహాయంతో పితూరీ లేవదీశాడు.

★ "అల్లూరి సీతారామరాజు" ★

ఈ గాథ అంతా రాజకీయాలతో ప్రారంభమైనది. తెల్లదొరలను పారద్రోలాలనే పట్టుదలతోనే యితని వీరోచిత చర్యలు నడిచాయి. ఇటువంటి చరిత్ర తీయాలంటే - యితని పోరాట పద్ధతులను, ఆశయాలను వాస్తవికంగా చిత్రీకరించవలసి యున్నది. ఈ గాథ పూర్తిగా తెలుసుండి, రాజకీయ స్థాయి వున్న వాళ్ళు అయితే, యీ గాథను విజయవంతమైన చిత్రంగా నిర్మించవచ్చు. ఈ సామర్థ్యం లేనివారు బహుశా వీటిజోలికి పోరేమో. అటువంటి సామర్థ్యంగలవారు ప్రస్తుతం చిత్రరంగంలో లేకపోలేదు. తాతినేని సూర్యప్రకాశరావుగారి పేరు ఈ సందర్భంలో ఉదహరించవచ్చునని నా ఉద్దేశ్యం. మిగతావారు పనికిరారని నా ఉద్దేశ్యంకాదు. ఉదాహరణగా మాత్రమే వారిపేరు చెబుతున్నాను. వీరు కొంతకాలం ప్రసిద్ధ దర్శకులైన ప్రసాద్ గారికి సహాయకులుగా వుండి అనుభవం గడించారు. ప్రకాశరావుగారు తీసిన చిత్రాలు అన్నీకూడా ఆర్థికవిజయం పొందలేకపోయినా, పాడుకాకుండా, అందరి మన్ననలను పొందినవి. అటు రాజకీయ పరిజ్ఞానం - యిటు చిత్రపరిశ్రమలో అనుభవంగల ప్రకాశరావుగారివంటి దర్శకులు యిటువంటి చిత్రాలను విజయవంతంగా నిర్మించవచ్చు. అదీకాక అటు అల్లూరి వీరులలాంటి జీవితగాథలు తెలుసుండి—యిటు చిత్రపరిశ్రమలో పనిచేస్తున్న రచయితలు కూడా వున్నారు. అనుభవంగలవారు వుండికూడా అటువంటి పవిత్ర గాథలను నిర్మించకపోవటం శోచనీయం. ఇకముందైనా వీరు యిటువంటి చిత్రాలు నిర్మించి ఆంధ్రప్రజలకు అందజేయటం చాలా అవసరం.

అడబాల—మద్రాసు. ★


మద్రాసులో "పాంపోష్"

(52-వ పేజీ తరువాయి)

దలయింది. గురువారంనాడు పత్రికావిలేఖరులకు చూపబడింది. దీని దర్శకుడు ఇజ్రామీర్. ఇటాలియన్ ఫొటోగ్రాఫర్ కార్లస్ ఎఫ్. మార్కొనీ ఛాయాగ్రాహకుడు. "కాశ్మీర కమలం" అని నామాంతరం కలిగిన ఈ చిత్రం కాశ్మీర్‌లోని దాల్ సరస్సుపై నౌకాగృహాల్లో నివసించే సామాన్యప్రజల దైనందిన జీవననాటకాన్ని అత్యంత రమణీయంగా చూపిస్తుంది నటీనటులు కూడా చాలమంది ఆ ప్రాంత ప్రజలే. కథానాయిక ఒక మూగబాలిక. అందరి చేతా నిరాదరింపబడి, చివరి కామె జీవితాన్ని భరించలేక సరస్సు అడుగున ఉన్న "ఆదర్శలోకం" లో అనంత శాంతిని పొందుతుంది. వర్డ్స్‌వర్త్ ప్రకృతి కవిత్వాన్ని, ముఖ్యంగా లూసీగ్రే పద్యాల్ని జ్ఞాపకం చేసేటట్లుండే ఈ చిత్రంలో ప్రకృతి రామణీయకానికి పేరుపొందిన కాశ్మీర్‌లోని సుందరదృశ్యాలన్నీ పోగుచేసి చూపబడ్డాయి. ఈ చిత్రం కానిస్, బెర్లిన్ చలన చిత్రోత్సవాలలో ప్రదర్శించబడింది. ఇటువంటి చిత్రాలు మనదేశంలో బ్రహ్మాండమైన ఆర్థికవిజయం పొందకపోవచ్చుగాని, ఇతరదేశాల్లో ప్రదర్శించడానికి, తద్వారా భారతదేశపు ప్రతిష్ఠను ఇనుమడింపజెయ్యడానికి ఎంతైనా తోడ్పడతాయి. భారతీయ చిత్రాలు ఇంకా పౌరాణిక యుగంలోనే ఉన్నాయని అనుకుంటున్న పాశ్చాత్యులకు ఈమాదిరి చిత్రాలు సరియైన అభిప్రాయం కలిగించగలవు.

"పాంపోష్" నిర్మాణంలో పాల్గొన్న యూనిట్‌తోనే ఎ. జె. పటేల్ మరొక గేవాకలర్ చిత్రాన్ని అంతర్జాతీయ ప్రదర్శన కోసం తీయనున్నారనీ, రాజపుత్రస్థాన ప్రజలజీవితం చూపించే ఈ చిత్రంలో హిందీ తార శశికళ నాయికపాత్ర ధరిస్తుందనీ తెలుస్తోంది. ★


"అమరసందేశము" లో దేవీ విగ్రహంవద్ద అమరనాథ్



విజ్ఞాన వీధి

?. పొరబారడం ఎందుచేత?

'న్నే కొందరు పలక మార
ారడం పొరబోవడం అని
. దూరంగానున్న వాళ్లు
ప్పుడు పొరబారుతుందనీ,
లో ఎవరైనా మనలను
ప్పుడు మనం పొలమారుతుందనీ సామాన్యంగా
అది శాస్త్రసమ్మతం కాదు.
కారణాన్ని పరిశీలిద్దాం.



ిన ఆహారము నోటిలో నుంచి
గుండె పొట్టలోనికి పోతుంది.
వాయువు శ్వాసనాళము
రితిత్తులను చేరుకొంటుంది.
శ్వాసనాళము — రెండూ
నాళాలే యైనప్పటికి అవి
తుక లోనికి తెరుచు
చేత నోటిలో నుంచి
సనాళము లోనికీ,
గాలి అన్నవాహిక
ంది. ముక్కులో
వాహిక లోనికి
టిలో నుంచి
ళము గుండా
దం ఉంది.
డా ఉండ

డానికై దక్కని యేర్పాటు శరీరంలో కలదు. శ్వాసనాళము యొక్క ముఖము వద్ద ఒక కండర పు మూత ఉంది. దీనిని అధి జిహ్వక (*Epiglotlis*) అని అంటారు. ఇది చాల సునిశితమైన అవయవం. నమలిన ఆహారం నోటినివదలి గొంతుకలోనికి వస్తున్నదని తెలియగానే అది క్రిందికి వంగి శ్వాసనాళము యొక్క ముఖభాగాన్ని కప్పి వేస్తుంది. అప్పుడాహారం అధి జిహ్వక మీదుగా అన్నవాహిక లోనికి పోతుంది. కాని మనమాహారాన్ని మ్రింగేటప్పుడు మాట్లాడడం, నవ్వడం తటస్థిస్తే శ్వాసనాళాన్ని పూర్తిగా మూయడానికి అధి జిహ్వకకు సాధ్యపడదు. ఆ సందర్భంలో అధిజిహ్వక మీదుగా అన్నవాహిక లోనికి పోవుచున్న ఆహారంలో కొద్ది భాగం శ్వాసనాళం లోనికి చొరబారడం తటస్థపడవచ్చు. కాని శ్వాసనాళం లోనికి ఆహారపదార్థాలు రావడానికి శరీరం సమ్మతించదు. వెంటనే అది ప్రతిక్రియను పూనుకొంటుంది. పెద్దదగ్గును కల్పించి, తప్పుదారిని వచ్చి శ్వాసనాళంలోనికి ప్రవేశించిన ఆహారాన్ని పైకి నెట్టివేయిస్తుంది. ఆ నెట్టివేయడం పూర్తిఅయ్యేవరకు దగ్గు ఆగదు. ఆ సమయంలో చాలమంది అలసిపోతారు; కొందరికి ముచ్చెమటలు పడతాయి.

చిన్న పొరరూపంలో నున్న అధి జిహ్వక శ్వాసనాళ ముఖాన్ని పూర్తిగా కప్పకపోవడంవలన అన్నవాహిక లోనికి పోవుటకు బదులు శ్వాసనాళంలోనికి ఆహారము పోవడాన్నే 'పొరబారుట' అంటారు.

'అనంత్.' ★

కాలక్షేపం

(6-వ పేజీ తరువాయి)

ఆ ప్రాకులాటవల్లనే అది వవ్వులాటపాలవుతుంది. మన శరీరంమీద మన మనస్సుకు విశ్వాసం పోయింది అంటే, మన మనస్సుకు కేంద్ర అధికారార్హత పోతున్నదనే గ్రహించాలి. ప్రభుత్వంమీద ప్రజలకు విశ్వాసం పోతుందిగాని, ప్రజలమీద ప్రభుత్వానికి విశ్వాసం పోతుందా? అని ప్రశ్నించవచ్చు. కాని, యీ రోజున మన ఆంధ్రరాష్ట్రి ప్రభుత్వానికి, అటువంటి విషమసమస్య ఏర్పడింది. ఆంధ్రరాష్ట్రం ముందు గతికి దారి ఏదో తెన్ను ఏదో ఇంకా కండ్లుతెరచి చూచుకోగల స్థితికి రావలసియున్నాము. ఆంధ్రరాష్ట్రం ఇంకా కండ్లు తెరవని అంధరాష్ట్రంగానే ఉంది. ప్రకాశమానమైన ప్రశస్త ప్రజాభ్యుదయం అంటే ఏమిటో చూపించండి అని ప్రకాశం గారిని ముఖ్య మంత్రిగా ఆంధ్రులు నిర్ణయించుకొన్నారు. ఒక్క సంవత్సరంకూడా ఓపిక పట్టలేమన్నట్లుగా, ఆయనకు యీ ముఖ్యమంత్రిపదవిని యీనాముగా ఇచ్చినామన్నట్లుగా, యీనాముల సత్యాగ్రహం సాగించడమున్నూ; కల్లు త్రాగనిదే ఇక కళ్లు తెరువలేమన్నట్లుగా కల్లుకోసం కలువరించడమున్నూ; ఇదంతా మన ఆంధ్రరాష్ట్రి వ్యవహారోదంతంగా, అనంతంగా, మంత్రివర్గంమీదిపంతంగా, సాగుతోంది. అందువల్ల ఆంధ్రమంత్రులు ఏ పనీ చేయకుండా, సంకల్పరహితులై నిర్వికల్పసమాధిలో ఉండడం ఉత్తమం. ఆ విషయమే ప్రకాశంపంతులుగారు విశ్వప్రకాశంగా ప్రవచించి ప్రబోధించవలసివచ్చినది. మామీద విశ్వాసం లేదని ప్రకటిస్తే యీ రోజున యీ మంత్రిపదవులనుండి తప్పుకొనుటకు సిద్ధంగా ఉన్నామని చెల్లించారు. తామరాకు మీది నీటిబిందువు చందమున ఉండడమే నిర్వికల్పసమాధి. నళినీ దళగత జలకణమువలె ప్రవర్తించగల్గిన "యోగీంద్రు మర్యాదన్" ఆంధ్ర మంత్రివర్గం వ్యవహరించడంవల్ల "ప్రజ" అనే శరీరానికికూడా నిర్వికల్పావస్థ ఏర్పడుతుంది. ఈ యోగశక్తి ఆంధ్ర ప్రభుత్వానికి సిద్ధించింది. మన ప్రజాప్రభుత్వానికిది మంచియోగం అని మనమెంచినట్లయితే, విశ్వాసరాహిత్యం అనేది ఉండదు. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములనుకూడా బంధించవలసి వస్తుంది. యోగసమాధిలోనుండెడి నిశ్చలమైననిర్వికల్పమైన మన ప్రభుత్వపరాతత్వం మనకు మోక్షమార్గం చూపించగలదు. మంత్రిపదవులు కావాలనే సంకల్పమూ ఉండకూడదు. మాకు యీ మంత్రి పదవులు అక్కరలేదనే సంకల్పమూ ఉండకూడదు. ప్రాకులాటయున్నూ లేదు- ఆకులపాటున్నూ లేదు.

అందుకనే త్యాగబ్రహ్మంగారు "సంకల్పమేటికో మనసా!" అన్నారు. అటువంటి త్యాగమూర్తులకు,ఆంధ్రకేసరులకు "ప్రాణానిల త్యాగాపాయ భయంబునన్" లయమై పోవును.

"భోగాపేక్ష తొలంగ" అనే మాట యోగుల విషయములో, త్యాగుల విషయములో, చెప్పవచ్చు. కాని, "పూజ్యత చెడెన్" అనే మాట వారి విషయంలో త్యాజ్యం. ఇటువంటివారి భుజస్కంధముల మీదనే ఉంది నేటి మన ఆంధ్రరాజ్యం.

జై! ఆంధ్ర మాతకు జై! ★



"మాగోపి" లో నాగయ్య.

★

"జాతకఫలం" లో ఋష్యేంద్రమణి, సూర్యకాంతం, రంగారావు

